

నంది పత్రిక

మా కలం - సామాన్యుడి బలం

జాతీయ తెలుగు దిన పత్రిక

GSTIN 37AMRPM5719R1ZX

RNI-APTEL/2023/88162



ఎడిటర్: మహేష్ యాదవ్ | ఆంధ్ర ప్రదేశ్ , తెలంగాణ | సంపుటి : 4 | No: KNL/3-77(D)/2026-2028 | సంచిక : 301 | బుధవారం 11 - నవంబర్ - 2026 | పేజీలు : 12 | వెల-3

Published From : KURNOOL circulated at Nandyal Alluri SitharamaRaju,Anakapalli,Anantapur,Annamayya,Bapatla,Chittoor, Konaseema,East Godavari,Eluru,Guntur,Kakinada,Krishna,,NTR, Palnadu,Parvathipuram Manyam,Prakasam,Nellore,Sri Sathya Sai,Srikakulam,Tirupati,Visakhapatnam,Vizianagaram,West Godavari, YSR Kadapa,Hyderabad,Ranga Reddy,Medchal-Malkajgiri,Warangal,Hanamkonda,Nizamabad,Karimnagar, Khammam,

చంద్రబాబు, పవన్ కల్యాణ్ లకు ఘన స్వాగతం పలికిన మంత్రులు..

చప్పట్లతో మార్మోగిన కేబినెట్ హాలు




చంద్రబాబు అధ్యక్షతన కొనసాగతున్న కేబినెట్ సమావేశం
సమావేశ మందిరంలోకి ప్రవేశించే ముందు కరచాలనం
2లో చేసుకున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్
స్థానిక ఎన్నికల్లో 'హిట్ కొట్టాం' అంటూ మంత్రుల నినాదాలు

అమరావతిలోని వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఏపీ మంత్రివర్గం సమావేశం అయింది. అయితే, సమావేశానికి ముందు కేబినెట్ హాల్ వద్ద ఆహ్లాదకరమైన, ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి భారీ విజయం నమోదు చేయడంతో మంత్రుల్లో నూతనోత్సాహం కనిపించింది. ఈ నేపథ్యంలో సమావేశ మందిరంలోకి వెళ్లే ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఒకరికొకరు ఆప్యాయంగా కరచాలనం చేసుకున్నారు. అనంతరం ఇరువురు నేతలు కలిసి హాల్‌లోకి అడుగుపెట్టారు.చంద్రబాబు, పవన్ కల్యాణ్ లోపలికి రాగానే మంత్రులంతా ఒక్కసారిగా లేచి నిలబడి చప్పట్లు కొడుతూ ఘన స్వాగతం పలికారు. మంత్రుల హర్షధ్వానాలతో కేబినెట్ సమావేశ మందిరం మార్మోగిపోయింది. ఎన్నికల్లో కూటమి అద్భుతమైన స్ట్రైక్ రేట్ సాధించిందంటూ మంత్రులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా 'హిట్ కొట్టాం' అంటూ పలువురు మంత్రులు

సోనియా గాంధీ పుస్తకంపై బీజేపీ ఫైర్..

అది ఆత్మకథ కాదు వైట్ వాషింగ్



సోనియా గాంధీ రాసిన ఆత్మకథ 'బిలాంగింగ్'పై బీజేపీ తీవ్ర విమర్శలు
గాంధీ కుటుంబ చారిత్రక తప్పిదాలను కప్పిపుచ్చే ప్రయత్నమే ఈ పుస్తకమని ఆరోపణ
ఎమర్జెన్సీని పొరపాటుగా చెప్పి దాన్ని సాధారణీకరించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శ
బాబ్రీపై ఏడ్చిన సోనియా.. సిక్కుల ఊచకోతపై ఎందుకు కన్నీరు పెట్టలేదని బీజేపీ ప్రశ్న
నట్వర్ సింగ్ పుస్తకం విడుదలకు ముందు ఆయనను ఎందుకు కలిశారో చెప్పాలని డిమాండ్
2లో

కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ రాసిన ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్'పై బీజేపీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించింది. ఈ పుస్తకం నెహ్రూ-గాంధీ కుటుంబం చేసిన చారిత్రక తప్పిదాలను కప్పిపుచ్చి, వారి పాపాలను శుభ్రపరిచే ఒక 'వైట్‌వాషింగ్' ప్రయత్నమని బీజేపీ అధికార ప్రతినిధి సీఆర్ కేశవన్ ఆరోపించారు. తాజాగా ఈ పుస్తకం విడుదలైన నేపథ్యంలో ఆయన 'ఎక్స్' వేదికగా ఘాటు వ్యాఖ్యలు చేశారు. తన అత్త, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీ ఒక పొరపాటని, చివరికి ఆమె కూడా అదే అభిప్రాయానికి వచ్చారని సోనియా తన పుస్తకంలో పేర్కొన్నారు. ఆ సమయంలో ఇందిర తన చిన్న కుమారుడు సంజయ్ గాంధీని అదుపులో ఉంచి ఉంటే, జరిగిన నష్టంలో చాలా వరకు నివారించి ఉండేవారని ఆమె అభిప్రాయపడ్డారు. అయితే, ఈ వ్యాఖ్యలను కేశవన్ తోసిపుచ్చారు.

తాడిపత్రిలో మళ్లీ రాజుకున్న రాజకీయం..

అనంతపురంలో రాజకీయ దుమారం
రేపిన జేసీ ప్రభాకర్ రెడ్డి ఫ్లెక్సీలు
2021 నాటి స్థానిక ఎన్నికల
ఫలితాలతో పోలుస్తూ వైసీపీ నేతలకు
సూటి ప్రశ్నలు 2లో



ఏపీ కేబినెట్ నిర్ణయాలు..
పలు ప్రాజెక్టులకు ఆమోదముద్ర

సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గ భేటీ
కొత్త పారిశ్రామిక పాలసీలకు గ్రీన్ సిగ్నల్
భారీ పరిశ్రమలకు ఏపీ కేబినెట్ ఆమోదముద్ర

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన వెలగపూడిలోని సచివాలయంలో ఈరోజు జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు


2లో

వైసీపీకి అన్నపరెడ్డి విజయభాస్కర్ రాజీనామా..

వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి
రాజీనామా చేసిన అన్నపరెడ్డి
విజయభాస్కర్ రెడ్డి
వైసీపీలో నేతలకు గుర్తింపు
లేదని విమర్శ 2లో



ఐఓఏ కమిషన్ చైర్‌పర్సన్‌గా సింధు..



సింధుకు హృదయపూర్వక శుభాకాంక్షలు
తెలిపిన మంత్రి లోకేశ్
రెండుసార్లు ఒలింపిక్ పతక విజేతగా ఒక
తరానికి స్ఫూర్తిగా నిలిచారని ప్రశంస
సింధును చూసి ఆంధ్రప్రదేశ్ గర్విస్తోందని ట్వీట్
కొత్త బాధ్యతల్లో విజయవంతం కావాలని ఆకాంక్ష
2లో

కాకినాడ జీజీహెచ్‌కు మహర్దశ!

300 పడకల మల్టీ స్పెషాలిటీ
ఆసుపత్రిగా అభివృద్ధి
ఆధునిక వైద్య సదుపాయాలతో రూపురేఖలు
మార్చేందుకు ఎంపీ సానా సతీష్ బాబు చొరవ
ఆసుపత్రి ఆధునీకరణకు ముందుకొచ్చిన కేంద్ర
ప్రభుత్వ రంగ సంస్థ హైట్స్
వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి
వీరపాండియన్‌తో ఎంపీ సమావేశం
2లో

కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి (జీజీహెచ్) రూపురేఖలు మారనున్నాయా? 300 పడకల మల్టీ స్పెషాలిటీ



టీడీపీ, వైసీపీ ఒకే మాట..



పవన్ కల్యాణ్ వ్యక్తిగత వ్యవహారంపై కీలక ఆదేశాలు
సోషల్ మీడియా పోస్టులు, ట్రోలింగ్‌కు దూరంగా ఉండాలని శ్రేణులకు సూచన
రాజకీయాలకు వ్యక్తిగత జీవితాలను దూరంగా ఉంచాలనే సంకేతం!
బూతు రాజకీయాలకు బ్రేక్.. టీడీపీ, వైసీపీ కీలక నిర్ణయం!
పవన్ వ్యక్తిగత వ్యవహారంపై రెండు పార్టీల సంయమనం!
వ్యక్తిగత విమర్శలకు నో.. టీడీపీ, వైసీపీ ఆదేశాలు!
రాజకీయాలు వేరు.. వ్యక్తిగత జీవితాలు వేరు!

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. రాజకీయ ప్రత్యర్థులుగా నిత్యం విమర్శలు, ప్రతి విమర్శలతో హోరెత్తించే తెలుగుదేశం పార్టీ (టీడీపీ), వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) ఒక విషయంలో మాత్రం సంయమనం పాటించాలని తమ శ్రేణులకు సూచించాయి. జనసేన అధినేత, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన భార్య అన్నా లెజినోవాతో విడిపోతున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో రెండు పార్టీలు కీలక నిర్ణయాలు తీసుకున్నాయి. నాయకుల వ్యక్తిగత జీవితాలను రాజకీయ విమర్శలకు ఆయుధాలుగా వాడుకోవద్దని స్పష్టం చేశాయి. వ్యక్తిగత అంశాలపై అనుచిత వ్యాఖ్యలు, సోషల్ మీడియా పోస్టులు, ట్రోలింగ్‌కు దూరంగా ఉండాలని తమ నాయకులు, కార్యకర్తలు, 2లో

నక్సల్ రహిత భారత్ తర్వాత ఇదే మన ప్రధాన లక్ష్యం: అమిత్ షా

2028 డిసెంబర్ 31 నాటికి డ్రగ్స్
రహిత గుజరాత్ లక్ష్యమన్న అమిత్ షా
దేశవ్యాప్తంగా 2029 నాటికి డ్రగ్ ఫ్రీ
ఇండియా సాధన
డ్రగ్స్ సమాచారం కోసం డిసెంబర్ 1
నుంచి హెల్ప్‌లైన్ 1033 2లో



10,715 మంది ఉద్యోగుల కుటుంబాల్లో కూటమి ప్రభుత్వం వెలుగులు నింపింది:

స్థానిక ఎన్నికల్లో కూటమి
ప్రభుత్వానికి ఘన విజయం
పోస్టల్ బ్యాలెట్లలో కూటమికి
63.6 శాతం ఉద్యోగుల
మద్దతు తెలిపారన్న ఆలపాటి
2లో



ఐఓఏ కమిషన్ చైర్‌పర్సన్‌గా సింధు..

ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి, తెలుగు తేజం పీవీ సింధుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అథ్లెట్స్ కమిషన్ చైర్‌పర్సన్‌గా సింధు ఎన్నికైన సందర్భంగా ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.“రెండు పర్యాయాలు ఒలింపిక్ పతకాలు సాధించి, బ్యాడ్మింటన్ కోర్టులో నవతరానికి స్ఫూర్తిగా నిలిచిన పీవీ సింధు.. ఇప్పుడు భారత క్రీడారంగంలో కీలక నాయకత్వ బాధ్యతలను చేపట్టడం గర్వకారణం. సింధూ, మీ విజయాలను చూసి ఆంధ్రప్రదేశ్ గర్విస్తోంది“ అని లోకేశ్ తన సందేశంలో కొనియాడారు. క్రీడాకారిణిగా అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో మైలురాళ్లను అధిగమించిన ఆమె, ఇప్పుడు క్రీడా పరిపాలనలోనూ విజయవంతంగా రాణించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కీలక బాధ్యతల్లో సింధు ఘన విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు లోకేశ్ పేర్కొన్నారు. సింధు ఈ నూతన పదవిని చేపట్టడం భారత క్రీడారంగానికి శుభపరిణామమని పలువురు క్రీడాభిమానులు, ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కుటుంబ సమేతంగా పవన్ కల్యాణ్‌ను కలిసిన వంగవీటి రాధా..

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌ను విజయవాడ నగర నూతన మేయర్‌గా ఎన్నికైన వంగవీటి రాధాకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళగిరిలోని డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో ఈ భేటీ జరిగింది. వంగవీటి రాధాకృష్ణ తన కుటుంబ సభ్యులతో కలిసి పవన్ కల్యాణ్‌తో భేటీ అయ్యారు.విజయవాడ మేయర్‌గా ఎన్నికైన సందర్భంగా పవన్ కల్యాణ్‌ను కలిసిన రాధాకృష్ణ, ఆయనకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ భేటీ ఎంతో ఆత్మీయ వాతావరణంలో సాగింది. నూతనంగా మేయర్ బాధ్యతలు చేపట్టనున్న వంగవీటి రాధాకృష్ణకు పవన్ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. అలాగే రాధాకృష్ణ కుటుంబ సభ్యులను ఆయన ఆప్యాయంగా పలకరించారు.

విజయవాడ నగర అభివృద్ధి, ప్రజా సంక్షేమం లక్ష్యంగా పనిచేయాలని, ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉండాలని ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ ఆకాంక్షించారు.

కాకినాడ జీజీహెచ్‌కు మహర్దశ!

ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు కీలక ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు ప్రత్యేక చొరవతో ప్రస్తుత ఆసుపత్రిని ఆధునీకరించి, అత్యాధునిక వైద్య సదుపాయాలు, పరికరాలు, ప్రత్యేక వైద్య విభాగాలతో అభివృద్ధి చేసే ప్రతిపాదన ముందుకొచ్చింది. ఈ ప్రాజెక్టు అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ హెచ్‌ఎల్‌ఎల్ ఇన్‌ఫ్రా టెక్ సర్వీసెస్ లిమిటెడ్ (హైట్స్) ఆసక్తి వ్యక్తం చేయడంతో ఈ దిశగా ముందడుగు పడింది. ఈ ప్రతిపాదనపై మంగళవారం విజయవాడలో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి వీరపాండియన్‌తో హైట్స్ ప్రతినిధులు సమావేశమయ్యారు. సంస్థ వైస్ ప్రెసిడెంట్ రత్నాచలం, అరుంధతి తదితరులు పాల్గొన్నారు. కాకినాడ జీజీహెచ్‌ను 300 పడకల మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రాథమిక అంశాలు, ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలు, చేపట్టాల్సిన పనులపై చర్చించారు. ఆసుపత్రి ప్రస్తుత పరిస్థితులు, అవసరమైన మౌలిక వసతులు, ఆధునిక వైద్య పరికరాల ఏర్పాటు వంటి అంశాలను పరిశీలనకు తీసుకున్నారు.

ఒకే చోట అన్ని రకాల ప్రత్యేక వైద్య సేవలు..

కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి ఉమ్మడి తూర్పుగోదావరి ప్రాంతంతోపాటు పరిసర జిల్లాలు, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ప్రధాన ప్రభుత్వ వైద్య కేంద్రంగా ఉంది. ప్రతిరోజూ అనేక మంది రోగులు వివిధ రకాల వైద్య సేవల కోసం ఈ ఆసుపత్రిపై ఆధారపడుతున్నారు. పెరుగుతున్న జనాభా, మారుతున్న ఆరోగ్య అవసరాలకు అనుగుణంగా ఆసుపత్రిలో మరిన్ని ఆధునిక వైద్య సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో 300 పడకల మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తే రోగులకు ఒకే చోట వివిధ ప్రత్యేక వైద్య సేవలు అందించే అవకాశం ఏర్పడుతుంది. ఆధునిక ఆపరేషన్ థియేటర్లు, అత్యవసర చికిత్స విభాగాలు, ఇంటెన్సివ్ కేర్ యూనిట్లు, నిర్ధారణ పరీక్షల పరికరాలు, మెరుగైన రోగుల వార్డులు వంటి సదుపాయాల కల్పనకు అవకాశం ఉంటుంది. ప్రాజెక్టు తుది రూపకల్పనలో ఏయే విభాగాలు, సదుపాయాలు ఏర్పాటు చేస్తారనేది స్పష్టమవుతుంది.

ఇతర నగరాలకు వెళ్లే అవసరం తగ్గే అవకాశం..

ప్రస్తుతం కొన్ని క్లిష్టమైన వ్యాధులకు సంబంధించిన ప్రత్యేక వైద్య చికిత్సలు, అత్యాధునిక పరీక్షలు అందుబాటులో లేకపోవడంతో రోగులు విశాఖపట్నం, విజయవాడ వంటి నగరాలకు వెళ్లాల్సి వస్తోంది. దీనివల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడుతోంది. ప్రయాణ ఖర్చులు, వసతి, చికిత్స కోసం ఎదురయ్యే ఇబ్బందులు రోగులతోపాటు వారి కుటుంబ సభ్యులకూ భారంగా మారుతున్నాయి. జీజీహెచ్ ఆధునీకరణ పూర్తయి అవసరమైన ప్రత్యేక వైద్య విభాగాలు అందుబాటులోకి వస్తే ఈ పరిస్థితిలో మార్పు వచ్చే అవకాశం ఉంది. స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు పొందేందుకు వీలవుతుంది. అత్యవసర పరిస్థితుల్లో సకాలంలో చికిత్స అందించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఏర్పడితే రోగులకు మరింత ప్రయోజనం చేకూరుతుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు మరింత చేరువవుతాయి.

హైట్స్ అనుభవంతో ఆధునీకీకరణ..

హెచ్‌ఎల్‌ఎల్ ఇన్‌ఫ్రా టెక్ సర్వీసెస్ లిమిటెడ్ (హైట్స్) కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ పరిధిలోని ప్రభుత్వ రంగ సంస్థ హెచ్‌ఎల్‌ఎల్ లైఫ్‌కేర్ లిమిటెడ్‌కు 100 శాతం అనుబంధ సంస్థ. ఆసుపత్రుల మౌలిక వసతుల అభివృద్ధి, రూపకల్పన, ఇంజినీరింగ్, నిర్మాణ నిర్వహణ, వైద్య పరికరాల కొనుగోలు, బయోమెడికల్ ఇంజినీరింగ్, ఆసుపత్రుల నిర్వహణ వంటి రంగాల్లో ఈ సంస్థ సేవలు అందిస్తోంది. ఈ సంస్థకు ఉన్న సాంకేతిక అనుభవాన్ని కాకినాడ జీజీహెచ్ ఆధునీకరణకు వినియోగించుకునే అవకాశాలపై సమావేశంలో చర్చించారు. ఆసుపత్రికి అవసరమైన మౌలిక సదుపాయాలను గుర్తించడం, వైద్య పరికరాల అవసరాలను అంచనా వేయడం, ప్రాజెక్టు అమలు విధానాన్ని రూపొందించడం వంటి అంశాలు తదుపరి కార్యాచరణలో కీలకం కానున్నాయి.

వైద్య సిబ్బందికి మెరుగైన వసతులు.. యువ వైద్యులకు అవకాశాలు..

ఆసుపత్రి ఆధునీకరణతో రోగులకే కాకుండా వైద్యులు, నర్సులు, సాంకేతిక సిబ్బందికి కూడా మెరుగైన పని వాతావరణం ఏర్పడే అవకాశం ఉంది. ఆధునిక వైద్య పరికరాలు, ప్రత్యేక చికిత్సా విభాగాలు అందుబాటులోకి వస్తే వైద్య విద్యార్థులు, యువ వైద్యులు, నర్సింగ్ సిబ్బందికి నైపుణ్యాభివృద్ధికి అవకాశం లభిస్తుంది. కొత్త వైద్య విభాగాలు ఏర్పాటు చేస్తే వైద్యులు, నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, రేడియాలజీ సిబ్బంది, బయోమెడికల్ ఇంజినీర్లు, ఇతర సహాయక సిబ్బంది అవసరం ఏర్పడవచ్చు. దీంతో స్థానికంగా వైద్య రంగానికి అనుబంధ ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంది. అయితే ఉద్యోగాల సంఖ్య, కొత్త నియామకాలపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం: సానా సతీష్ బాబు

కాకినాడతోపాటు పరిసర ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను స్థానికంగానే అందుబాటులోకి తీసుకురావాలన్నది తన ప్రయత్నమని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు పేర్కొన్నారు. అత్యవసర, ప్రత్యేక వైద్య చికిత్సల కోసం ఇతర నగరాలకు వెళ్లాల్సిన పరిస్థితిని తగ్గించాలన్న లక్ష్యంతో ఈ ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయడం ద్వారా సామాన్య, పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్యం అందించవచ్చని పేర్కొన్నారు.

కార్యరూపం దాల్చితే కాకినాడ వైద్య రంగానికి కొత్త దశ..

300 పడకల మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిగా కాకినాడ జీజీహెచ్ అభివృద్ధి చెందితే ప్రభుత్వ వైద్య రంగంలో కీలక మార్పునకు అవకాశం ఉంటుంది. మెరుగైన వైద్య సేవలు, ఆధునిక పరికరాలు, ప్రత్యేక చికిత్సా విభాగాలు అందుబాటులోకి రావడంతో కాకినాడతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు ప్రయోజనం చేకూరుతుంది. అయితే ప్రాజెక్టు తుది ప్రతిపాదన, నిధుల సమీకరణ, నిర్మాణ పనులు, పరికరాల ఏర్పాటు, వైద్య సిబ్బంది నియామకాలపై స్పష్టత రావాల్సి ఉంది. సమావేశంలో చర్చించిన అంశాలు కార్యరూపం దాల్చి ఆసుపత్రి ఆధునీకరణ పూర్తయితే కాకినాడ ప్రభుత్వ వైద్య సేవలకు కొత్త రూపు వచ్చే అవకాశం ఉంది

టీడీపీ, వైసీపీ ఒకే మాట..

టీడీపీ ఐటీడీపీ కీలక ప్రకటన ఈ వ్యవహారంపై టీడీపీ సోషల్ మీడియా విభాగమైన ఐటీడీపీ స్పందించింది. రాజకీయ నాయకులు, వారి కుటుంబ సభ్యుల వ్యక్తిగత జీవితాలపై ఎలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయకూడదని స్పష్టం చేసింది. అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులెవరిపైనా వ్యక్తిగత దాడులకు దిగకూడదని సూచించింది. సోషల్ మీడియాలో అనవసర చర్చలు, కించపరిచే పోస్టులు, వ్యక్తిగత విమర్శలను ప్రోత్సహించబోమని తెలిపింది. ఐటీడీపీకి అనుబంధంగా ఉన్న ఖాతాల నుంచి ఇలాంటి వ్యాఖ్యలు వస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. వ్యక్తిగత అభిప్రాయాల పేరుతో ఇతరులను కించపరిచే వ్యాఖ్యలకు తమ సంస్థ బాధ్యత వహించదని పేర్కొంది.

వైసీపీ అధిష్ఠానం నుంచి స్పష్టమైన ఆదేశాలు

మరోవైపు వైసీపీ కేంద్ర కార్యాలయం కూడా పార్టీ నాయకులు, అధికార ప్రతినిధులు, కార్యకర్తలు, సోషల్ మీడియా శ్రేణులకు ప్రత్యేక సూచనలు జారీ చేసింది. పవన్ కల్యాణ్ వ్యక్తిగత వ్యవహారంపై ఎవరూ బహిరంగంగా వ్యాఖ్యలు చేయవద్దని ఆదేశించింది. సోషల్ మీడియాలో ఈ అంశానికి సంబంధించిన పోస్టులపై చర్చలు చేయడం, కామెంట్లు పెట్టడం, ఇతరుల పోస్టులకు స్పందించడం, ఫొటోలు, వీడియోలు, ఇతర సమాచారాన్ని షేర్ చేయడం వంటివి చేయకూడదని స్పష్టం చేసింది. బహిరంగ సమాచార ప్రసారంలో సంయమనం, బాధ్యతతో వ్యవహరించాలని కోరింది.


రాజకీయాలకు వ్యక్తిగత జీవితాలను దూరంగా ఉంచాలనే సంకేతం!

టీడీపీ, వైసీపీ మధ్య గత కొన్నేళ్లుగా రాజకీయ విమర్శలతో పాటు సోషల్ మీడియాలోనూ తీవ్రస్థాయిలో పోరు సాగుతోంది. ముఖ్యంగా నాయకుల వ్యక్తిగత జీవితాలు, కుటుంబ వ్యవహారాలు కూడా గతంలో రాజకీయ చర్చల్లో ప్రస్తావనకు వచ్చాయి. 2024 ఎన్నికల సమయంలోనూ పవన్ కల్యాణ్ వ్యక్తిగత జీవితంపై విమర్శలు రాజకీయ చర్చల్లో చోటుచేసుకున్నాయి. అయితే తాజా పరిణామంలో రెండు పార్టీల నుంచి వచ్చిన సూచనలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. రాజకీయంగా ఎన్ని విభేదాలున్నా వ్యక్తిగత జీవితాలను గౌరవించాలనే సందేశాన్ని ఈ నిర్ణయాలు ఇస్తున్నాయి. రాజకీయ విమర్శలు విధానాలు, పాలన, ప్రజా సమస్యలకే పరిమితం కావాలనే చర్చకు ఈ పరిణామం తెరతీసింది.

సోషల్ మీడియాలో చర్చ.. హుందాతనంపై అభిప్రాయాలు


రెండు ప్రధాన రాజకీయ పక్షాల సోషల్ మీడియా విభాగాలు దాదాపు ఒకే సమయంలో సంయమనం పాటించాలని సూచించడంతో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది. వ్యక్తిగత విషయాల్లో గోప్యతను గౌరవించడం అవసరమని పలువురు నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. రాజకీయ ప్రత్యర్థుల వ్యక్తిగత జీవితాలపై దాడులు చేయకుండా ఇదే తరహా విధానాన్ని భవిష్యత్తులోనూ కొనసాగించాలని కామెంట్లు చేస్తున్నారు. మరోవైపు ఈ ఆదేశాలు క్షేత్రస్థాయిలో ఎంతవరకు అమలవుతాయి? సోషల్ మీడియా శ్రేణులు వాటిని పాటిస్తాయా? అన్నది ఆసక్తికరంగా మారింది. రాజకీయ విమర్శలకు, వ్యక్తిగత దూషణలకు మధ్య గీత గీయడంలో ఈ పరిణామం కీలక చర్చకు దారితీస్తోంది.

నక్సల్ రహిత భారత్ తర్వాత ఇదే మన ప్రధాన లక్ష్యం: అమిత్ షా



2028 డిసెంబర్ 31 నాటికి గుజరాత్‌ను పూర్తిగా మాదకద్రవ్యాల రహిత (డ్రగ్ ఫ్రీ) రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా ‘డ్రగ్ ఫ్రీ ఇండియా’ సాధనకు 2029 డిసెంబర్ 31ని గడువుగా నిర్ణయించామని, అయితే ప్రధాని నరేంద్ర మోదీ, తానూ గుజరాత్‌కు చెందిన వారం కావడంతో రాష్ట్రం ఏడాది ముందే ఈ లక్ష్యాన్ని అందుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అహ్మదాబాద్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో సుమారు రూ.1,400 కోట్ల విలువైన అభివృద్ధి పనులను అమిత్ షా ప్రారంభించారు. వీటిలో ఇస్కాన్–సనంద్ ఎలివేటెడ్ కారిడార్‌తో పాటు పలు గృహ నిర్మాణ ప్రాజెక్టులు ఉన్నాయి. అనంతరం ఆయన మాట్లాడుతూ, దేశాన్ని నక్సల్స్ రహితంగా మార్చిన తర్వాత తదుపరి ప్రధాన లక్ష్యం డ్రగ్స్ రహిత భారత్‌ను నిర్మించడమేనని అన్నారు.రాష్ట్రంలో మాదకద్రవ్యాల నియంత్రణ కోసం డిసెంబర్ 1 నుంచి ‘1033‘ టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తెస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలు డ్రగ్స్ అక్రమ రవాణా, వినియోగంపై ఈ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని, వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ప్రత్యేక కంట్రోల్ రూమ్ ద్వారా తక్షణమే కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. డ్రగ్స్ విక్రయాల ద్వారా వచ్చే నిధులు ఉగ్రవాద కార్యకలాపాలకు చేరుతున్నాయని హెచ్చరించారు. డ్రగ్స్ మహమ్మారిని అంతం చేయడంలో ప్రజల భాగస్వామ్యం కీలకమని అమిత్ షా పేర్కొన్నారు. విద్యార్థుల ప్రవర్తనను ఉపాధ్యాయులు నిశితంగా గమనించాలని సూచించారు. బాధితులకు చికిత్స అందించేందుకు డీ–అడిక్షన్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, వారి వివరాలు కూడా బయటకు రానివ్వమని ఆయన స్పష్టం చేశారు.

10,715 మంది ఉద్యోగుల కుటుంబాల్లో కూటమి ప్రభుత్వం వెలుగులు నింపింది:



రాష్ట్రంలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థాగత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం సాధించిన విజయం ప్రభుత్వ పాలనకు లభించిన స్పష్టమైన ప్రజా రెఫరెండం అని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ విజయంలో కీలక పాత్ర పోషించిన ప్రజలకు, ప్రభుత్వ యంత్రాంగానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల పోస్టల్ బ్యాలెట్లలో ఏకంగా 63.6 శాతం మంది ఉద్యోగులు కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా ఓటు వేసి సంపూర్ణ మద్దతు ప్రకటించారని ఆలపాటి తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు ఎదుర్కొన్న సమస్యలను ప్రస్తావిస్తూ, అప్పట్లో దాదాపు రూ.40,000 కోట్ల బకాయిలు పెట్టి, రివర్స్ పీఆర్సీ పేరుతో వేతనాలు తగ్గించారని విమర్శించారు. ఉద్యోగులను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేయడమే కాకుండా, ఉపాధ్యాయులను మద్యం దుకాణాల వద్ద నియమించి వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన దాదాపు రూ.30,000 కోట్ల బకాయిలను విడుదల చేసి ఉద్యోగులకు ఆర్థిక భరోసా కల్పించిందని ఆలపాటి వివరించారు. 2004 నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగాలు పొందిన 10,715 మంది ఉద్యోగులను సీపీఎస్ నుంచి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) పరిధిలోకి తీసుకువచ్చి వారి కుటుంబాల్లో వెలుగులు నింపామని చెప్పారు. ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు పెంపు, పీఎఫ్, డీఏ బకాయిల క్రమబద్ధీకరణ వంటి చర్యలతో ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, ఉద్యోగుల సహకారంతో రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని ఆయన స్పష్టం చేశారు.

సోనియా గాంధీ పుస్తకంపై బీజేపీ ఫైర్.. అది ఆత్మకథ కాదు ‘వైట్‌వాషింగ్‘

ఎమర్జెన్సీ సమయంలో జరిగిన ప్రాథమిక హక్కుల ఉల్లంఘన, పత్రికా స్వేచ్ఛపై ఆంక్షలను అంగీకరించకుండా, దాన్ని ఒక సాధారణ పొరపాటుగా చిత్రీకరించి, సమర్థించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. పుస్తకంలో బాబ్రీ మసీదు కూల్చివేత ఘటన గురించి ప్రస్తావిస్తూ తాను ఏడ్చానని సోనియా చెప్పడాన్ని కేశవన్ తప్పుబట్టారు. “బాబ్రీ మసీదు కోసం కన్నీళ్లు పెట్టుకున్న సోనియా గాంధీ, కాంగ్రెస్ హయాంలో 1984లో జరిగిన సిక్కుల ఊచకోతలో వేలాది మంది అమాయకులు చనిపోయినప్పుడు కనీసం ఒక్క కన్నీటి చుక్కైనా కార్చారా?“ అని ఆయన ప్రశ్నించారు. 26/11 ముంబై ఉగ్రదాడులు, బాట్లా హౌస్ ఎన్‌కౌంటర్ ఘటనల్లో ప్రాణాలు కోల్పోయిన వారి గురించి ఎప్పుడైనా బాధపడ్డారా అని నిలదీశారు. ఈ సందర్భంగా కేంద్ర మాజీ మంత్రి నట్వర్ సింగ్ ఆత్మకథ విడుదలకు ముందు జరిగిన పరిణామాలను కూడా కేశవన్ గుర్తుచేశారు. “2014లో నట్వర్ సింగ్ తన ఆత్మకథ ‘వన్ లైఫ్ ఈజ్ నాట్ ఎనఫ్‘ విడుదలకు ముందు సోనియా గాంధీ ఆయన్ను ఎందుకు కలిశారు? 2004లో యూపీఏ ప్రభుత్వం ఏర్పడినప్పుడు జరిగిన పరిణామాల గురించి నట్వర్ సింగ్ ఏం రాస్తారోనన్న భయంతోనే ఆయన్ను కలిశారా? ఈ విషయాలపై తన పుస్తకంలో సోనియా స్పష్టత ఇస్తారా?“ అని కేశవన్ ప్రశ్నల వర్షం కురిపించారు. దాదాపు 55 ఏళ్ల కాంగ్రెస్ పాలన దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు తీరని నష్టం కలిగించిందని, ప్రధాని నరేంద్ర మోదీ ఆ చారిత్రక తప్పిదాలను సరిదిద్దుతున్నారని ఆయన పేర్కొన్నారు.

చంద్రబాబు, పవన్ కల్యాణ్ లకు ఘన స్వాగతం పలికిన మంత్రులు..

ఉత్సాహంగా నినదిస్తూ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులకు శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల విజయోత్సాహం నడుమ ప్రారంభమైన ఈ సమావేశంలో రాష్ట్ర సమగ్రాభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై మంత్రివర్గం చర్చిస్తోంది. పారిశ్రామిక ప్రగతి, కొత్త పెట్టుబడుల సాధన, యువతకు ఉపాధి అవకాశాల కల్పనతో పాటు దాదాపు 30కి పైగా అంశాలు ఈ భేటీ అజెండాలో ఉన్నాయి. కీలక పాలసీలకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపే అవకాశం ఉంది.

తాడిపత్రిలో మళ్లీ రాజుకున్న రాజకీయం..

అనంతపురం జిల్లా కేంద్రంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీలు తీవ్ర రాజకీయ దుమారం రేపుతున్నాయి. 2021లో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఫలితాలను, ప్రస్తుత తాజా ఫలితాలతో పోలుస్తూ ఆయన ఏర్పాటు చేసిన ఈ ఫ్లెక్సీలు స్థానికంగా పెను చర్చకు దారితీశాయి. ప్రత్యర్థి పార్టీ వైఖరిని ఎండగడుతూ జేసీ ప్రభాకర్ రెడ్డి ఈ ఫ్లెక్సీల ద్వారా నేరుగా ప్రశ్నల వర్షం కురిపించారు.ఈ ఫ్లెక్సీలలో వైసీపీ నేతలను ఉద్దేశించి తీవ్రస్థాయిలో సెటైర్లు వేశారు. “2021లో మీకు కళ్లు దొబ్బాయా?“ అంటూ ఘాటైన వ్యాఖ్యలను ఫ్లెక్సీలపై ప్రదర్శించారు. వైసీపీ మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మాజీ మంత్రి సాకే శైలజానాథ్‌లను లక్ష్యంగా చేసుకుంటూ.. “మీకు కళ్లు, చెవులు పనిచేస్తే ఈ ఫలితాలను చూడండి“ అంటూ ఫ్లెక్సీల ద్వారా నిలదీశారు. గత ప్రభుత్వంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల తీరును, ఇప్పటి ఫలితాలను ప్రజల ముందు ఉంచేందుకే ఈ ఫ్లెక్సీలను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో జేసీ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ పై తీవ్ర విమర్శలు చేశారు. జగన్ తన రాజకీయ ప్రయోజనాల కోసం తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేరు ప్రతిష్ఠలను పూర్తిగా చెడగొట్టారని ఆయన మండిపడ్డారు. తాను జిల్లాలో ఫ్యాక్షన్ రాజకీయాలను శాశ్వతంగా రూపుమాపాలని గట్టిగా కోరుకుంటున్నట్లు స్పష్టం చేశారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజాస్వామ్యం పూర్తిగా ఖూనీ అయిందని జేసీ ఆరోపించారు. కుప్పం పురపాలక ఎన్నికల్లో తమిళనాడు నుంచి బస్సుల్లో దొంగ ఓటర్లను తరలించి మరీ వైసీపీ అక్రమంగా గెలిచిందని దుయ్యబట్టారు. అలా దొంగ ఓట్లతో గెలిచిన వైసీపీ నేతలకు ప్రస్తుతం ప్రజాస్వామ్యం, విలువల గురించి మాట్లాడే కనీస నైతిక అర్హత లేదని ఆయన కొట్టిపారేశారు. అనంతపురం జిల్లాకు చెందిన పలువురు కీలక వైసీపీ నేతలపై కూడా జేసీ ప్రభాకర్ రెడ్డి విరుచుకుపడ్డారు. మాజీ ఎమ్మెల్యేలు అనంత వెంకట్రామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డిల తీరును తప్పుబట్టారు. అనంతపురం జిల్లా ప్రగతి పథంలో సాగాలంటే వైసీపీ జిల్లా అధ్యక్ష పదవికి అనంత వెంకట్రామిరెడ్డి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా, నైతికత ఉంటే వైసీపీ తరఫున గెలిచిన ప్రజాప్రతినిధులందరూ ముందుగా తమ పదవులను వదులుకోవాలని సవాల్ విసిరారు. మరోవైపు, అనంతపురం నగర సమగ్ర అభివృద్ధి జరగాలంటే, కొత్తగా మేయర్‌గా గెలిచిన రమేశ్‌గౌడ్ పార్టీ మారితే మంచిదని జేసీ ప్రభాకర్ రెడ్డి ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

ఏపీ కేబినెట్ నిర్ణయాలు.. పలు ప్రాజెక్టులకు ఆమోదముద్ర

ఆమోదం లభించింది. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి, పెట్టుబడుల ఆకర్షణ, యువతకు భారీగా ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కేబినెట్ పలు ప్రధాన ప్రాజెక్టులకు ఆమోద ముద్ర వేసింది. ఈ సమావేశంలో ఏవీజీసీ–ఎక్స్ఆర్ (ూాం+జ–ఞ=) పాలసీ 2026–31, ఏపీ రోబోటిక్స్ – ఫిజికల్ ఏఐ విధానాలతో పాటు సెమీ కండక్టర్ పాలసీ సవరణలకు మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విశాఖ జిల్లా భీమునిపట్నంలో రూ.31,387 కోట్లతో ఏఎం ఇంటెలిజెన్స్ ఆధ్వర్యంలో 512 మెగావాట్ల గ్రీన్ ఇంటిగ్రేటెడ్ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. నాయుడుపేటలో రూ.4,000.20 కోట్లతో కార్బన్ కాస్మో బ్యాటరీ మెటీరియల్ తయారీ ప్లాంట్ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. అలాగే భోగాపురంలో రిలయన్స్ గిగా స్కేల్ ఏఐ డేటా సెంటర్‌కు 25 ఎకరాలు, తిరుపతిలో డిక్సన్ టెక్నాలజీస్‌కు స్థలం కేటాయింపునకు ఆమోదం లభించింది. అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో రూ.570.20 కోట్లతో ఈపాక్ యూనిట్ కు ఆమోదముద్ర వేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా 2,565 మందికి ఉపాధి లభించనుంది. పశ్చిమ గోదావరిలో రూ.236.92 కోట్లతో రవళి స్పిన్నర్స్ విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ ప్రాజెక్టు ద్వారా 1,569 మందికి ఉపాధి లభించనుంది. నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్కులో హెటిరో సంస్థలకు 173.82 ఎకరాలు కేటాయించారు. మరోవైపు, రాష్ట్రంలో రోడ్డు భద్రత కోసం డీజీపీ ఆధ్వర్యంలో ప్రత్యేక డైరెక్టరేట్ ఏర్పాటు, తిరుమల శ్రీవారి ఆలయంలో ‘ప్రధాన సన్నిధి యాదవ‘, ‘సన్నిధి యాదవ‘ పోస్టుల సృష్టికి కేబినెట్ నిర్ణయించింది. థర్మల్ విద్యుత్‌కు ప్రత్యామ్నాయంగా ఎస్ఎంఆర్ టెక్నాలజీతో అణు విద్యుత్ ప్లాంట్ల సాధ్యాసాధ్యాల పరిశీలనకు, రాజధాని పరిధిలోని శాఖమూరులో కేంద్రీయ విద్యాలయానికి భూ కేటాయింపునకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది.

వైసీపీకి అన్నపరెడ్డి విజయభాస్కర్ రాజీనామా..

వైసీపీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ నేత అన్నపరెడ్డి విజయభాస్కర్ రెడ్డి వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి ఏర్పాటు చేయనున్న నూతన రాజకీయ పార్టీలో తాను చేరుతున్నట్లు ఆయన అధికారికంగా ప్రకటించారు.విజయవాడలో ఈరోజు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విజయభాస్కర్ రెడ్డి తన నిర్ణయాన్ని వెల్లడించారు. ఈ సందర్భంగా వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ వ్యవహార శైలిపై, పార్టీ అంతర్గత పనితీరుపై ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పార్టీలో కష్టపడి పనిచేసే నాయకులకు, కార్యకర్తలకు ఎలాంటి గుర్తింపు దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గుర్తింపు లేని చోట ఉండలేమని ఆయన స్పష్టం చేశారు.వైసీపీ వ్యవస్థాగత తీరుపై విమర్శలు గుప్పిస్తూ.. “వైసీపీలో ఎవరికీ సభ్యత్వాలు ఉండవు. సంతకాలు లేని లెటర్ ప్యాడ్స్‌పై పదవులు ఇస్తారు“ అని విజయభాస్కర్ రెడ్డి వ్యాఖ్యానించారు. అలాగే ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని జగన్ వమ్ము చేసుకున్నారని ఆరోపించారు. కూటమి కలిసి ఉన్నంత కాలం జగన్ మళ్లీ అధికారంలోకి రాలేరని అన్నారు. గుర్తింపు లేదనే మనస్తాపంతో ఆ పార్టీని వీడి, విజయసాయిరెడ్డి పెట్టనున్న పార్టీలో చేరుతున్నానని తెలిపారు.విజయవాడలో వంగవీటి రాధా, గుంటూరులో కూటమి గెలుపునకు వైసీపీలోని కొందరు సీనియర్ నాయకులే కారణమని విజయభాస్కర్ రెడ్డి అన్నారు. విజయసాయిరెడ్డి నవంబర్ 11న (రేపు) ఉదయం 11:11 గంటలకు విజయవాడ వేదికగా తన కొత్త పార్టీని లాంచ్ చేయనున్నారు. ఈ నేపథ్యంలో వైసీపీ నేత విజయభాస్కర్ రెడ్డి ఆయనకు మద్దతుగా నిలవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

ఓంకారం హుండీ లెక్కింపు



బండి ఆత్మకూరు నంది పత్రిక నవంబర్ 10: బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న శ్రీ ఓంకార సిద్దేశ్వర స్వామి దేవస్థానములో మంగళవారం హుండీ లెక్కింపు కార్యక్రమం జరిగింది.ఓంకార క్షేత్రము దేవస్థానమునకు సంబంధించి శాశ్వత హుండీలను ఏ కోడూరు గ్రూపు దేవస్థానముల ఈవో ఎస్ మోహన్ ఆధ్వర్యంలో తెరచి లెక్కించగా, ఎనిమిది నెలలకు గాను రెండు లక్షల 48 వేల 252 ఆదాయము వచ్చినది. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమం లో దేవస్థానం చైర్మన్ అల్లే చెన్నారెడ్డి, ఈఓ ఏ నాగప్రసాద్ ధర్మకర్తల మండలి సభ్యులు ,అర్చకులు, సేవా కమిటీ వారు భక్తులు పాల్గొన్నారు

అనుమతులు లేని కోచింగ్ సెంటర్లు, ఫీజుల దోపిడీపై సమగ్ర విచారణ జరపాలి

- డివైఎఫ్ఐ డిమాండ్



నంద్యాల ప్రతినిధి. నవంబర్ 10 . (నంది పత్రిక):నంద్యాల పట్టణంలో ఎలాంటి అధికారిక అనుమతులు, ఆఫీసులు లేకుండా కేవలం సోషల్ మీడియా ప్రచారంతో గ్రౌండ్లలో కోచింగ్ నడుపుతున్న అనధికార కేంద్రాలపై మరియు సైనిక్, నవోదయ స్కూల్స్ ప్రవేశాల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుండి వేల రూపాయలు వసూలు చేస్తున్న అక్రమ వసూళ్లపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ డివైఎఫ్ఐ (డెమొక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో నంద్యాల అర్డిఓ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం సమర్పించడం జరిగింది.ఈ సందర్భంగా డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి శివ మాట్లాడుతూ.. నంద్యాలలో చాలా కోచింగ్ సెంటర్లు నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి భద్రతా ప్రమాణాలు లేకుండా విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే ప్రైవేట్ కోచింగ్ పేరిట అమాయక ప్రజలను నిలువునా దోచుకుంటున్న సంస్థల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు.వినతి పత్రాన్ని స్వీకరించిన అర్డిఓ కార్యాలయ అధికారులు స్పందిస్తూ, ఈ విషయంపై తక్షణమే దృష్టి సారించి, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న కోచింగ్ సెంటర్లపై త్వరలోనే తనిఖీలు చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మూల సాగరం డివైఎఫ్ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హాలహర్వి మండల జడ్పీటీసీ కురువ వైశాలిని ఘనంగా సన్మానించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీయన్ మాధవ్



కర్నూలు సిటీ నందిపత్రిక కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గం హాలహర్వి మండల జడ్పీటీసీగా బీజేపీ పార్టీ తరపున విజయం సాధించిన కురువ వైశాలి ని మంగళవారం విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. కిసాన్ మోర్చా కర్నూలు జిల్లా అధ్యక్షులు కురువ బసవరాజు సతీమణి అయిన కురువ వైశాలిని బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు పీవీయన్ మాధవ్ అధ్యక్షతన, తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఉమ్మడి సంఘటనా మంత్రి నూకల మధుకర్ జీ సమక్షంలో శాలువాతో సత్కరించి అభినందించారు.ఈ కార్యక్రమంలో రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి , మాజీ రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు , ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి , రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొని కురువ వైశాలి కి అభినందనలు తెలియజేశారు.

కాటసాని రాంభూపాల్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన తమ్మరాజు పల్లె పిన్నాపురం గ్రామాల వైఎస్ఆర్సీపి ఎంపీటీసీ బిజ్జమ్మ గారి వెంకట సుబ్బమ్మ

కర్నూల్ సిటీ నంది పత్రిక తమ్మరాజుపల్లె, పిన్నాపురం గ్రామాల వైఎస్ఆర్సీపీ ఎంపీటీసీగా బిజ్జమ్మ గారి వెంకటసుబ్బమ్మ విజయం సాధించిన సందర్భంగా, ఆయా గ్రామాలకు చెందిన వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్ఆర్సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి ని,ఆయన సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ ని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కాటసాని దంపతులకు శాలువా కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించి తమ విజయానందాన్ని పంచుకున్నారు.అనంతరం కాటసాని రామభూపాల్ రెడ్డి విజయం సాధించిన బిజ్జమ్మ వెంకటసుబ్బమ్మ కి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. పార్టీ విజయానికి కృషి చేసిన గ్రామ నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలుపుతూ, ఈ విజయం ప్రతి కార్యకర్త సమష్టి కృషికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తమ్మరాజుపల్లె గ్రామ నాయకులు మాజీ సర్పంచ్ బత్తుల శేషారెడ్డి , మాజీ ఎంపీటీసీ ముచ్చు వెంకటేశ్వర్లు , బత్తుల బాలిరెడ్డి , కోడె శేషయ్య, మల్లెల లక్ష్మీనారాయణ , జగిలి రామకృష్ణ , కోడె నాగేశ్వరరావు , మండ్ల మధుసూదన్ నాయుడు, మల్లెల వెంకటసుబ్బయ్య , రమేష్ , బండ సుబ్బడు, పిన్నాపురం గ్రామ నాయకులు పాణ్యం మాజీ ఎంపీపీ ఉషేన్ బి , పాణ్యం సుబ్రమణ్యమయ్య శెట్టి , కొణిదేడు అశోక్ రెడ్డి , ఓ. లక్ష్మన్న , మాజీ సర్పంచ్ వెంకటకృష్ణయ్య , ఓర్వకంటి రమణ , ఓర్వకంటి నాగలక్ష్మన్న , ఓ. ఎల్లసుబ్బయ్య , బి. లక్ష్మీనారాయణ , ఓ. సుబ్బయ్య , గుండ్ల వెంకటరెడ్డి మరియు పలువురు గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



బండి ఆత్మకూరులో అమరవీరుల సంస్మరణ దినోత్సవం



బండి ఆత్మకూరు నంది పత్రిక నవంబర్ 10: బండి ఆత్మకూరు లోని అటవీ క్షేత్ర అధికారి కార్యాలయంలో మంగళవారం రాష్ట్ర అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. అటవీ రేంజ్ అధికారి నాసిర్ ఝా అధ్యక్షతన జరిగిన ఒక సమావేశంలో విధి నిర్వహణలో అటవీ సంపద పరిరక్షణ కోసం అసువులు బాసిన అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా అటవీ సంపద వన్యప్రాణుల సంరక్షణ పర్యావరణ పరిరక్షణ కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధినిర్వాణంలో అమరులైన అటవీ శాఖ సిబ్బంది సేవలను స్మరించుకుంటూ వారికి ఘనంగా నివాళులు అర్పించారు. అటవీ సంపదను కాపాడటం అడవుల విస్తీర్ణాన్ని పెంపొందించడం వన్యప్రాణులను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతాన్ని రేంజ్ అధికారి పేర్కొన్నారు. అటవీ అమరవీరుల త్యాగాలు అటవీశాఖ సిబ్బందికి ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అటవీర్ రేంజ్ అధికారితోపాటు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు నాగరాజు ఖాసీం నాయక్ తో పాటు సిబ్బంది పాల్గొని అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించారు.



రబీలో రైతులకు తక్కువ ప్రీమియంతో భరోసా



బండి ఆత్మకూరు నంది పత్రిక నవంబర్ 10: బండి ఆత్మకూరు మండల పరిధిలోని ఎర్రగుంట్ల గ్రామంలో రబీలో సాగు చేసిన జొన్న పంటను మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ రబీ 2026-27 సీజన్‌కు సంబంధించి రైతులకు పంటల బీమా సౌకర్యం కల్పించేందుకు పంటల వారీగా బీమా మొత్తం, రైతులు చెల్లించాల్సిన ప్రీమియం వివరాలను ప్రకటించారు. ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ పరిస్థితుల వల్ల పంట నష్టపోయే రైతులకు ఆర్థిక భరోసా కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశ్యం అని వారు తెలిపారు.ఈ పథకం కింద రైతులు పంటను బట్టి కేవలం 0.20 శాతం నుంచి 0.30 శాతం వరకు మాత్రమే ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది.ఎకరాకుశనగ కు రూ.84,వరి పంటకు రూ.126, జొన్నకు రూ.59, మినుముకు రూ.48, వేరుశనగకు రూ.64, ఉల్లికి రూ.90 చొప్పున రైతులు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. ప్రకృతి వైపరీత్యాలు, ప్రస్తుత ఎల్ నినో పరిస్థితుల్లో రైతులకు పంట బీమా భరోసా కల్పిస్తుందని తెలిపారు. డిసెంబర్ 15వ తారీకు లోగా పంట బీమా చేసుకోవాలని, రైతులు తమ పంటల సాగు వివరాలతో సంబంధిత రైతు సేవ కేంద్రం సిబ్బందిని లేదా సమీపంలోని సిఎస్ఈ మీసేవ కేంద్రాలను సంప్రదించి బీమా నమోదు చేసుకోవాలని వారు సూచించారు.

జొన్నలో కత్తెర పురుగు నివారణ చర్యలు చేపట్టాలి రబీలో సాగు చేసిన జొన్న పంటకు వాతావరణ ఉష్ణోగ్రతలు అధికంగా ఉండడం వలన కత్తెర పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నదని రైతులు వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఓ పవన్ తెలిపారు. నివారణకు లద్దె పురుగులు ఆకర్షించడానికి విషపు ఎరలను సాయంత్రం వేళలో పొలంలో అక్కడక్కడ ఉంచాలి,విషపు ఎర తయారీకి 10 కిలోల తవుడుకు 2 కిలోల బెల్లం కలిపి రాత్రంతా పులియబెట్టి, ఉదయం వేళ 500మి. మోనోక్రోటోఫాస్ లేదా 300 గ్రా. థయోడికార్బ్ మందును కలిపి పొలంలో ఉంచాలి.తొలిదశలో పురుగు నివారణకు క్లోరిపైరిఫాస్ 20% సి.సి. 2.5 మి.లీ / నీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు ఈమామెక్టిన్ బెంజోయేట్ 5% ఎస్.జి 80 గ్రా మందు 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి. విత్తిన 40-45 రోజులు దశలో స్పైనోసాడ్ 40% ఎస్.సి. 60 మి.లీ. మందు 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి.పురుగు ఉధృతి తీవ్రంగా ఉన్నప్పుడు లాంబ్డాసైహాలోత్రినే 20% ఇసి 200 మి.లీ. ముందు 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి. మందులు పిచికారీ చేసేటప్పుడు మొవ్వు సుడులు బాగా తడిసేలా పిచికారీ చేయాలని ఏఓ రైతులకు సూచించారు.

ఎన్నికలను ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించకపోవడాన్ని వ్యతిరేకిస్తూ నిరసన.



నంద్యాల ప్రతినిధి. నవంబర్ 10 . (నంది పత్రిక):రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల జరిగిన స్థానిక ఎన్నికలను కూటమి ప్రభుత్వం అధికార దుర్వినియోగం చేయడంతో పాటు వామపక్ష పార్టీల అభ్యర్థులను అదేవిధంగా రాష్ట్రంలోని అన్ని ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులను భయాందోళనకు గురి చేయడమే కాకుండా ప్రజలను భయభ్రాంతులకు గురి చేసే విధంగా ఎన్నికలు ప్రజాస్వామికంగా నిర్వహించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఈ నెల 11వ తేదీ ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సిపిఎం, సిపిఐ, వైఎస్ఆర్సిపి,కాంగ్రెస్, సిపిఎంఎల్ న్యూ డెమోక్రసీ, ఎస్ డి పిఐ పార్టీల ఆధ్వర్యంలో కలిసొచ్చేటుపంటి మేధావులను ప్రజాస్వామ్య వాదులను కలుపుకొని నంద్యాల పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద 11వ తేదీ నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు సిపిఎం జిల్లా కార్యాలయంలో జరిగిన వామపక్ష,ప్రతిపక్ష పార్టీల సమావేశంలో నిర్ణయించడం జరిగింది. ఈ కార్యక్రమానికి సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్ అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి టి రమేష్ కుమార్ ,సిపిఐ పట్టణ కార్యదర్శి కే ప్రసాద్, వైఎస్ఆర్సిపి పార్లమెంట్ యువజన విభాగం అధ్యక్షులు సన్నాల సాయిరాం రెడ్డి, ఎస్ డి పి ఐ నియోజకవర్గ అధ్యక్షులు ఏజాస్, నంద్యాల మండల సిపిఎం కార్యదర్శి వెన్న బాల వెంకట్ వీరితోపాటు ప్రజాసంఘాల నాయకులు నరసింహ నాయక్, పి వెంకట లింగం, కే మహమ్మద్ గౌస్, నాగరాముడు, ధనుంజయుడు, ఎం ఆర్ నాయక్, చెరుకు కృష్ణ పాల్గొనడం జరిగింది.అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కమిషన్ స్థానిక ఎన్నికలను ప్రజాస్వామ్య పద్ధతి లో ఎన్నికలను నిర్వహించడంలో ఘోరంగా వైఫల్యం చెందిందని కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా పోలీసు బలగాలను అధికార యంత్రాన్ని పూర్తిగా పనిచేసేలాగున అప్రజా స్వామికంగా ఎన్నికలు నిర్వహించడం జరిగిందని రాష్ట్రవ్యాప్తంగా సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్,వైఎస్ఆర్సిపి ఇతర పార్టీల నాయకులను, కార్యకర్తలను,అందరిని నామినేషన్ వేయకుండా దుర్మార్గంగా కర్కశంగా వ్యవహరించి పోలీసు బలగాలను ఉపయోగించి అభ్యర్థులందరినీ భయభ్రాంతులకు గురిచేసి ఏకపక్షంగా ఎన్నికలను ఉపయోగించుకుని అధికారం చేజెక్కించుకోవాలనుకోవడం చాలా దుర్మార్గమని రాబోయే కాలంలో మరింత పెద్ద ఎత్తున ఈ దుర్మార్గాన్ని కొనసాగించే అవకాశం ఉందని ,ఇప్పటికైనా ప్రజాస్వామ్యవాదులంతా ప్రతిఘటన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అందులో భాగంగానే నంద్యాల పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద రేపు ఉదయం 10 గంటలకు జరిగే నిరసన కార్యక్రమంలో మేధావులు, ప్రజాతంత్ర వాదులు, ప్రజలు కలిసొచ్చే పార్టీల నాయకులందరూ, కార్యకర్తలంతా పాల్గొని నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునివ్వడం జరిగింది.

టీజీపీఎస్సీ నిర్వహించే పరీక్షకు పకడ్బంది ఏర్పాట్లు పూర్తి చేయాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి,

- హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో వివిధ శాఖల అధికారులతో టీజీపీఎస్సీ పరీక్ష నిర్వహణపై సమన్వయ సమావేశం,



తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీస్సీ) నిర్వహించే డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ (డీఈవో/ గెజిటెడ్ హెడ్‌మాస్టర్ (గ్రేడ్-1) పరీక్షలకు అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల అధికారులతో టీజీపీఎస్సీ నిర్వహించే పరీక్షలు నిర్వహణపై సమన్వయ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య, విద్యుత్, పోలీస్, ఆర్టీసీ శాఖల అధికారులతో పాటు పరీక్షా కేంద్రాల ప్రతినిధులతో ఏర్పాట్ల సంబంధించిన అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ ఈ నెల 12, 13 తేదీల్లో నిర్వహించే డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ (డీఈవో / గెజిటెడ్ హెడ్‌మాస్టర్ (గ్రేడ్-1) పరీక్షకు కేటాయించిన పరీక్షా కేంద్రాలలో పటిష్ట ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 నుండి ఐదు సాయంత్రం 5'00 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. 12వ తేదీన జరగనున్న పరీక్షకు 1825 మంది అభ్యర్థులు, 13వ తేదీన జరగనున్న పరీక్షకు 1825 మంది అభ్యర్థులు(మొత్తం పరీక్ష రాసే అభ్యర్థులు(3650) పరీక్ష రాయనున్నట్లు పేర్కొన్నారు. హనుమకొండ వడ్డేపల్లి లోని అయాన్ డిజిటల్ జోన్, ములుగు క్రాస్ రోడ్ లోని ప్రభుత్వ ఐటిఐ కళాశాల ఎదురుగా ఉన్న శ్రీ గాయత్రి డిగ్రీ అండ్ పీజీ కళాశాల, రామారం(భీమారం) పొద్దుటూరి గార్డెన్స్ సమీపంలోని మోక్షిత్ కంప్యూటర్స్, హనుమకొండ గోపాల్ పూర్ కల్లుమండవ సమీపంలోని ఎన్ఎస్ గ్లోబల్ టెక్నాలజీస్, హసన్పర్తి చింతగట్టు హైవే సమీపంలోని నోబెల్ టెక్నాలజీ అండ్ సొల్యూషన్స్ లలో పరీక్ష జరుగుతుందన్నారు. జిల్లాకు సంబంధించి 3,650 మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరుకానున్న నేపథ్యంలో పరీక్షల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో అవస రమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. పరీక్షల నిర్వహణలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, పోలీస్ ఇన్స్పెక్టర్ చంద్రమోహన్, ఆర్టీసీ డిఎం ధరమ్ సింగ్, కలెక్టరేట్ పరిపాలన అధికారి గౌరీ శంకర్, ఇతర అధికారులతో పాటు పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు, ఆయా పరీక్షా కేంద్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.



మంచి ప్రభుత్వం : దుష్టపన్నాగం!

దిద్దుబాటు లేకుంటే రాజకీయ గ్రహపాటు తప్పదు!

స్థానిక ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని కబ్జా చేసి అధికార దుర్వినియోగం!

పోలీసింగ్‌తో ప్రతిపక్షాల గొంతు నొక్కి.. బెదిరింపులతో

ఏకగ్రీవాలు సాధించి.. ఇదేనా ప్రజారంజక పాలన?

నేడు స్థానిక ఎన్నికల్లోనే ఇలా జరిగితే.. రేపు 2029

సార్వత్రిక ఎన్నికల్లో ప్రత్యర్థులను పోటీ చేయనిస్తారా?

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నవంబర్ 11న నిరసన దినం పాటిద్దాం!

ఓటర్ల హక్కుల రక్షణకు రాష్ట్రవ్యాప్త ప్రజా చైతన్య ఉద్యమాన్ని నిర్మిద్దాం!

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య

కర్నూల్ సిటీ నందిపత్రిక మంచి ప్రభుత్వం అని చెప్పుకుంటూ ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు! గత ప్రభుత్వ పాలనలో ప్రజాస్వామ్యం అటకెక్కిందని, పౌరహక్కులు కాలరాయబడ్డాయని, భావప్రకటన స్వేచ్ఛను హరించారని, మద్యం, ల్యాండ్, శాండ్, మైనింగ్ మాఫియాలు చెలరేగిపోయాయని, ఉద్యోగుల ఆత్మగౌరవం దెబ్బతిన్నదని నాడు ప్రతిపక్షంలో ఉన్న నేటి అధికార కూటమి నేతలు తీవ్రంగా విమర్శించారు. అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తామని, ప్రజలకు స్వేచ్ఛాయుత వాతావరణం కల్పిస్తామని హామీలు గుప్పించారు.కానీ నేడు జరుగుతున్నదేమిటి? గత ప్రభుత్వాన్ని విమర్శించినవారే అధికారంలోకి వచ్చి అదే పంథాలో, అంతకంటే దారుణమైన ధోరణిలో వ్యవహరిస్తున్నారు. తమది మంచి ప్రభుత్వం అని ప్రచారం చేసుకుంటూనే స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార దుర్వినియోగానికి, పోలీసు బలప్రయోగానికి, రాజకీయ దౌర్జన్యాలకు పాల్పడ్డారు.ప్రజల మద్దతు ఉందని చెప్పుకునే ప్రభుత్వానికి ప్రత్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకోవాల్సిన అవసరం ఏమొచ్చింది? ప్రజాభిమానమే తమ బలమైతే పోటీకి వచ్చిన అభ్యర్థులను బెదిరించడం, వారి వాహనాలను ధ్వంసం చేయడం, కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకోవడం, చంపేస్తామని హెచ్చరించడం ఎందుకు?

ప్రజల ఓట్లతో గెలవాల్సిన పార్టీ పోలీసుల బలంతో ప్రత్యర్థులను ఓడించాలనుకోవడం ప్రజాస్వామ్యమా? అధికార దురహంకారమా?

ఎన్నికల ప్రక్రియపై అధికార కూటమి దండయాత్ర!

ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో జరిగిన పరిణామాలు ఏదో ఒక ప్రాంతానికి, ఏదో ఒక పార్టీకి పరిమితమైనవి కావు. రాష్ట్రవ్యాప్తంగా అనేక జిల్లాల్లో ఒకే తరహా రాజకీయ దౌర్జన్యం, అధికార యంత్రాంగం దుర్వినియోగం, పోలీసు జోక్యం కనిపించాయి. పుంగనూరు, మదనపల్లి, రాయచోటి, కడప, మైదుకూరు, ప్రొద్దుటూరు, బద్వేలు, రాజంపేట, తిరుపతి, చిత్తూరు ప్రాంతాల్లో ఎన్నికల సందర్భంగా జరిగిన ఘటనలు ఈ పరిస్థితికి నిదర్శనం. నంద్యాల జిల్లాలో డోన్, బనగానపల్లి, ఆత్మకూరు ప్రాంతాల్లోనూ, శ్రీ సత్యసాయి జిల్లాలో పుట్టపర్తిలోనూ ఇలాంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. మార్కాపురం జిల్లాలో కనిగిరి, ఎర్రగొండపాలెం ప్రాంతాల్లోనూ ఎన్నికల ప్రక్రియలో జోక్యం, బెదిరింపులు, అడ్డంకులు చోటుచేసుకున్నాయి. పల్నాడు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో, బాపట్ల జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోనూ ఇదే తరహా ఘటనలు జరిగాయి. కాకినాడ జిల్లాలో పిఠాపురం, అలాగే కర్నూలు, అనంతపురం, పులివెందుల, శ్రీకాకుళం, విజయవాడ తదితర ప్రాంతాల్లోనూ ఎన్నికల సమయంలో ప్రజాస్వామ్య హక్కులకు విఘాతం కలిగించే ఘటనలు చోటుచేసుకున్నాయి. నామినేషన్లు వేయడానికి వెళ్లిన అభ్యర్థులను మార్గమధ్యంలోనే అడ్డుకున్నారు. నామినేషన్ కేంద్రాల వద్ద గూండా మూకలను మోహరించారు. వాహనాలను ధ్వంసం చేశారు. అభ్యర్థులను, వారి అనుచరులను కొట్టారు. నామినేషన్ పత్రాలను చింపివేశారు. ఉపసంహరించుకోవాలని బెదిరించారు. పోటీ నుంచి తప్పుకోకపోతే చంపేస్తామని హెచ్చరించారు. ఇంతటితో ఆగలేదు. అభ్యర్థుల కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకున్నారు. భార్యలు, పిల్లలను బెదిరించారు. ప్రభుత్వ ఉద్యోగాలు తీసేస్తామని హెచ్చరించారు. కొందరి పిల్లలను కిడ్నాప్ చేసే దారుణాలకు కూడా పాల్పడ్డారు. అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, నాయకుల కుటుంబ సభ్యులే ప్రత్యర్థులను చంపుతామని హెచ్చరించే స్థాయికి రాజకీయ సంస్కృతి దిగజారింది. పులివెందులతో సహా అనేక ప్రాంతాల్లో ఇలాంటి భయానక పరిస్థితులు నెలకొన్నాయి. ఇవి రాజకీయ ప్రత్యర్థుల మధ్య జరిగిన సాధారణ ఘర్షణలు కావు. రాజ్యాంగం కల్పించిన ఎన్నికల్లో పోటీ చేసే హక్కును బలప్రయోగంతో హరించిన ఘటనలు.ఒక అభ్యర్థి నామినేషన్ వేయడానికి వెళితే అతని వెంట కుటుంబం భయపడాలి. ఒక కార్యకర్త పార్టీ కోసం పనిచేస్తే అతని భార్యాపిల్లల భద్రత ప్రశ్నార్థకమవ్వాలి. ఒక ఉద్యోగి తన రాజకీయ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తే ఉద్యోగం పోతుందనే భయం వెంటాడాలి. ఇదేనా మంచి ప్రభుత్వం అందిస్తున్న ప్రజాస్వామ్యం?

పోలీసు వ్యవస్థను రాజకీయ ఆయుధంగా మార్చిన పాలన!

ఈ ఎన్నికల్లో జరిగిన దౌర్జన్యాల వెనుక పోలీసింగ్ పాత్రను విస్మరించలేం. అనేక ప్రాంతాల్లో పోలీసు వ్యవస్థ అధికార పార్టీ రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా పనిచేసింది. ప్రతిపక్ష అభ్యర్థులను నామినేషన్ కేంద్రాలకు వెళ్లకుండా అడ్డుకోవడం, అధికార పార్టీ శ్రేణుల దౌర్జన్యాలను ఉపేక్షించడం, ప్రతిపక్ష నాయకులపై కేసులు పెట్టడం, అరెస్టులు చేయడం, గృహనిర్బంధాలు విధించడం వంటి చర్యలతో ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేశారు.శాంతిభద్రతల పరిరక్షణ పేరుతో రాజకీయ ప్రత్యర్థులను నియంత్రించారు. అధికార పార్టీ శ్రేణులకు మాత్రం స్వేచ్ఛనిచ్చారు. ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు వారికే అడ్డంకిగా నిలిచారు. పోలీసులు రాజ్యాంగానికి, చట్టానికి విధేయులుగా ఉండాలి. ఏ పార్టీ అధికారంలో ఉందన్నది వారికి సంబంధం ఉండకూడదు. కానీ పోలీసు వ్యవస్థే అధికార పార్టీ రాజకీయ ప్రయోజనాల కోసం పనిచేసే పరిస్థితి వస్తే ఎన్నికల సంఘం స్వతంత్రత ఎక్కడ మిగులుతుంది? ప్రజాస్వామ్యానికి రక్షణ ఎక్కడ ఉంటుంది?ఎన్నికల నిర్వహణ పేరుతో పోలీసు బలగాలను మోహరించడం ఒక ఎత్తు. పోలీసు బలాన్ని ఉపయోగించి ఎన్నికల ఫలితాలను ముందుగానే ప్రభావితం చేయడం మరో ఎత్తు. ఈ రెండింటి మధ్య తేడాను ప్రజలు స్పష్టంగా గుర్తించాలి.ఏకగ్రీవాల వెనుక దాగిన ప్రజాస్వామ్య విషాదం! ఈ ఎన్నికల్లో ఏకగ్రీవాల సంఖ్యను పరిశీలిస్తే ప్రజాస్వామ్యానికి జరిగిన నష్టం ఎంతటిదో అర్థమవుతుంది.రాష్ట్రవ్యాప్తంగా జరిగిన పరిషత్ ఎన్నికల్లో మొత్తం 659 జడ్పీటీసీ స్థానాలకు గాను 77 స్థానాలు, 9,818 ఎంపీటీసీ స్థానాలకు గాను 2,051 స్థానాలు పోలింగ్‌కు ముందే ఏకగ్రీవమయ్యాయి. అంటే 2,128 పరిషత్ స్థానాల్లో ప్రజలు ఓటు వేసే అవసరమే లేకుండా ఎన్నికల ప్రక్రియ ముగిసింది.అదేవిధంగా మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో 755 వార్డులు, డివిజన్లు ఏకగ్రీవమైనట్లు తుది ఫలితాలపై వచ్చిన నివేదికలు వెల్లడించాయి. అంతేకాదు, 87 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో 17 చైర్‌పర్సన్ స్థానాలు కూడా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది.ఈ గణాంకాలు ముఖ్యమంత్రి స్వయంగా తన ప్రభుత్వ విజయాల గురించి, కూటమి సాధించిన స్ట్రైక్‌రేట్ గురించి ప్రకటించిన సందర్భంలోనూ ప్రస్తావనకు వచ్చాయి. పట్టణ స్థానిక సంస్థల్లో 94 శాతం స్ట్రైక్‌రేట్ సాధించామని, జడ్పీటీసీ ఎన్నికల్లో 87.5 శాతం స్ట్రైక్‌రేట్ సాధించామని ముఖ్యమంత్రి గొప్పగా ప్రకటించారు.కానీ ఈ విజయాల వెనుక ఉన్న మరో కోణాన్ని కూడా ప్రజలకు చెప్పాలి. ఎన్ని స్థానాల్లో నిజమైన పోటీ జరిగింది? ఎన్ని చోట్ల ప్రతిపక్ష అభ్యర్థులు నామినేషన్లు వేయలేకపోయారు? ఎన్ని చోట్ల బెదిరింపులతో ఉపసంహరించుకున్నారు? ఎన్ని కుటుంబాలు ప్రాణభయంతో ఎన్నికలకు దూరమయ్యాయి? ఎన్ని చోట్ల పోలీసు యంత్రాంగం రాజకీయ ఒత్తిళ్లకు అనుగుణంగా వ్యవహరించింది?ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా కేవలం స్ట్రైక్‌రేట్‌ను విజయంగా చూపించడం ప్రజాస్వామ్యానికి జరిగిన నష్టాన్ని కప్పిపుచ్చడమే.ఒక్క జడ్పీటీసీ పరిధిలో సుమారు 30 వేల జనాభా ఉంటుందని తీసుకుంటే, 77 ఏకగ్రీవ జడ్పీటీసీ స్థానాల పరిధిలో సుమారు 23.10 లక్షల జనాభా ఉంటుంది. ఇది ఓటర్ల సంఖ్య కాదు, జనాభా ఆధారంగా చేసిన అంచనా. దీనికి వేల ఎంపీటీసీ స్థానాలు, వందల మున్సిపల్ వార్డులు, డివిజన్లు కలిపితే పోటీకి అవకాశం లేకుండా పోయిన ప్రజల విస్తృతి ఎంతటిదో అర్థమవుతుంది.ఒక స్థానంలో ఏకగ్రీవం కావడం తప్పు కాదు. ప్రజలందరూ స్వచ్ఛందంగా ఒక అభ్యర్థిని అంగీకరించడం ప్రజాస్వామ్య సౌందర్యం. కానీ ప్రత్యర్థులను బెదిరించి, నామినేషన్లు వేయనీయకుండా అడ్డుకొని, కుటుంబాలను భయపెట్టి, పోలీసు బలాన్ని ఉపయోగించి సాధించిన ఏకగ్రీవం ప్రజాస్వామ్య విజయం కాదు. అది ప్రజల ఓటు హక్కును కబ్జా చేయడమే.ఏకగ్రీవాల సంఖ్య పెరగడం గొప్పతనం కాదు. ఏకగ్రీవం వెనుక ప్రజల స్వేచ్ఛ ఉందా? భయం ఉందా? అన్నదే అసలు ప్రశ్న!నేడు స్థానిక ఎన్నికల్లో ఇలా జరిగితే.. రేపు 2029 ఎన్నికల్లో పరిస్థితి ఏమిటి? రాష్ట్రంలో 28 జిల్లాలున్న నేపథ్యంలో మెజారిటీ జిల్లాల్లో ఎన్నికల సమయంలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం ప్రజల్లో తీవ్రమైన భయాందోళనలకు కారణమవుతోంది.ఈరోజు స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్ వేయడానికి వెళితే అడ్డుకుంటున్నారు. పోటీ చేస్తే చంపేస్తామని బెదిరిస్తున్నారు. కుటుంబాలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. పోలీసు కేసులతో భయపెడుతున్నారు. ఎన్నికల అధికారుల ద్వారా అడ్డంకులు సృష్టిస్తున్నారు.ఇదే విధానం కొనసాగితే రేపు 2029 సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులను స్వేచ్ఛగా నామినేషన్లు వేయనిస్తారా? ఎన్నికల్లో పోటీ చేసే హక్కును కాపాడుతారా? ప్రజలు తమకు నచ్చిన పార్టీకి ఓటు వేయగలరా? అధికార పార్టీకి వ్యతిరేకంగా ప్రచారం చేసే స్వేచ్ఛ ఉంటుందా? ఇవి కేవలం రాజకీయ ప్రశ్నలు కావు. నేడు రాష్ట్ర ప్రజల ముందున్న తీవ్రమైన ప్రజాస్వామ్య ఆందోళనలు. ఇప్పుడు స్థానిక ఎన్నికల్లో జరిగిన పరిణామాలను ఇప్పుడే అడ్డుకోకపోతే రేపటి సార్వత్రిక ఎన్నికల్లో ప్రజాస్వామ్యానికి మరింత ప్రమాదకరమైన పరిస్థితులు ఎదురవుతాయి.ఒకసారి ఎన్నికల వ్యవస్థ అధికార పార్టీ ఆధీనంలోకి వెళ్లిపోతే, అధికారంలోకి వచ్చే ప్రతి పార్టీ అదే పద్ధతిని అనుసరించే ప్రమాదం ఉంటుంది. అప్పుడు ప్రభుత్వాలు మారతాయి కానీ ప్రజాస్వామ్యానికి స్వేచ్ఛ మాత్రం ఉండదు.

ఇది టీడీపీ వర్సెస్ వైసీపీ కాదు.. ప్రజాస్వామ్యం వర్సెస్ అధికార దుర్వినియోగం!

గతంలో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు టీడీపీ, జనసేన, బీజేపీ, వామపక్షాలు, ఇతర ప్రతిపక్షాల అభ్యర్థులను పోటీ చేయకుండా అడ్డుకున్నా అది తప్పే. నేడు టీడీపీ నేతృత్వంలోని కూటమి అధికారంలో ఉండి అదే పద్ధతులను అనుసరించినా అది అంతే పెద్ద తప్పు.రేపు మరొక పార్టీ అధికారంలోకి వచ్చి ఇదే విధానాన్ని అనుసరించినా దాన్ని కూడా తీవ్రంగా వ్యతిరేకించాల్సిందే.రాజకీయ పార్టీలు మారవచ్చు. ప్రభుత్వాలు మారవచ్చు. కానీ రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య హక్కులు మారకూడదు.ఎన్నికల్లో గెలిచే హక్కు అధికార పార్టీకి ఉన్నట్లే, పోటీ చేసే హక్కు ప్రతిపక్షానికి ఉంది. ప్రజల ఓటు హక్కును ఏ ప్రభుత్వమూ తన రాజకీయ ప్రయోజనాలకు బలిచేయడానికి వీల్లేదు.

మరి దీనికి శాశ్వత పరిష్కారం ఏమిటి?

కేవలం ప్రస్తుత ప్రభుత్వాన్ని విమర్శించడం, పోలీసు అధికారులను బదిలీ చేయాలని కోరడం, ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడం మాత్రమే సరిపోదు. అధికారంలో ఉన్న పార్టీ ఏదైనా ఎన్నికల వ్యవస్థను తమ గుప్పిట్లో పెట్టుకోలేని విధంగా శాశ్వత రాజ్యాంగ, చట్టపరమైన రక్షణలు కల్పించాలి.

దీనికి కొన్ని కీలకమైన ప్రత్యామ్నాయ విధానాలను అమలు చేయాలి.

1. రాష్ట్ర ఎన్నికల సంఘానికి సంపూర్ణ స్వతంత్రత: రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నియామక ప్రక్రియను పారదర్శకంగా మార్చాలి. ముఖ్యమంత్రి లేదా అధికార పార్టీ ఏకపక్ష నిర్ణయంతో ఎన్నికల కమిషనర్ నియామకం జరిగే పరిస్థితికి స్వస్తి పలకాలి. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి లేదా ఆయన నామినేట్ చేసిన న్యాయమూర్తి, ప్రతిపక్ష నేత, ప్రభుత్వ ప్రతినిధి భాగస్వాములుగా ఉండే స్వతంత్ర ఎంపిక కమిటీ ద్వారా నియామకం జరిగేలా రాజ్యాంగ, చట్టపరమైన మార్పులు పరిశీలించాలి.

2. ఎన్నికల పోలీసింగ్ ఎన్నికల సంఘం ఆధీనంలో ఉండాలి: ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి ఫలితాలు ప్రకటించే వరకు ఎన్నికల విధుల్లో ఉన్న పోలీసు అధికారులపై రాష్ట్ర ఎన్నికల సంఘానికి ప్రత్యక్ష పర్యవేక్షణ, అదేశాలిచ్చే అధికారం ఉండాలి. అవసరమైన చోట్ల ఇతర రాష్ట్రాల పోలీసు బలగాలు, కేంద్ర పరిశీలకులను వినియోగించాలి.

3. నామినేషన్ హక్కుకు చట్టపరమైన రక్షణ: నామినేషన్ వేయడానికి వచ్చిన అభ్యర్థిని అడ్డుకున్నా, బెదిరించినా, పత్రాలు చింపివేసినా, బలవంతంగా ఉపసంహరింపజేసినా తక్షణమే కేసు నమోదు చేయాలి. అభ్యర్థికి భద్రత కల్పించాలి. నామినేషన్ కేంద్రాల్లో నిరంతర వీడియో రికార్డింగ్, సీసీటీవీ పర్యవేక్షణ తప్పనిసరి చేయాలి.

4. బలవంతపు ఏకగ్రీవాలపై ప్రత్యేక నిబంధన: అభ్యర్థులను బెదిరించి, బలవంతంగా ఉపసంహరింపజేసి ఏకగ్రీవం సాధించినట్లు తేలితే ఆ ఎన్నికను రద్దు చేసి తిరిగి ఎన్నిక నిర్వహించేలా స్పష్టమైన చట్టపరమైన నిబంధనలు తీసుకురావాలి. బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి.

5. ఎన్నికల నేరాలకు ప్రత్యేక న్యాయవ్యవస్థ: ఎన్నికల సందర్భంగా హత్యా బెదిరింపులు, కిడ్నాప్‌లు, దాడులు, బలవంతపు ఉపసంహరణలు, అధికార దుర్వినియోగం వంటి నేరాలను విచారించడానికి ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ న్యాయస్థానాలు ఏర్పాటు చేయాలి. నిర్దిష్ట గడువులో విచారణ, తీర్పు వచ్చేలా చట్టం చేయాలి.

6. బాధిత అభ్యర్థులకు, కుటుంబాలకు రక్షణ: బెదిరింపులకు గురైన అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులకు తక్షణ పోలీసు రక్షణ కల్పించాలి. ఉద్యోగులను రాజకీయ ఒత్తిళ్లతో బెదిరించిన అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి.

7. ఎన్నికల పారదర్శకతపై ప్రజలకు హక్కు: ప్రతి జిల్లాలో నమోదైన ఎన్నికల కేసులు, నామినేషన్ల తిరస్కరణలు, ఉపసంహరణలు, ఏకగ్రీవాలు, ఎన్నికల ఫిర్యాదులు, తీసుకున్న చర్యల వివరాలను ఎన్నికల సంఘం ప్రజలకు బహిరంగంగా అందుబాటులో ఉంచాలి. ఇవి కేవలం ప్రస్తుత ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేసే డిమాండ్లు కావు. భవిష్యత్తులో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఎన్నికల వ్యవస్థను తమ రాజకీయ ప్రయోజనాలకు వినియోగించుకోలేని విధంగా నిర్మించాల్సిన శాశ్వత ప్రజాస్వామ్య రక్షణ కవచాలు.

నవంబర్ 11 ప్రజాస్వామ్య పరిరక్షణ నిరసన దినం!

స్థానిక ఎన్నికల్లో జరిగిన దౌర్జన్యాలు, నామినేషన్ల అడ్డగింతలు, బెదిరింపులు, బలవంతపు ఏకగ్రీవాలు, పోలీసు వ్యవస్థ దుర్వినియోగం, ఓటర్ల హక్కులకు జరిగిన విఘాతం ఇవన్నీ ఒక్కరోజు చర్చించి మరిచిపోయే అంశాలు కావు. ఇవి రాష్ట్ర ప్రజాస్వామ్య భవిష్యత్తును ప్రభావితం చేసే తీవ్రమైన సమస్యలు. అందుకే నవంబర్ 11ను ప్రజాస్వామ్య పరిరక్షణ నిరసన దినంగా పాటించాలి. రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, ప్రజాస్వామికవాదులు, న్యాయవాదులు, మేధావులు, యువజనులు, విద్యార్థులు, మహిళలు, కార్మికులు, రైతులు, ఓటర్లు ఈ నిరసనలో



భాగస్వాములు కావాలి.ప్రతి జిల్లా కేంద్రంలో, పట్టణంలో, మండలంలో ప్రజాస్వామ్య పరిరక్షణ సభలు, నిరసన ప్రదర్శనలు, ర్యాలీలు నిర్వహించాలి. గ్రామగ్రామాన ప్రజలకు ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరించాలి. నామినేషన్ వేయడం నుంచి ఓటు వేయడం వరకు ప్రతి పౌరుడికి ఉన్న రాజ్యాంగ హక్కులను తెలియజేయాలి. ఎన్నికల్లో పోటీ చేసే స్వేచ్ఛ, భయం లేకుండా ఓటు వేసే హక్కు, నిష్పక్షపాతంగా ఓట్ల లెక్కింపు జరిగే హక్కు కోసం ప్రజలను చైతన్యపరచాలి. ఈ ఉద్యమం ఏ ఒక్క రాజకీయ పార్టీకి అనుకూలంగా, మరో పార్టీకి వ్యతిరేకంగా సాగేది కాదు. నేడు అధికారంలో ఉన్న పార్టీకి వ్యతిరేకంగా మాత్రమే కాదు. రేపు అధికారంలోకి వచ్చే ఏ పార్టీ అయినా ప్రజాస్వామ్య హక్కులను కాలరాయకుండా ఉండేందుకు చేపట్టే ప్రజా ఉద్యమం ఇది.ఓటు హక్కు మన రాజ్యాంగ హక్కు పోటీ చేసే హక్కు మన ప్రజాస్వామ్య హక్కు. వాటిని కాపాడుకోవడం మనందరి బాధ్యత.నవంబర్ 11న ప్రతి ప్రజాస్వామిక గొంతుక నిరసనగా మారాలి. ప్రతి గ్రామంలో ప్రజా చైతన్యం వెల్లివిరియాలి. ప్రతి ఓటరు తన హక్కుల పరిరక్షణ కోసం నిలబడాలి.ముగింపు: ప్రజాస్వామ్యాన్ని కాపాడకపోతే ఎన్నికలే అర్థరహితం ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు ప్రజల ఓట్లతో ఏర్పడాలి. పోలీసుల బలంతో కాదు. అధికారుల ఒత్తిళ్లతో కాదు. బెదిరింపులతో కాదు. ప్రత్యర్థులను పోటీకి రానీయకుండా అడ్డుకోవడం ద్వారా కాదు.నేడు స్థానిక ఎన్నికల్లో జరిగిన దౌర్జన్యాలను చూసి ప్రజలు భయపడుతున్నారు. రేపు తమ గ్రామంలో, పట్టణంలో, నియోజకవర్గంలో తమకు నచ్చిన అభ్యర్థిని నిలబెట్టగలమా? తమకు నచ్చిన పార్టీకి ఓటు వేయగలమా? అన్న ఆందోళన వారిలో పెరుగుతోంది.ఈ భయాన్ని తొలగించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. ఎన్నికల సంఘానిది. న్యాయవ్యవస్థదీ. ప్రజాస్వామ్యాన్ని విశ్వసించే ప్రతి రాజకీయ పార్టీదీ.ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఎన్నికల వ్యవస్థ స్వభావం మారకూడదు. అధికార పార్టీ మారినప్పుడల్లా పోలీసుల విధేయత మారకూడదు. ఎన్నికల కమిషన్ పాలకుల ఆదేశాల కోసం ఎదురుచూసే సంస్థగా మారకూడదు.రాజ్యాంగం ప్రజలకు ఇచ్చిన ఓటు హక్కు ఎవరి దయాదాక్షిణ్యాల మీద ఆధారపడకూడదు. నామినేషన్ వేయడానికి పోలీసుల అనుమతి, అధికార పార్టీ అంగీకారం అవసరమయ్యే దుస్థితి ప్రజాస్వామ్యంలో ఉండకూడదు.ఇప్పుడు ప్రతిపక్షానికి జరిగిన అన్యాయం రేపు మరో పార్టీకి జరగకూడదు. ఈరోజు అధికారంలో ఉన్నవారు చేసిన తప్పును రేపు అధికారంలోకి వచ్చేవారు పునరావృతం చేయకూడదు. అందుకు వ్యక్తుల మార్పు కాదు.. వ్యవస్థలో మార్పు రావాలి!ప్రజాస్వామ్యం అంటే కేవలం ఎన్నికలు నిర్వహించడం కాదు. ప్రతి ఒక్కరికీ పోటీ చేసే హక్కు, ప్రచారం చేసే స్వేచ్ఛ, భయం లేకుండా ఓటు వేసే అవకాశం, నిష్పక్షపాతంగా ఫలితాలు ప్రకటించే వ్యవస్థ ఉండాలి.అధికార దర్పంతో సాధించిన విజయాలు శాశ్వతం కావు. ప్రజల హక్కులను హరించిన అధికారానికి ప్రజలే సమాధానం చెబుతారు.మంచి ప్రభుత్వం అనే పేరు ప్రచారంతో రాదు. ప్రజాస్వామ్యాన్ని కాపాడినప్పుడే వస్తుంది.దౌర్జన్యాలతో సాధించిన అధిపత్యం శాశ్వతం కాదు. ప్రజాస్వామ్యాన్ని కబ్జా చేసిన అధికారానికి ప్రజలే చరమగీతం పాడుతారు.నవంబర్ 11న ప్రజాస్వామ్య పరిరక్షణ నిరసన దినాన్ని విజయవంతం చేద్దాం!

ఓటర్ల హక్కుల రక్షణ కోసం ప్రజా ఉద్యమాన్ని నిర్మిద్దాం!

దిద్దుబాటు చేసుకోండి.. ప్రజాస్వామ్యాన్ని కాపాడండి! అని పిలుపునిచ్చారు.

శుభ్రతలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు

పారిశుద్ధ్య పర్యవేక్షక సిబ్బందిపై కమిషనర్ ఆగ్రహం

కర్నూలు సిటీ నందిపత్రిక కర్నూలు నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ పనుల్లో నిర్లక్ష్యం వహించకుండా, క్షేత్రస్థాయిలో మెరుగైన ఫలితాలు కనిపించేలా శ్రద్ధ చూపాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు పారిశుద్ధ్య పర్యవేక్షక యంత్రాంగాన్ని ఆదేశించారు. మంగళవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ పనులను ఆయన పరిశీలించారు. పాతబస్తీలోని నెహ్రూ రోడ్డు అపరిశుభ్రంగా ఉండటంపై పారిశుద్ధ్య పర్యవేక్షక సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జమ్మిచెట్టు సమీపంలోని హంద్రీ నది పరివాహక ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అదేవిధంగా జొహరాపురంలో పుష్‌కార్ట్‌లో చెత్త వదిలేసి ఉండటాన్ని గమనించిన కమిషనర్, సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్, సెక్రటరీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీ కెనాల్ వద్ద ఏర్పాటు చేసిన ట్రాక్టర్‌ను పారిశుద్ధ్య సిబ్బంది వినియోగించుకుని, కేసీ కెనాల్ పరివాహక ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అనంతరం కలెక్టరేట్‌లోని అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణ బాధ్యతగా నిర్వహించాలని, పారిశుద్ధ్య కార్మికులు విధులకు సక్రమంగా హాజరవుతున్నారా లేదా అనే విషయాన్ని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. వీధులు, ప్రధాన రహదారులు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లోపాలు కనిపిస్తే సంబంధిత సిబ్బందిని బాధ్యులుగా చేస్తామని హెచ్చరించారు. ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని స్పష్టం చేశారు. పారిశుద్ధ్యంలో మార్పు కనిపించకపోతే నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు అనిల్ కుమార్, మల్లికార్జున, వలి, రాజు, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.



Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications #D.NO.: 1-639-1-7-11, NEAR NANDYAL ROAD, CPI COLONY, 4TH ROAD, TADIPARI, ANANTHAPURAMU, ANDHRA PRADESH-515411, GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No:-APTEL/26/A6831. Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

కూతురికి బ్రెయిన్ ట్యూమర్ తో తల్లడిల్లి పోతున్న పేద పూజారి

శిల్పా 50 వేల ఆర్థిక సాయం



బండి ఆత్మకూరు నంది పత్రిక నవంబర్ 10: ఆ గ్రామంలో ప్రజలందరూ బాగుండాలని దేవాలయంలో 20 సంవత్సరాల నుండి ఓ పేద పూజారి పూజలు నిర్వహిస్తున్నారు. అందరూ బాగుండాలని ఆకాంక్షిస్తూ పూజలు చేస్తున్న ఆ పూజారి కుటుంబం పైనే విధి వింత నాటకం ఆడుతూ ఉంది. పూజారి కన్న కూతురి పై బ్రెయిన్ ట్యూమర్ రూపంలో వెంటాడుతూ ఉంది. చికిత్స నిర్వహణకు ఆర్థిక లేమి కారణంగా ఆ కుటుంబం అల్లాడి పోతూ ఉంది. దాతల ఆర్థిక సహాయం కొరకు ఆ కుటుంబం ఆర్థిగా ఎదురుచూస్తూ ఉంది ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఈ విధంగా ఉన్నాయి. కోవెలకుంట్ల మండలం కంపమల గ్రామానికి చెందిన కె.వి జనార్ధన శాస్త్రి 20 సంవత్సరాల క్రితం బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న పార్న పల్లె గ్రామానికి వచ్చి, గ్రామంలోని ఆంజనేయ స్వామి దేవాలయంలో అర్చకత్వం చేస్తూ ఉన్నారు. జనార్ధన శాస్త్రికి ఇరువురు ఆడపిల్లలు సంతానం కాగా శ్రీజ సునందిని (15) నంద్యాలలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదవ తరగతి చదువుతూ ఉంది. శ్రీజకు తరచూ తలనొప్పి రావడంతో హైదరాబాదులో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పరీక్షలు నిర్వహించగా బ్రెయిన్ ట్యూమర్ వచ్చిందని తెలిసింది. ఈ సంఘటన 2025 వ సంవత్సరంలో జరిగింది. అప్పట్లో హైదరాబాదులో శ్రీజకు బ్రెయిన్ ట్యూమర్ కు చికిత్స చేయడంతో కోలుకోవడం జరిగింది. శ్రీజ కోలుకుందన్న ఆనందం ఆ కుటుంబంలో ఎక్కువ రోజులు ఉండలేదు. బ్రెయిన్ ట్యూమర్ వ్యాధి తిరిగి తిరగబెట్టింది. నెల రోజుల క్రితమే తిరిగి బ్రెయిన్ ట్యూమర్ వ్యాధికి చికిత్స చేయించారు. రెండుసార్లు ఆపరేషన్ జరగడంతో 40 లక్షల రూపాయల దాకా ఖర్చు కావడంతో ఆ పేద పూజారి కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో అల్లాడిపోతూ ఉంది. కన్న కూతురి పరిస్థితిని దుస్థితిని చూసి జనార్ధన శాస్త్రి కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. జనార్ధన శాస్త్రి ఆర్థిక పరిస్థితులను చలించి పోయిన గ్రామస్తులు కొందరు ఈ విషయాన్ని శ్రీశైలం మాజీ శాసనసభ్యుడు శిల్పా చక్రపాణి రెడ్డి దృష్టికి తీసుకొని వెళ్లారు. మానవతా దృక్పథంతో చక్రపాణి రెడ్డి ఆ పేద పూజారి కుటుంబానికి 50వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు.



గ్రామస్తులు కొందరు అదనంగా 88 వేల రూపాయలను వసూలు చేసి జనార్ధన శాస్త్రి కుటుంబానికి అందజేశారు. ఎలాంటి స్థిర చ రాస్తులు లేని జనార్ధన శాస్త్రి, దేవాలయం ద్వారా వచ్చే జీతంతోనే జీవన ప్రయాణం సాగిస్తున్నారు. పేద పూజారి కుటుంబాన్ని ఆదుకునేందుకు మానవతా దృక్పథంతో ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి ఆ కుటుంబాన్ని ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసేవారు 9948110469ఐ వాట్సాప్ నంబర్ కు ఆర్థిక సహాయం అందజేస్తారని ఆశిద్దాం!

ఎన్నికల ఖర్చుల నిర్వహణపై కార్యదర్శులు అసహనం

బండి ఆత్మకూరు నంది పత్రిక నవంబర్ 10: ఎన్నికలకు హాజరయ్యే సిబ్బందికి సరైన వసతులు కల్పించండి. సి బ్బందికి టిఫిన్లు భోజన వసతుల ఏర్పాటులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోండి. వీటికి సంబంధించి ఖర్చుల నిర్వహణకు బిల్లులు ఇప్పించే పూచి నాదంటూ రిటర్నింగ్ అధికారి పంచాయతీ కార్యదర్శులకు హామీ ఇచ్చారు. రిటర్నింగ్ అధికారి ఇచ్చిన హామీతో పంచాయతీ కార్యదర్శులు పోలింగ్ స్టేషన్లో పోలింగ్ సిబ్బందికి అన్ని వసతులు కల్పించారు. ప్రస్తుతం వాటికి సంబంధించిన బిల్లులను మంజూరు చేయడంలో ఎంపీడీవో మీనమేషాలు లెక్కిస్తూ ఉండటంతో పంచాయతీ కార్యదర్శులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. బండి ఆత్మకూరు మండలంలో ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి 42 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. ఎన్నికలకు హాజరయ్యే సిబ్బందికి భోజనాలు సరైన వసతులు కల్పించడంలో పంచాయతీ కార్యదర్శులే బాధ్యత వహించారు. ఒక్కొక్క పోలింగ్ స్టేషన్లో పదివేల రూపాయలకు పైబడి ఖర్చయింది. ఇందుకు సంబంధించి బిల్లులు మంజూరు చేయించుకునేందుకు కార్యదర్శులు రెండు రోజుల నుండి ఎంపీడీవో కార్యాలయం చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. మంగళవారం ఎంపీడీవో అందుబాటులో ఉండడంతో కార్యదర్శులు అందరూ ఎంపీడీవో ను కలిసి బిల్లుల విషయంపై విన్నవించుకున్నారు. ఎన్నికల నిర్వహణకు లక్షల రూపాయలలో ఖర్చు అయిందని, నామినేషన్ల నిర్వహణకు భోజనాలకు,అంతా అయిపోయిందని,ప్రస్తుతానికి ఏదో విధంగా సర్దుబాటు చేసుకోండి అని ఉచిత సలహా ఇచ్చారు. రిటర్నింగ్ అధికారి ఇచ్చిన హామీతో తాము పోలింగ్ స్టేషన్లో వేల రూపాయలు ఖర్చు చేయడం జరిగిందని పంచాయతీ కార్యదర్శులు వాపోయినట్లుగా తెలుస్తోంది. అయితే ప్రస్తుతానికి ఒక్కొక్కరికి మూడు వేల రూపాయలు ఇస్తానని దీనితో సర్దుకోవాలని ఎంపీడీవో కార్యదర్శులకు చెప్పినట్లుగా తెలుస్తోంది. ఎన్నికల ఖర్చుకు అంతా అయిపోయిందన్న అధికారులు అప్పటికప్పుడు మొత్తం పోలీస్ స్టేషన్లకు సంబంధించి బ్యాంకు ద్వారా డబ్బును డ్రా చేసి తీసుకొని వచ్చారు. కొందరు మహిళా కార్యదర్శిలు వచ్చిందే చాలంటూ పోలింగ్ బూత్ కు 3000 రూపాయలు చొప్పున తీసుకొని వెళ్ళిపోయారు. అయితే మిగతా కార్యదర్శులు మూడు వేల రూపాయలను తీసుకునేందుకు మొదట్లో నిరాకరించి నప్పటికీ వారు కూడా ఇదే పద్ధతిలో సరిపుచ్చుకున్నారు. వేల రూపాయల్లో ఖర్చు చేస్తే మూడు వేల రూపాయలు చొప్పున చేతిలో పెడితే మా పరిస్థితి ఏమిటని కొందరు కార్యదర్శులు ప్రశ్నిస్తున్నారు. రాబోవు పంచాయతీ ఎన్నికల్లో ఖర్చులు మరింత పెరిగే అవకాశం ఉంటుందని కార్యదర్శులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో కార్యదర్శులు ఎన్నికల నిర్వహణపై చేతులెత్తేసే పరిస్థితులు ఏర్పడుతాయని సమాచారం. పక్క మండలాల్లో ఒక్కొక్క కార్యదర్శికి పోలింగ్ బూత్ కు 8 వేల రూపాయల చొప్పున కార్యదర్శులకు చెల్లించారు. మరి బండి ఆత్మకూరు మండలంలో మూడు వేల రూపాయల చెల్లించడంలో అధికారుల ఆంతర్యం ఏమిటో అంతు పట్టడం లేదు.



డిప్యూటీ సి ఈ ఓ తో మాట్లాడండి ఆర్వో లీలావతి

పంచాయతీ కార్యదర్శుల బిల్లుల చెల్లింపులో డిప్యూటీ సీఈవో తో మాట్లాడండి అని ఎన్నికల రిటర్నింగ్ అధికారి లీలావతి పేర్కొన్నారు. బిల్లుల చెల్లింపు విషయముపై మంగళవారం నంది పత్రిక విలేకరి చరవాణి ద్వారా ఆర్ వో ను ప్రశ్నిస్తే పై విధంగా సమాధానం ఇచ్చారు. ఫైనాన్షియల్ మ్యాటర్ తో తనకు సంబంధం లేదని పేర్కొనటం కొసమెరుపు.

ఎంపీటీసీ మృతి పై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఎంపీ బస్తిపాటి నాగరాజు



కర్నూలు సిటీ నందిపత్రిక కర్నూలు జిల్లా ఆలూరు 4వ ఎంపీటీసీ స్థానం నుంచి పోటీ చేసి గెలుపొందిన టీడీపీ అభ్యర్థి బోయ లక్ష్మి ఆకస్మిక మృతి పై ఎంపీ బస్తిపాటి నాగరాజు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ఎంపీటీసీ ఎన్నికల్లో విజయం సాధించి , పదవీ ప్రమాణ స్వీకారం చేయకుండానే లక్ష్మి అనారోగ్యంతో మరణించడం విచారకరమన్నారు.. మృతురాలి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానన్న ఎంపీ, కుటుంబ సభ్యులకు పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని తెలిపారు.

కాటసాని రాంభూపాల్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన కాల్వ ఎంపీటీసీలు గ్రామ ప్రజలు



కర్నూల్ సిటీ నంది పత్రిక కాల్వ గ్రామ ఎంపీటీసీ – 1 అలీ బాషా మరియు ఎంపీటీసీ -2 మద్దిలేటి నాయక్ వైఎస్ఆర్సీపీ ఎంపీటీసీలుగా విజయం సాధించిన సందర్భంగా, గ్రామానికి చెందిన వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్ఆర్సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి ని, ఆయన సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ ని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కాటసాని దంపతులకు శాలువా కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించి తమ విజయానందాన్ని పంచుకున్నారు.అనంతరం కాటసాని రామభూపాల్ రెడ్డి విజయం సాధించిన ఎంపీటీసీ లు అలీ బాషా మరియు మద్దిలేటి లకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. పార్టీ విజయానికి కృషి చేసిన గ్రామ నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలుపుతూ, ఈ విజయం ప్రతి కార్యకర్త సమష్టి కృషికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాల్వ మరియు గుడుంబాయి తాండ గ్రామాల నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

రబీ సీజన్‌లో రైతులందరికీ ఉచిత పంటల బీమా అమలు చేయాలి!

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు జగన్నాథం



కర్నూల్ సిటీ నంది పత్రిక ఖరీఫ్ సీజన్‌లో చెల్లించిన బీమా ప్రీమియాన్ని వెంటనే రైతులకు తిరిగి చెల్లించాలి! రబీ సీజన్‌కు సంబంధించి పంటల బీమా ప్రీమియం చెల్లించాలని ప్రభుత్వం రైతులకు సూచిస్తోంది. అయితే, ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, రాష్ట్ర ప్రభుత్వమే ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని, ఈ రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన అన్ని రకాల పంటలకు ఉచిత బీమా వర్తింపజేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె. జగన్నాథం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో ప్రస్తుతం వర్షాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బోరుబావుల్లో అరకొరగా ఉన్న నీరు కూడా ఎంతకాలం అందుబాటులో ఉంటుందో తెలియని పరిస్థితి నెలకొంది. తీవ్రమైన కరువు పరిస్థితుల నేపథ్యంలో పంటలు ఏమాత్రం పండుతాయో కూడా అర్థంకాని దుస్థితి ఏర్పడింది. అయినప్పటికీ రైతులు తమకున్న ఆర్థిక శక్తినంతా కూడగట్టుకుని, అప్పులు చేసి వ్యవసాయానికి పెట్టుబడులు పెడుతున్నారు.ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో రైతులకు కనీసం పంటల బీమా ప్రీమియం కూడా ప్రభుత్వం చెల్లించకపోవడం దురదృష్టకరం. దేశానికి ఆహార ధాన్యాలను పండించి అందించే రైతాంగానికి కనీస భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. రైతుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సమంజసం కాదు.కావున, గతంలో అమలులో ఉన్న విధంగా రైతులకు ఉచిత పంటల బీమా పథకాన్ని తిరిగి అమలు చేయాలి. ప్రస్తుత రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన అన్ని రకాల పంటలకు ప్రభుత్వమే బీమా ప్రీమియం చెల్లించి బీమా రక్షణ కల్పించాలి. అదేవిధంగా, ఖరీఫ్ సీజన్‌లో రైతులు తమ సొంత ఖర్చులతో చెల్లించిన పంటల బీమా ప్రీమియాన్ని వెంటనే తిరిగి చెల్లించాలి. ఖరీఫ్ సీజన్‌లో నష్టపోయిన అన్ని రకాల పంటలకు నిబంధనల ప్రకారం బీమా పరిహారం అందించాలి.ఇప్పటికే వ్యవసాయ పెట్టుబడులు సమకూర్చుకోలేక రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకవైపు సాగునీటి కొరత, మరోవైపు పెట్టుబడుల భారం, ఇంకోవైపు పంటలకు గిట్టుబాటు ధర లేక రైతాంగం సంక్షోభంలో కూరుకుపోతోంది. అయినప్పటికీ ప్రభుత్వం రైతుల సమస్యలు తమకు పట్టనట్లుగా వ్యవహరించడం బాధాకరం.గతంలో చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తే రైతుల పక్షాన నిలబడి, వారి సమస్యలన్నింటినీ పరిష్కరిస్తారని నమ్మి రైతులు ఓట్లు వేసి గెలిపించారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయాన్ని, రైతాంగ సమస్యలను విస్మరిస్తే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుంది. గతంలో రైతులు తమ సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించిన పాలకులకు తగిన విధంగా బుద్ధి చెప్పిన విషయాన్ని ప్రభుత్వం గుర్తుంచుకోవాలి. కావున రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి, ఈ రబీ సీజన్‌కు సంబంధించిన పంటల బీమా ప్రీమియాన్ని పూర్తిగా ప్రభుత్వమే చెల్లించాలి. ఖరీఫ్ సీజన్‌లో రైతులు చెల్లించిన బీమా ప్రీమియాన్ని తిరిగి చెల్లించడంతోపాటు, నష్టపోయిన పంటలకు బీమా పరిహారం అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేస్తోంది.

పెద్దపులి దాడిలో బాధితులకు నష్టపరిహారం



బండి ఆత్మకూరు నంది పత్రిక నవంబర్ 10: బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న సోమయాజులపల్లె గ్రామంలో పెద్దపులి దాడిలో మృతి చెందిన ఆవుల యజమానులకు అటవీ శాఖ తరఫున మంగళవారం నష్టపరిహారం అందజేశారు.,డిప్యూటీ డైరెక్టర్, డాక్టర్ చైతన్య కుమార్ రెడ్డి ప్రాజెక్ట్ టైగర్, నంద్యాల వారి చేతుల మీదుగా, బండి ఆత్మకూరు ఫారెస్ట్ రేంజ్ అధికారి జెడ్ నాసిర్ ఝా సమక్షంలో బాధిత ఆవుల యజమానులకు నష్టపరిహార చెక్కులను పంపిణీ చేయడం జరిగింది. సోమయాజులపల్లె గ్రామానికి చెందిన బాధిత రైతుతెలుగు సుబ్బరాయుడుకు రూ.30 వేల రూపాయలు శ్రీనివాసులుకు15, వేల రూపాయలు చొప్పున.45, వేల రూపాయలు నష్టపరిహారాన్ని చెక్కుల రూపంలో అందజేయడం జరిగింది. పెద్దపులి దాడుల వల్ల పశువులను కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, నిబంధనల ప్రకారం నష్టపరిహారం అందజేస్తామని అటవీ శాఖ అధికారులు తెలిపారు.

అయ్యప్ప దీక్షా శిబిరాన్ని ప్రారంభించిన కాటసాని తిరుపాల్ రెడ్డి

పదేళ్లుగా అయ్యప్ప స్వాములకు ఉచిత భిక్షా కార్యక్రమం

దీక్షాధారుల సేవలో అయ్యప్ప స్వామి అన్నదాన కమిటీ



బనగానపల్లె నవంబర్ 10నందిపత్రిక పట్టణంలోని స్థానిక శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో అయ్యప్ప స్వామి దీక్షాధారుల కోసం గత పదేళ్లుగా నిర్వహిస్తున్న ఉచిత భిక్షా (అన్నదాన) కార్యక్రమం ఈ ఏడాది కూడా భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా ప్రారంభమైంది. అయ్యప్ప స్వామి అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ దీక్షా శిబిరాన్ని మంగళవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, అవుకు మండల వైఎస్సార్సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యప్ప స్వామి దీక్ష అనేది భక్తి, నియమ నిష్ఠలు, ఆధ్యాత్మిక చింతనతో కూడిన పవిత్రమైన కార్యక్రమమని పేర్కొన్నారు. మండల కాలం పాటు దీక్షను చేపట్టిన స్వాములు ఎలాంటి ఆటంకాలు లేకుండా భక్తిశ్రద్ధలతో తమ దీక్షను విజయవంతంగా పూర్తి చేసుకునేందుకు ఇటువంటి ఉచిత భిక్షా శిబిరాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు.గత పదేళ్లుగా నిరంతరాయంగా అయ్యప్ప స్వాములకు ఉచిత భిక్షా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అన్నదాన కమిటీసభ్యులను ఆయనప్రత్యేకంగాఅభినందించారు. అయ్యప్ప స్వాముల సేవే లక్ష్యంగా కమిటీ చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. దీక్ష స్వీకరించిన ప్రతి ఒక్క స్వామి ఈ ఉచిత భిక్షా సదుపాయాన్ని సద్వినియోగంచేసుకోవాలని కోరారు.భక్తులకు సేవ చేయడంఎంతోపుణ్యకార్యమని, ఇటువంటి ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు సమాజంలో భక్తిభావాన్ని, ఐక్యతనుపెంపొందిస్తాయని పేర్కొన్నారు. అయ్యప్ప స్వాముల సహకారంతో ఈ అన్నదాన కార్యక్రమం మరింత విజయవంతంగా కొనసాగాలనిఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సీహెచ్. నాగిరెడ్డి, దోనపాటి మహేశ్వరరెడ్డి, బి. రామసుబ్బారెడ్డి, నిచ్చెనమెట్ల గోపవరం గోపాల్ రెడ్డి, చెన్నారెడ్డి, నాగభూషణం రెడ్డి, ప్రతాప్ రెడ్డి, కేవీ సుబ్బారెడ్డి, సుదర్శన్ రెడ్డి, అంబటి రవికుమార్ రెడ్డితో పాటు పలువురు అయ్యప్ప మాలాధారులు, అన్నదాన కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



కార్తీక మాసం సందర్భంగా పంచారామాల దర్శనానికి ప్రత్యేక బస్సులు

కార్తీక మాసం సందర్భంగా శైవ క్షేత్రాలైన పంచారామాలకు హనుమకొండ నుండి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు హనుమకొండ డిపో మేనేజర్ భూక్యా ధరంసింగ్ తెలిపారు. భక్తుల సౌకర్యార్థం తెలంగాణలోని రామప్ప శ్రీ రామలింగేశ్వరాలయం, లక్న వరం సరస్సు, మేడారం సమ్మక్క – సారలమ్మ, మల్లూరు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం, బొగత జలపాతం, కాళేశ్వరంలోని శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం, భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం లతో పాటు హైదరాబాదు రామోజీ ఫిలిం సిటీ, సాలార్‌జంగ్ మ్యూజియం, గోల్కొండ కోట, ఆంధ్ర ప్రదేశ్ లోని ప్రసిద్ధి చెందిన పంచరామ క్షేత్రాలైన అమరావతి , ద్రాక్షారామం, భీమవరం, పాలకొల్లు, సామర్లకోట లలోని స్వామి వార్లను దర్శించుకునేలా ప్రత్యేక బస్సు సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు. అంతేకాకుండా తమిళనాడులోని అరుణాచలంకు కూడా నడపడం జరుగుతుందని తెలిపారు. అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం శబరిమలై దేవస్థానానికి భక్తుల డిమాండ్ కు అనుగుణంగా ఈ ప్రత్యేక బస్సులు నడపడం జరుగుతుందని, మరిన్ని వివరాల కోసం 8977781103, 9493882464, 9949193893 లను సంప్రదించాలని డిఎం తెలిపారు.

వార్డులో కుల సంఘాల ప్రజల ఆదరణ మరువ లేనిది

బిజెపి నాయకులు వేల్పుల గోపాల్

కర్నూల్ సిటీ నంది పత్రిక కర్నూలు కార్పొరేషన్ బిజెపి 44 వార్డు కార్పొరేటర్ బి.రమాదేవి మరియు యం.గంగాధర్ మాట్లాడుతూ కూటమి భారతీయ జనతా పార్టీ తెలుగుదేశం జనసేన పార్టీల నాయకులు కార్యకర్తలు వార్డు నందు ప్రజలందరికీ పేరు పేరునా ధన్యవాదములు, తెలియజేశారు అనంతరం వివిధ కుల సంఘాల నాయకులకు గ్రామ పెద్దలకు ప్రజలకు వారి స్వగృహం వద్దకు వెళ్లి నాకు కర్నూలు కార్పొరేషన్ 44 కార్పొరేటర్ గా అవకాశం కల్పించిన మీకు ప్రతి ఒక్కరికీ పేరు పేరునా ధన్యవాదములు తెలిపిన సందర్భంగా కార్పొరేటర్ ను సన్మానం చేసి ఆశీర్వదించారు వార్డు నందు ఎలాంటి సమస్యలు ఉన్నా వాటిని వెంటనే పరిష్కరించి దిశగా ప్రయత్నం చేస్తానని మీ ముందుకు వచ్చి సమస్యలు మా దృష్టికి తీసుకురాగలరని కోరుతున్నాము ఈకార్యక్రమంలో కూటమి నాయకులు అక్కెం విశ్వనాథ్ వేల్పులగోపాల్ పవన్ చిరంజీవి రవి ప్రకాష్ శివ శంకర్ మాధవ్ కుమార్ తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



నేల ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి





భవిష్యత్ తరాలకు సారవంతమైన భూమిని అందించాలి

వ్యవసాయానికి భూమి, నీరు, విత్తనం, వాతావరణం అత్యంత కీలకశీ

జిల్లా వ్యవసాయ అధికారి ఎన్. వెంకటేశ్వర్లు

నంద్యాల బ్యూరో, నవంబర్ 10(నంది పత్రిక):- నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం, భూసార క్షీణతను అరికట్టడం, రైతులకు శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించడమే లిఖేత్ బచావో అభియాన్“ ముఖ్య ఉద్దేశ్యం అని రీసెర్చ్ అసోసియేట్ డైరెక్టర్, ఆర్ ఏ ఆర్ ఎస్ , నంద్యాల డా. వి. జయలక్ష్మి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ లోని పీజీఆర్ ఎస్ హాల్ నందు ప్రాంతీయ వ్యవసాయ విశ్వవిద్యాలయం నంద్యాల వారి ఆదర్వం లో “ఖేత్ బచావో అభియాన్ “పొలం సంరక్షణ కార్యక్రమం ను రీసెర్చ్ అసోసియేట్ డైరెక్టర్, ఆర్ ఏ ఆర్ ఎస్ , నంద్యాల డా. వి. జయలక్ష్మి నిర్వహించారు. రీసెర్చ్ అసోసియేట్ డైరెక్టర్ మాట్లాడుతూ.. నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం, భూసార క్షీణతను అరికట్టడం, రైతులకు శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అని తెలిపారు. దేశవ్యాప్తంగా కేతే బచావో అభియాన్ పొలం సంరక్షణ కార్యక్రమం జాతీయ ఉద్యమం అక్టోబర్ 22 నుంచి నవంబర్ 30 వరకు దేశవ్యాప్తంగా కొనసాగుతుందని తెలిపారు. దేశంలోని 34 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 700కు పైగా జిల్లాలు, 50 వేల గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారని తెలిపారు.భారతదేశంలో సుమారు 30 శాతం సాగు భూమి నేల క్షీణత, ఎడారీకరణ వంటి సమస్యలను ఎదుర్కొంటోందని, నేల కోత, అడవుల నరికివేత తదితర కారణాలతో భూసారం దెబ్బతింటోందని అన్నారు. భవిష్యత్ తరాలకు సారవంతమైన భూమిని అందించాలంటే నేల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. నేలలో సేంద్రీయ కార్బన్ శాతాన్ని పెంచడం, భూసార పరీక్షల ఆధారంగా సమతుల్యంగా ఎరువులను వినియోగించడం, సాయిల్ హెల్త్ కార్డుల సూచనలను పాటించడం, పంట మార్పిడి విధానాలను అవలంబించడం ద్వారా నేల సారాన్ని కాపాడుకోవచ్చని వివరించారు. రైతులు శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అనుసరించి భూమి ఆరోగ్యాన్ని పరిరక్షించాలన్నారు. అగ్రికల్చరల్ కాలేజ్ అసోసియేట్ డీన్ మాట్లాడుతూ.. నేల ఆరోగ్యాన్ని పరిరక్షిస్తూ, రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి సుస్థిర వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా “ఖేత్ బచావో” (ఖేట్ బచావో భూమిని రక్షించుకుందాం) అభియాన్‌ను నిర్వహించడం జరిగిందన్నారు. దేశవ్యాప్తంగా 50 లక్షల మంది రైతులకు ఈ ఉద్యమాన్ని చేరవేయాలనే లక్ష్యంతో వివిధ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు అని తెలిపారు. ఈ అభియాన్ ప్రధానంగా మూడు అంశాలైనా నేలను పరిరక్షించడం, రసాయనాలు మరియు ఎరువుల వినియోగాన్ని తగ్గించడం, సుస్థిర వ్యవసాయ పద్ధతులను పాటిస్తూ భవిష్యత్ తరాలకు సారవంతమైన భూమిని అందించడం ముఖ్య ఉద్దేశశీ అని అన్నారు. భూమి కేవలం ఆస్తి మాత్రమే కాదని, మానవాళి మనుగడకు, ఆహార భద్రతకు ప్రధాన ఆధారమని అని అన్నారు. నేల సారాన్ని కాపాడుకోకపోతే భవిష్యత్తులో వ్యవసాయ ఉత్పాదకత తగ్గి ఆహార భద్రతకు ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని తెలిపారు. రైతులు నేల పరీక్షలు చేయించుకోవడం, సేంద్రియ పదార్థాల వినియోగాన్ని పెంచడం, అవసరానికి మించి రసాయన ఎరువులు, పురుగుమందులు వాడకుండా శాస్త్రీయ పద్ధతులను అనుసరించడం అవసరమని తెలిపారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మాట్లాడుతూ.. వ్యవసాయ రంగం ప్రస్తుతం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని, ఒకప్పుడు లాభసాటిగా ఉన్న వ్యవసాయం నేడు వివిధ కారణాలతో సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొంటోందని తెలిపారు. వ్యవసాయ రంగంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులకు రైతులు, శాస్త్రవేత్తలు, సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను గుర్తించి పరిష్కార దిశగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయానికి భూమి, నీరు, విత్తనం, వాతావరణం అనే నాలుగు అంశాలు అత్యంత కీలకమని, వీటిలో భూమి ఆరోగ్యం వ్యవసాయ ఉత్పాదకతకు పునాది వంటిదని వివరించారు. రసాయనిక ఎరువులు, పురుగు మందులను అధికంగా వినియోగించడం వల్ల నేలలో సహజసిద్ధమైన సారవంతం తగ్గిపోవడంతో పాటు నేల ఆరోగ్యం క్షీణిస్తోందని తెలిపారు. హరిత విప్లవం ద్వారా వ్యవసాయ దిగుబడులు గణనీయంగా పెరిగినప్పటికీ, కాలక్రమేణా రసాయనిక ఎరువులు, పురుగుమందుల వినియోగం అధికమై భూమి సహజ స్వభావం, సారం దెబ్బతిన్నాయని వివరించారు. అధిక దిగుబడుల కోసం విచక్షణారహితంగా రసాయనాలను వినియోగించడం వల్ల దీర్ఘకాలంలో వ్యవసాయ భూములపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందనీ, ఈ నేపథ్యంలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సాహం చాలన్నారు. రసాయనిక ఎరువుల వినియోగాన్ని క్రమంగా తగ్గిస్తూ, జీవామృతం, ద్రవ జీవామృతం వంటి ప్రకృతి సిద్ధమైన సేంద్రియ ద్రావణాలను, జీవ ఆధారిత వ్యవసాయ పద్ధతులను అవలంబించాలన్నారు. రైతులు తక్షణ దిగుబడితో పాటు భూమి దీర్ఘకాలిక ఆరోగ్యానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని, శాస్త్రీయంగా నిరూపితమైన ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తూ సుస్థిర వ్యవసాయం దిశగా ముందుకు సాగాలని అన్నారు. నేల ఆరోగ్య పరిరక్షణే సుస్థిర వ్యవసాయానికి పునాది. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం ద్వారా భూమిని, పర్యావరణాన్ని, భవిష్యత్ తరాల ఆహార భద్రతను కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖేత్ బచావో బుక్ లెట్ ను ఆవిష్కరించారు. అనంతరం రైతులకు భూసార ఆరోగ్య పత్రాలను పంపిణీ చేశారు. ఈ అసోసియేట్ డీన్, అగ్రికల్చరల్ కాలేజ్, మహానంది డా. శ్యామ్ రాజ్ నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్. వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు

కె. బాలా మద్దిలేటి, కోఆర్డినేటర్, నంద్యాల,

డి. సూరిబాబు, కోఆర్డినేటర్, విద్యార్థులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అహోబిలం ఇస్కాన్ ఆధ్వర్యంలో ఘనంగా గోవర్ధన పూజ.



రుద్రవరం ప్రతినిధి నవంబర్ 10 (నంది పత్రిక): మండల పరిధిలోని హరినగరం గ్రామ సమీపంలో ఇస్కాన్ అహోబిలం టెంపుల్ లో గోవర్ధన పూజను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసం పాడ్యమి సందర్భంగా గోపూజ కార్యక్రమాలతో పాటు గోవర్ధన పూజ కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇస్కాన్ మందిరం నిర్వాహకులు చంద్రకేశవదాసు ప్రభు మాట్లాడుతూ శ్రీకృష్ణుని యొక్క లీలలలో గోవర్ధన పర్వతాన్ని చిటికెన వేలుతో ఎత్తిన లీల ఎంతో విశేష ఘట్టమని అన్నారు. ద్వాపర యుగంలో ఇదే రోజున ఆయన గోవర్ధనగిరిని ఎత్తడం జరిగిందని గుర్తు చేశారు. పవిత్రమైన ఈ రోజున ఇస్కాన్ మందిరం ప్రాంగణంలో గోవర్ధనగిరి పర్వత నమూనాను ఏర్పాటు చేశామన్నారు. గోవర్ధనగిరి నమూనా ఏర్పాటు చేసిన ప్రాంగణంలో గిరిరాజ్ అభిషేకం, హారతులు, పుష్పాధనలు, గోవర్ధన్ పూజా హారతి, గోవర్ధన పర్వత పూజ, గోవర్ధన గిరి ప్రదక్షిణలు, గోపూజ, గంగాజలం వంటి ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులచే కీర్తనలు, గోవర్ధన లీల కథ ప్రవచనాలు, సంపూర్ణ ప్రసాద వితరణ, కార్యక్రమాలతోపాటు శ్రీకృష్ణ భగవానునికి విశేష పూజలు నిర్వహించామని ఆయన తెలిపారు. ఈ పూజ కార్యక్రమాలలో అధిక సంఖ్యలో భక్తాదులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలలో పాల్గొన్న భక్తాదులకు ప్రసాదంతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



ఇంటర్ బోర్డు డి ఐ ఈ ఓ శంకర్ నాయక్ పర్యటన విద్యా సమీక్ష



రుద్రవరం ప్రతినిధి నవంబర్ 10 (నంది పత్రిక): రుద్రవరం ఏపీ మోడల్ స్కూల్ & జూనియర్ కళాశాలను డీఐఈఓ ఇంటర్ బోర్డు శంకర్ నాయక్ సందర్శించి, పాఠశాల మరియ కళాశాలలో నిర్వహిస్తున్న విద్యా కార్యక్రమాలు, విద్యార్థుల అభ్యసన స్థాయి, పరీక్షల నిర్వహణ తదితర అంశాలను సమీక్షించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో సమావేశమై విద్యార్థుల విద్యా ప్రగతి, నాణ్యమైన విద్య అందించడం, పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించడం వంటి అంశాలపై విలువైన సూచనలు, మార్గదర్శకత్వం అందించారు. ఇంకా జేఈఈ, ఎంబిబిఎస్ సీట్లు తప్పనిసరిగా రావాలి అని అన్నారు.ఇంచార్జి ప్రిన్సిపాల్ రజిని మాటలాడుతూ అధికారుల పర్యటన మన పాఠశాల విద్యా అభివృద్ధికి, విద్యార్థుల ఉత్తమ ఫలితాల సాధనకు మరింత ప్రోత్సాహాన్ని అందించింది అని అన్నారు. సమీక్షలోఉపాధ్యాయ బృందం, నజీయా బేగం, ఈరన్న, బషీర్, రఫీ సిబ్బంది పాల్గొన్నారు.

చల్లా వరుణ్ గారూ... నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడండి!



ఎమ్మిగనూరు అక్టోబర్ 10 (నంది పత్రిక)జనసేన నాయకులు చల్లా వరుణ్ తమ మాటలను అదుపులో పెట్టుకుని మాట్లాడాలని, కూటమి నాయకులపై అనవసర విమర్శలు చేయడం మానుకోవాలని తెలుగుదేశం పార్టీ ఎమ్మిగనూరు పట్టణ కోశాధికారి చలువాది విజయలక్ష్మి తీవ్రంగా ఖండించారు.ఆమె మాట్లాడుతూ జనసేన పార్టీలో ఉన్న అంతర్గత విభేదాలను పరిష్కరించుకోకుండా, వాటిని మా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర రెడ్డి గారికి ఆపాదించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.ఎమ్మిగనూరు ప్రజలు కేవలం అభ్యర్థుల వ్యక్తిగత బలాన్ని మాత్రమే చూసి ఓట్లు వేయలేదని, ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి గారి నాయకత్వం, తెలుగుదేశం పార్టీపై ఉన్న విశ్వాసం, కూటమి పట్ల ఉన్న నమ్మకం కూడా ఎన్నికల్లో కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు. జనసేన, బీజేపీ అభ్యర్థుల విజయానికి తెలుగుదేశం పార్టీ సహకరించలేదని మీరు ఎలా చెప్పగలరు? కూటమి ధర్మాన్ని ఉల్లంఘించారని ఆరోపించడానికి మీ వద్ద ఉన్న ఆధారాలేమిటి? మీ వ్యక్తిగత అభిప్రాయాన్నే మొత్తం జనసేన పార్టీ అభిప్రాయంగా చిత్రీకరించడం సరికాదని అన్నారు.క్రాస్ ఓటింగ్ చేయించారంటూ ఆరోపణలు చేయడం సులభం. కానీ వాటిని ఆధారాలతో నిరూపించాల్సిన బాధ్యత కూడా మీదే!ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ప్రతి ఫలితానికీ ఎమ్మెల్యే గారిని బాధ్యులను చేయడం రాజకీయ పరిపక్వత కాదని విమర్శించారు.కూటమిలో అభిప్రాయ భేదాలు ఉంటే వాటిని అంతర్గతంగా చర్చించుకుని పరిష్కరించుకోవాలే తప్ప, బహిరంగ విమర్శలతో కూటమి ప్రతిష్ఠను దెబ్బతీయడం తగదని హితవు పలికారు.

మహేశ్వరికి న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం ఆగదు!

జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బోయ క్రాంతి నాయుడు



కర్నూలు సిటీ నందిపత్రిక మహేశ్వరికి న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం ఆగదు అని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు న్యాయవాది బోయ క్రాంతి నాయుడు తెలియజేశారు. కట్నం వేధింపుల కారణంగా వివాహమైన ఆరు నెలల్లోపే మహేశ్వరి ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరం. ఎంతో ప్రేమతో పెంచి, ఎన్నో ఆశలతో పెళ్లి చేసిన తల్లిదండ్రులకు ఇది తీరని విషాదం. మహేశ్వరికి న్యాయం చేయాలని పోరాడుతున్న విద్యార్థులు, బాధిత కుటుంబ సభ్యులకు కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోంది. కుటుంబ సభ్యులకు ఎఫ్ఐఆర్ కాపీ కూడా అందని పరిస్థితిని గుర్తించి, నేను ఆర్డీవో, డీఎస్పీ, జాయింట్ కలెక్టర్ తో మాట్లాడి ఎఫ్ఐఆర్ కాపీ అందేలా చర్యలు తీసుకున్నాను. పోలీసు అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి నిందితుల అరెస్టుకు కూడా కృషి చేయడం జరిగింది. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ ఘటనపై ప్రత్యేక దృష్టి సారించి, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని, కేసు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి దోషులకు చట్టప్రకారం కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని క్రాంతి నాయుడు కోరడమైనది. మహేశ్వరికి న్యాయం జరిగే వరకు బాధిత కుటుంబానికి అండగా ఉంటూ మా పోరాటం కొనసాగిస్తామని క్రాంతి నాయుడు తెలియజేశారు.

అటవీ శాఖ అమరవీరులకు నివాళులు .



రుద్రవరం ప్రతినిధి నవంబర్ 10 (నంది పత్రిక): అటవీ శాఖలో విధులు నిర్వహిస్తూ అమరులైన అటవీవీరులకు అటవీ శాఖ అధికారులు సిబ్బంది ఘనంగా నివాళులు అర్పించారు. రాష్ట్ర అటవీ అమరవీరుల దినోత్సవం సందర్భంగా రేంజ్ అధికారి మూర్తుజావలి సూచనల మేరకు డివ్యూటీ రేంజ్ అధికారి అన్వర్ హుస్సేన్ సమక్షంలో రుద్రవరం అటవీ క్షేత్ర అధికారి కార్యాలయం ఆవరణంలో అటవీ శాఖలో అధికారులు సిబ్బంది చేసిన త్యాగాలను అందించిన సేవలను స్మరించుకుంటూ అమరవీరులకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా అడవులు మరియు వన్యప్రాణులను ఐక్యతతో, నిజాయితీతో కాపాడాల్సిన అవసరాన్ని గుర్తు చేసుకుంటూ జోహార్ అమరవీరులు అంటూ అమరవీరులకు ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ అధికారులు మాబుఖాన్, రామకృష్ణ, శ్రీనివాసులు, జేమ్స్ పాల్, బీట్ అధికారులు నగేష్, నాగహుసేనయ్య, నరసింహారెడ్డి, సురేంద్ర గౌడ్, మదన్ గోపాల్ తోపాటు ప్రొటెక్షన్ వాచర్లు సిబ్బంది పాల్గొన్నారు.

జనగణన2027 రెండవ దశకు ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలి..!

ప్రతి ఒక్కరి వివరాలు ఖచ్చితంగా నమోదు చేసేలా.. సిబ్బందికి సమగ్ర శిక్షణ ఇవ్వాలి

జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా జనగణన అధికారి సూచన

కడప, బ్యూరో చీఫ్ నవంబర్ 10 నంది పత్రిక: జనగణన2027 రెండవ దశ అయిన జనాభా గణనను విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, అవసరమైన ముందస్తు ఏర్పాట్లను నిర్దీత గడువులోగా పూర్తి చేయాలని ఇంచార్జి జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా జనగణన అధికారి వెంకటపతి సూచించారు.

మంగళవారం కలెక్టరేట్ లోని సభాభవన్, పిజిఆర్ఎస్ హాలులో.. రెండవ దశ జనగణన నిర్వహణలో పాల్గొనే అధికారులకు, సిబ్బందికి ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఇంచార్జి జిల్లా రెవెన్యూ అధికారి వెంకటపతి హాజరై.. పలు సూచనలు జారీచేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జనాభా గణనలో ఎవరూ మినహాయించబడకుండా ప్రతి ఒక్కరి వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. దేశ అభివృద్ధికి అవసరమైన ప్రణాళికల రూపకల్పన, విధాన నిర్ణయాలు, నిధులు, వనరుల కేటాయింపులో జనగణన గణాంకాలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. జనగణన 2027ను డిజిటల్ విధానంలో నిర్వహించనున్న నేపథ్యంలో స్వీయ గణన ద్వారా ప్రజల భాగస్వామ్యాన్ని మరింత పెంపొందించనున్నట్లు తెలిపారు.జిల్లాలో జనగణన మొదటి దశలో భాగంగా 2026 మే 1 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించిన ఇండ్ల జాబితా తయారీ, గృహ గణన కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన జిల్లా యంత్రాంగం, ఛార్జి అధికారులు, గణకులు, పర్యవేక్షకులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బందిని ఈ సందర్భంగా అభినందించారు.రెండవ దశ జనాభా గణనకు సంబంధించి సిబ్బంది నియామకం, గణకులు, పర్యవేక్షకులకు సమగ్ర శిక్షణ, క్షేత్రస్థాయి పర్యవేక్షణ, వివిధ శాఖల మధ్య సమన్వయంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పట్టణ ప్రాంతాలు, వలస జనాభా, నిరాశ్రయులు, ఖాళీగా ఉన్న ఇళ్లు, తాళం వేసి ఉన్న గృహాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు.జనాభా గణనలో 40 ప్రశ్నలతో కూడిన ప్రశ్నావళి ద్వారా జనాభా, సామాజిక, ఆర్థిక పరిస్థితులు, వలసలు, సంతానోత్పత్తి తదితర అంశాలకు సంబంధించిన వివరాలను సేకరించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ప్రశ్నపై సిబ్బందికి పూర్తి అవగాహన కల్పించాలని, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడం, వ్యక్తిగత సమాచార గోప్యతను కాపాడడం, డిజిటల్ పరికరాలను సమర్థవంతంగా వినియోగించడంపై శిక్షణ ఇవ్వాలని సూచించారు. మొదటి దశలో సాధించిన విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని, అధికారులందరూ సమష్టి కృషి, అంకితభావం, సమన్వయంతో రెండవ దశ జనాభా గణనను కూడా విజయవంతంగా నిర్వహించి జనగణన 2027లో జిల్లాను ఆదర్శంగా నిలపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర జనగణన సహాయ సంచాలకులు సుప్రేజ్ పాల్గొన్నారు. జిల్లా జనగణన ఇన్‌చార్జి మోహన్ రమణ జనగణన2027 రెండవ దశకు సంబంధించిన ముందస్తు సన్నద్ధత, విధివిధానాలు, అమలు చేయాల్సిన కార్యాచరణపై దృశ్య ప్రదర్శన ద్వారా వివరించారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారులు, నగరపాలక సంస్థ కమిషనర్, కలెక్టరేట్ అధికారులు పాల్గొన్నారు.





రాష్ట్రస్థాయి పోలీస్ క్రికెట్ పోటీల్లో సత్తా చాటాలి

ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు హైదరాబాద్లోని ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న 5వ రాష్ట్రస్థాయి పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్-2026 లో పాల్గొనేందు కు వరంగల్ పోలీస్ కమిషనరేట్ తరపున క్రికెట్ జట్టును ఎంపిక చేశారు. ఈ జట్టుకు గీసుగొండ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ డి.విశ్వేశ్వర్ నాయకత్వం వహించనున్నారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రికెట్ జట్టు సభ్యులను వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్ అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో క్రీడాస్ఫూర్తితో ఆడి, ఉత్తమ ప్రతిభ కనబరిచి వరంగల్ పోలీస్ కమిషనరేట్ కు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

భగిని హస్త భోజనం, అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ఆత్మీయ విందు!

బొల్లు రామమోహన్.

కడప నవంబర్ 10 (నంది పత్రిక రిపోర్టర్) రక్తసంబంధానికి ప్రేమానుబంధం తోడైతే.. అదే భారతీయ సంస్కృతి అందించే అపురూపమైన కానుక!రాఖీ పండుగ అన్నాచెల్లెళ్ల అనుబంధానికి రక్షాబంధమైతే.. భగిని హస్త భోజనం ఆ అనుబంధానికి ఆత్మీయతతో కూడిన విందు. ఒకటి రక్షణకు ప్రతీక అయితే, మరొకటి ప్రేమకు ప్రతిరూపం. పండుగ అంటే కేవలం పూజలు, పిండివంటలు, పట్టుబట్టలు మాత్రమే కాదు.. మనుషుల మధ్య మమకారాన్ని మళ్లీ మళ్లీ గుర్తుచేసే మధురమైన సందర్భం.కార్తీక శుద్ధ విదియను భగిని హస్త భోజనం, యమ ద్వితీయ, భ్రాతృ ద్వితీయ వంటి పేర్లతో పిలుస్తారు. దీపావళి పండుగ అనంతరం వచ్చే ఈ పవిత్రమైన రోజును అన్నాచెల్లెళ్ల ఆత్మీయతకు ప్రతీకగా భారతదేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు నేపాల్‌లోనూ భిన్న సంప్రదాయాలతో జరుపుకుంటారు.

యముడు యమునల అపురూప అనుబంధం

పురాణ కథనం ప్రకారం.. సూర్యభగవానుడి కుమారుడైన యమధర్మరాజుకు యమున సోదరి. తన అన్నను ఇంటికి పిలిచి ఆతిథ్యం ఇవ్వాలని యమున ఎంతోకాలంగా ఎదురుచూస్తుంటుంది. చివరకు ఒక కార్తీక శుద్ధ విదియ రోజున యముడు తన సోదరి ఇంటికి వస్తాడు. అన్న రాకతో ఆనందభరితురాలైన యమున ప్రేమతో స్వాగతం పలికి, నుదుట తిలకం దిద్ది, హారతి ఇచ్చి, తన చేతులతో తయారుచేసిన రుచికరమైన వంటకాలను వడ్డిస్తుంది.సోదరి చూపిన ప్రేమకు ముగ్ధుడైన యముడు వరం కోరుకోమంటాడు. ప్రతి ఏటా ఈ రోజున తన ఇంటికి వచ్చి భోజనం చేయాలని, ఈ రోజున సోదరి చేతి భోజనం స్వీకరించే సోదరులకు అపమృత్యు భయం లేకుండా అనుగ్రహించాలని యమున కోరినట్లు పురాణ గాథ చెబుతుంది. ఆమె కోరికను మన్నించిన యముడు సోదరులకు శుభం కలగాలని వరమిస్తాడు. ఈ కథలోని అంతరార్థం ఒక్కటే.. అన్నాచెల్లెళ్ల బంధం అనేది రక్తసంబంధం మాత్రమే కాదు, కష్టసుఖాల్లో ఒకరికొకరు తోడుగా నిలిచే అనురాగ బంధం.

చెల్లెలి చేతి వంటలో ప్రేమ రుచి!

ఈ పర్వదినాన అక్కాచెల్లెళ్లు తమ అన్నదమ్ములను ఇంటికి ఆహ్వానించి, నుదుట తిలకం దిద్ది, హారతి ఇచ్చి,



ప్రేమతో భోజనం వడ్డిస్తారు. సోదరులు కూడా తమ సోదరీమణులకు చీరలు, పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, కానుకలు అందించి తమ అభిమానాన్ని చాటుకుంటారు.

ఇక్కడ కానుకల విలువ ముఖ్యం కాదు.. వాటి వెనుక ఉన్న ఆప్యాయత ముఖ్యం. ఎందుకంటే కాసుల కంటే కలిమి కాదు.. కలకాలం నిలిచేది అనుబంధాల సంపదే!

సోదరి వండిన భోజనంలో ఆరు రుచులకంటే ఎక్కువగా ఆప్యాయత ఉంటుంది. ఆమె పెట్టే ప్రతి ముద్దలో చిన్ననాటి జ్ఞాపకాలు, తల్లిదండ్రుల పెంపకం, తోబుట్టువుల మధ్య గడిచిన మధుర క్షణాలు గుర్తుకొస్తాయి.

ప్రాంతాలు వేరైనా.. సంప్రదాయం ఒక్కటే!

భారతదేశంలోని వివిధ ప్రాంతాల్లో ఈ పండుగకు విభిన్న పేర్లు, ఆచారాలు ఉన్నాయి.

మహారాష్ట్రలో భాయ్ దూజ్ పేరుతో జరుపుకుంటారు.

నేపాల్‌లో "భాయి టికా"గా నిర్వహిస్తారు.

పంజాబ్ ప్రాంతంలో టిక్కా అని పిలుస్తారు.

ఉత్తర భారతదేశంలోని పలు ప్రాంతాల్లో సోదరులకు తిలకం దిద్ది హారతి ఇచ్చే సంప్రదాయం ఉంది. మరో పురాణ గాథ ప్రకారం, నరకాసుర సంహారం అనంతరం శ్రీకృష్ణుడు తన సోదరి సుభద్రను కలవడానికి వెళ్లగా, ఆమె హారతి ఇచ్చి తిలకం దిద్ది సాదరంగా స్వాగతించిందని చెబుతారు. ఈ కథ కూడా అన్నాచెల్లెళ్ల అనురాగానికి ప్రతీకగా ప్రాచుర్యంలో ఉంది.

పండుగ చెప్పే జీవిత పాఠాలు సామెతల సారాలు

మన పెద్దలు ఊరికే అనలేదు..

కలిసి ఉంటే కలదు సుఖం కుటుంబ సభ్యుల మధ్య ఐక్యత ఉంటేనే ఇంటికి నిజమైన ఆనందం.

రక్తసంబంధం కన్నా ఆప్యాయత బంధం గొప్పది ప్రేమతో పలకరించే మనసే నిజమైన సంపద.

చేతికి చేయి తోడైతే కొండంత బలం కష్టకాలంలో తోబుట్టువులు అండగా నిలవాలి.

ఆపదలో ఆదుకున్నవాడే ఆత్మీయుడు సుఖంలోనే కాదు, కష్టంలోనూ ఒకరికొకరు తోడుండాలి.

ఇల్లు కట్టి చూడు.. పెళ్లి చేసి చూడు అన్నట్లు కుటుంబ బంధాలను నిలబెట్టుకోవడం కూడా ఒక బాధ్యత. ప్రేమకు ప్రతిఫలం ప్రేమే కానుకలతో కాదు, మనస్ఫూర్తిగా పలకరించడంతో బంధాలు బలపడతాయి.

నేటి తరానికి అవసరమైన అనుబంధాల పండుగ!

ప్రస్తుత యాంత్రిక జీవన విధానంలో ఉద్యోగాలు, వ్యాపారాలు, చదువులు, ఆర్థిక పోటీలు అంటూ కుటుంబ సభ్యులు ఎవరికి వారు బిజీగా మారుతున్నారు. ఒకే ఇంట్లో ఉన్నా మాట్లాడుకోవడానికి సమయం దొరకడం లేదు. దూర ప్రాంతాల్లో ఉంటున్న తోబుట్టువులైతే పండుగలు, శుభకార్యాల సమయంలోనే కలుసుకునే పరిస్థితి ఏర్పడుతోంది.

అటువంటి పరిస్థితుల్లో భగిని హస్త భోజనం వంటి పండుగలు కుటుంబ బంధాలకు కొత్త ఊపిరి పోస్తాయి. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ, మనసులోని మాటలను పంచుకుంటూ, ఒకరినొకరు పలకరించుకుంటూ ప్రేమానురాగాలను పెంపొందించుకోవడానికి చక్కని అవకాశాన్ని కల్పిస్తాయి.అన్న అంటే చెల్లెలికి ధైర్యం.. చెల్లెలు అంటే అన్నకు ఆప్యాయత. అక్క అంటే తల్లిలాంటి అనురాగం.. తమ్ముడు అంటే ఇంటికి మరో చిరునవ్వు. ఈ బంధాలకు ఆస్తిపాస్తులతో సంబంధం లేదు. మనసుల మధ్య ఉండే మమకారమే వాటికి పునాది.

ముగింపు..పండుగలు వస్తుంటాయి.. పోతుంటాయి. కాలాలు మారుతుంటాయి.. తరాలు మారుతుంటాయి. కానీ మనిషి జీవితంలో బాల్యపు జ్ఞాపకాలు, తోబుట్టువుల ప్రేమ ఎప్పటికీ చెరిగిపోవు.ఆస్తుల కోసం ఆప్యాయతను వదులుకోవద్దు. చిన్న చిన్న మనస్పర్థలతో పెద్ద పెద్ద బంధాలను తెంచుకోవద్దు. ఎందుకంటే గోడలు కట్టడం సులభం.. గుండెల మధ్య దూరాన్ని తగ్గించడం కష్టం!అందుకే ఈ భగిని హస్త భోజనం రోజున ఒక్క పూట కలిసి భోజనం చేయడమే కాకుండా, జీవితాంతం ఒకరికొకరు అండగా నిలుస్తామని ప్రతిజ్ఞ చేద్దాం.అన్నాచెల్లెళ్ల అనుబంధం చిరకాలం వర్ధిల్లాలి.. అక్కాతమ్ముళ్ల ఆప్యాయత తరతరాలకు ఆదర్శం కావాలి.. కుటుంబ వ్యవస్థలో ప్రేమానురాగాల దీపం నిరంతరం వెలగాలి! రక్తసంబంధం జన్మనిస్తుంది.. ప్రేమానుబంధం జీవితానికి అర్థాన్నిస్తుంది!

ఎంపీపీ, జెడ్పీపీ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలకు షెడ్యూల్ విడుదల..!

జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి



కడప బ్యూరో చీఫ్, నవంబర్ 10 నంది పత్రిక రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో మండల పరిషత్, జిల్లా పరిషత్‌లలో కోఆప్షన్ సభ్యుల ఎన్నికతో పాటు ఎంపీపీ, జెడ్పీపీ అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు ఎన్నికల నిర్వహణకు అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు.రాష్ట్ర ఎన్నికల సంఘం నవంబర్ 10న జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం, మండల పరిషత్‌లలో నవంబర్ 19న కోఆప్షన్ సభ్యుల ఎన్నిక నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు ఎంపీపీ, ఉపాధ్యక్ష పదవులకు ఎన్నిక నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.అదేవిధంగా జిల్లా పరిషత్‌లో నవంబర్ 20న కోఆప్షన్ సభ్యుల ఎన్నిక, అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు జెడ్పీపీ వైస్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ పదవులకు ఎన్నిక నిర్వహించనున్నట్లు వెల్లడించారు.కోఆప్షన్ సభ్యుల ఎన్నికకు సంబంధించి నవంబర్ 19న ఉదయం 10 గంటలలోపు నామినేషన్ల స్వీకరణ, ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలలోపు నామినేషన్ల పరిశీలన, మధ్యాహ్నం 12 గంటలకు అర్హులైన అభ్యర్థుల జాబితా ప్రకటించడం, మధ్యాహ్నం 1 గంటలోపు నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు తెలిపారు.జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుల ఎన్నికకు కూడా నవంబర్ 20న ఇదే విధమైన ప్రక్రియను ఉదయం 10 గంటల నుంచి ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి నవంబర్ 14వ తేదీలోగా సంబంధిత సభ్యులకు ప్రత్యేక సమావేశాల నోటీసులు జారీ చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం సూచించినట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో నిబంధనలు, నిర్దేశిత సమయపాలన తప్పనిసరిగా పాటించేలా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

గుడిసె ఆది క్రిష్ణమ్మ మర్యాదపూర్వకంగా కలిసిన గెలిచిన ఎంపిటిసిలు

విజయం సాధించిన ధనలక్ష్మి, నర్సమ్మలకు అభినందనలు తెలిపిన క్రిష్ణమ్మ

ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలి

కర్నూలు జిల్లా అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ



కర్నూలు సిటీ నందిపత్రిక ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బినిగిరి ఎంపీటీసీగా ధనలక్ష్మి, మేకోడన ఎంపీటీసీగా నర్సమ్మ విజయం సాధించిన సందర్భంగా, ఇరువురు విజేతలు కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ ని మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ విజయం సాధించిన ధనలక్ష్మి, నర్సమ్మలకు శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు. ప్రజలు తెలుగుదేశం పార్టీపై, కూటమి అభ్యర్థులపై ఉంచిన విశ్వాసానికి ఈ విజయం నిదర్శనమని పేర్కొన్నారు. ఎన్నికల్లో ప్రజలు అందించిన విజయాన్ని బాధ్యతగా భావించి, గ్రామాల్లో ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా గ్రామాల్లో తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు.కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, ప్రభుత్వ సహకారంతో గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షించారు.ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేయాలని జిల్లా అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పొంగిన అభిమానం మేరువకు ఘన సన్మానం.



శిరివెళ్ల :–(నంది పత్రిక) ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకొని జనహృదయనేతగా ఎదిగి ఎంపీటీసీగా తిరుగులేని విజయాన్ని సొంతం చేసుకున్న మేరువ చిన్న నరసింహారెడ్డి గారికి అయన సతీమణి ప్రస్తుత ఎంపీటీసీ శ్రీమతి మేరువ శాంతి గారికి ఘన సన్మానాలు కొనసాగుతున్నాయి., కాబోయే మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు (ఎంపీపీ) గా నంద్యాల జిల్లా వ్యాప్తంగా చర్చలు ఒకవైపు జోరుగా కొనసాగుతుండగా మరోవైపు ప్రజాభిమానం వెల్లువెత్తుతూ ఉన్నది. నంద్యాల జిల్లా వ్యాప్తంగా మేరువ చిన్న నరసింహారెడ్డి గారి అభిమానులు బంధుమిత్రులు శ్రేయోభిలాషులు తెలుగుదేశం పార్టీ వర్గాలు పెద్ద ఎత్తున తమ అభిమాన నాయకుడికి గజమాలలు వేస్తూ పూల బోకెలు అందిస్తూ భారీ కేక్ లు కట్ చేస్తూ అభిమానాన్ని చాటుకుంటున్నారు.ప్రజల కోసం అహర్నిశలు పరితపించే నాయకులకు స్వచ్ఛందంగా పదవులు దక్కుతాయని ఆయన అభిమానులు పేర్కొంటున్నారు.మేరువ శాంతి చిన్న నరసింహారెడ్డి గారి గెలుపు మాత్రమే కాదని పేద బడుగు బలహీన వర్గాల ప్రజల ఆత్మగౌరవానికి దక్కిన విజయం అంటూ ఆయన అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు.ప్రత్యర్థులు ఎవరైనా పార్టీలు ఎన్నైనా కావచ్చు ప్రజల ఆశీర్వాదమే మేరువ చిన్న నరసింహారెడ్డి గారి అసలైన బలం అనే విధంగా ప్రజా అభిమానం ఉప్పొంగుతున్నది. నరసింహా రెడ్డి గారి గెలుపు కోసం ప్రజలు పడిన నీరిక్షణ తపన కసి అభిమానం చరిత్రగా నిలిచిపోయేలా ప్రజల ఆదరాభిమానమే శాశ్వతం అన్న విధంగా శిరివెళ్ల మండల నలుమూలల నుండి ప్రముఖులు ప్రజలు ఆయన స్వగ్రామానికి చేరుకొని సన్మానాలు చేయడం గమనార్హం.



పట్టణంలో వ్యక్తిపై కత్తిపోట్ల దాడి కేసులో ముద్దాయిలు అరెస్టు



ఆళ్లగడ్డ ప్రతినిధి నవంబర్ 10, నంది పత్రిక ఆళ్లగడ్డ పట్టణంలో ఈనెల 4వ తేదీన ఏఎన్ఆర్ చికెన్ సెంటర్ యజమాని సాధిక్ పై కత్తులతో దాడిచేసి హత్యాయత్నంకు పాల్పడిన కేసులో ముగ్గురు ముద్దాయిలను అరెస్ట్ చేసినట్లు ఆళ్లగడ్డ డిఎస్పి రవికుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్ లో ముద్దాయిలను కనపరిచిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఆళ్లగడ్డ పట్టణ పరిధిలోని కాసింతల వద్ద ముద్దాయిలు దుర్గాప్రసాద్, అనిల్ కుమార్ రెడ్డి, ఒక మైనర్ బాలుడు లను అరెస్టు చేసి వారివద్ద నుండి కత్తులను, మోటార్ సైకిల్ ను సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నా మన్నారు. వ్యక్తిపై కత్తిపోట్ల దాడికి పాల్పడిన నిందితులను గుర్తించి వారం రోజుల లోపే అరెస్టు చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని డీఎస్పీ రవికుమార్ అభినందించారు. ఆళ్లగడ్డ పట్టణంలో ఇలాంటి దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో టౌన్ సిఐ రాము, ఎస్ఐలు చిన్న పీరయ్య శ్రీనివాస గౌడ్, రామకృష్ణారెడ్డి, పోలీస్ సిబ్బంది మహమ్మద్ రఫీ, ఉదయ్ హోంగార్డ్స్, పాల్గొన్నారు.



దేశంలో బిసి ల అభివృద్ధి చంద్రబాబు మోడీ గారితోనే సాధ్యం

కర్నూల్ సిటీ నంది పత్రిక రాష్ట్ర జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బీసీలకు సమస్త జీవన రంగాల్లో సామాజిక న్యాయం జరగాలంటే చట్టాలు చేసే చట్టసభల్లో అంటే ఎమ్మెల్యేలుగా ఎంపీలుగా రాజ్యసభ సభ్యులుగా ఎమ్మెల్సీలుగా బీసీలకు జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు కల్పించినప్పుడే సామాజిక న్యాయం జరుగుతుందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు డీసీ ఎంఎస్ కర్నూల్ ఉమ్మడి జిల్లా చైర్మన్ వై నాగేశ్వరావు యాదవ్ పేర్కొన్నారు మంగళవారం సాయంత్రం జాతీయ బిసి సంక్షేమ సంఘం ముఖ్య నేతల సమావేశం హైదరాబాదులోని ఎల్బీనగర్ లో గల జాతీయ బిసి సంక్షేమ సంఘము కార్యాలయంలో నిర్వహించడం జరిగింది.. అనంతరం వారు మాట్లాడుతూ దాదాపు 8 దశాబ్దాలు దాటుతున్న ఈ దేశంలో మెజార్టీ జనాభా కలిగిన బీసీలు రాజ్యాంగం ఫలాలు అందుకోలేక సమస్త జీవన రంగాల్లో వాళ్లకు జనాభా నిష్పత్తి ప్రకారం రావాల్సిన హక్కులు కోల్పోతూ రాజ్యాంగ ఫలాలు అందుకోలేకపోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కావున బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించినప్పుడే సామాజిక న్యాయానికి పెద్ద పీట వేసిన వారు అవుతారని చట్టసభల్లో బీసీలకు జనాభా నిష్పత్తి ప్రకారం అవకాశాలు కల్పించేంతవరకు బీసీలు పోరాటాలకు సిద్ధం కావాలని వారు కోరారు.. బీసీలకు సామాజిక న్యాయం జరగాలంటే అది చంద్రబాబు మోడీ తో సాధ్యమవుతుందని వారు పేర్కొన్నారు.జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి. ఆంధ్రప్రదేశ్ నగర/ పర అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ లాయర్ ఎల్.వి.ప్రసాద్ . బీసీ సంఘం జ్యోతిష్య శాస్త్రవేత్త పుల్లయ్య స్వామి. రవి యాదవ్. కృష్ణ యాదవ్. బీసీ సంఘం నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



శ్రీశ్రీశ్రీ దుర్గా పరమేశ్వర నూతన ఆలయ ప్రతిష్ట

ఎమ్మెల్యే గౌరు దంపతులకు ఆహ్వాన పత్రిక అందజేసిన నిర్వాహకులు

కర్నూలు సిటీ నంది పత్రిక కల్లూరు అర్బన్ 48 వ వార్డ్ ఎన్టీఆర్ బిల్డింగ్ లో ఈ నెల 13 న శ్రీశ్రీశ్రీ దుర్గ పరమేశ్వర ఆలయం నూతన ప్రతిష్ట ప్రారంభోత్సవ ఆహ్వానశే పత్రిక ను పాణ్యశే నియోజకవర్గం ఎమ్మెల్యే, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరిత రెడ్డికి, టీడీపీ సీనియర్ నాయకులు గౌరు వెంకట రెడ్డికి, యువ నాయకులు గౌరు జనార్దన్ రెడ్డికి ఏపీ విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కే పార్వతమ్మ, 48 వ వార్డ్ కార్పొరేటర్ రాఘవేంద్ర, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కాసాని మహేష్ గౌడ్ ఆహ్వాన పత్రికను అందజేశారు

లారీ దొంగతనం కేసులో ముద్దాయిల అరెస్టు



కర్నూల్ సిటీ నంది పత్రిక కర్నూల్ వన్ టౌన్ ఏరియా లోని దండిగేరిలో నివాసం ఉంటున్న ప్రేమనాథ్ అను వ్యక్తి తనకు చెందిన లారీ నెంబర్ ఏపీ 04 యు 5526 ను కర్నూలు పట్టణం రిలయన్స్ మార్ట్ వద్ద గల లారీ అసోసియేషన్ యార్డ్ నందు పార్కు చేసి ఉండగా, గుర్తుతెలియని వ్యక్తులు తన లారీని మొన్నటి దినం దొంగతనం చేశారు అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు పరుచుకొని అందుబాటులోని సిసి ఫుటేజ్ లను పరిశీలించి ఆ ఫుటేజ్ లలో ఉన్నటువంటి ఇద్దరు అనుమానితుల గురించి విచారించగా వారిద్దరూ కర్నూలు పట్టణం ముజాఫర్ నగర్ కు చెందిన సతీష్ మరియు గోపాల్ గా గుర్తించడం జరిగింది . ఈ రోజున వారి కదలికల గురించి వచ్చిన ఖచ్చితమైన సమాచారం మేరకు పందిపాడు దగ్గరలోని గోడ అంజనేయస్వామి గుడి వద్ద సదరు సతీష్, గోపాల్ లను మంగళవారం మధ్యాహ్నం అరెస్ట్ చేసి సదరు ఏరియాలో వాళ్లు పార్కు చేసి ఉంచిన సుమారు 10 లక్షల విలువ చేసే లారీని స్వాధీనం చేసుకోవడం అయినది. విచారణలో సదరు సతీష్ అనే వ్యక్తి గతంలో లారీ డ్రైవర్ గా పని చేస్తూ అనతి కాలంలోనే రెండు లారీలకు ఓనర్ గా మారి, సరైనటువంటి బిజినెస్ జరక్క ఆ లారీలను ఫైనాన్స్ వాళ్లు సీజ్ చెయ్యగా, అతను యాక్టింగ్ లారీ డ్రైవర్ గా పని చేస్తూ తనకున్న అప్పులు తీర్చుకోడానికి వేరే దారి లేక సదరు లారీ ని దొంగతనం చేసి అమ్ముకోడానికి దాచి ఉంచామని విచారణలో తేలింది. సతీష్ కి లారీని దొంగతనం చేయడానికి సహకరించిన గోపాల్ మీద కర్నూలు 4వ టౌన్ పోలీస్ స్టేషన్, , ఆత్మకూరు తదితర పోలీస్ స్టేషన్లో సుమారు 8 కి పైగా దొంగతనం కేసులు నమోదై ఉన్నవి. ఇద్దరి మీద సస్పెక్ట్ షీట్స్ ఓపెన్ చేసి నిఘా ఉంచడం జరుగుతుంది.

పేకాట రాయుడులు అరెస్ట్

వన్ టౌన్ సిఐ తిమ్మారెడ్డి



కడప నవంబర్ 10 (నంది పత్రిక రిపోర్టర్)కడప వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాత బస్టాండ్ సమీపంలో పేకాట ఆడుతున్న 10 మందిని కడప వన్ టౌన్ సి.ఐ తిమ్మారెడ్డి, ఎస్.ఐ రాజరాజేశ్వర రెడ్డి మరియు సిబ్బందితో కలిసి దాడి చేసి అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.1,24,270 నగదు, 10 సెల్‌ఫోన్లు, 52 పేకముక్కలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలి

ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డి. యం.ఓబులేసు యాదవ్



కడప నవంబర్ 10 (నంది పత్రిక రిపోర్టర్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులను విడుదల చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదని ఆర్ఎ స్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డి. యం.ఓబులేసు యాదవ్ అన్నారు.మంగళవారం వారి కార్యాలయం లో విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదు సంవ త్సరాలనుండి ప్రభుత్వం నుండి వివిధ రూపాల్లో ఫీజు బకాయిలు పెండింగ్ లో ఉన్నాయ న్నారు. 7 వేల కోట్ల రూపాయలకు పైగా ఇంజనీరింగ్, డిగ్రీ, గతంలో ఆపిన ఎంబిఏ, ఏంసిఏ తదితర పీజీ కోర్సులా ఫీజు బకాయిలు అలానే పెండింగ్లో ఉన్నాయన్నారు. దీని వలన చదువులు పూర్తి చేసుకున్న విద్యార్థులు సొంతంగా ఫీజులు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కొన్ని కళాశాలలు ఫీజులు కట్టలేదని సర్టిఫికెట్స్ ఇవ్వమని చెబుతు న్నాయని అన్నారు. కడప జిల్లాలో చాలా కళాశాలల్లో ఫీజు బకాయిల పేరుతో సర్టిఫికెట్స్ కూడా విద్యార్థులకు ఇవ్వడం లేదన్నారు. జిల్లా కలెక్టర్ గారు దీని పైన స్పందించాలన్నారు. అదేవిధంగా విద్యార్థులకు రావాల్సిన ఫీజు బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎఫ్ నగర అధ్యక్షులు ఉమెర్, కార్యదర్శి నిపుల్ ఉపాధ్యక్షులు సోహెల్, గౌస్ పీర్ నాయకులు నవీన్ మన్విత్ తదితరులు పాల్గొన్నారు

ఆళ్లగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ విశేష కృషి.

కళాశాల అభివృద్ధికి సహకారం అందించిన ఎమ్మెల్యే భూమాఅఖిల ప్రియకుఘన సన్మానం



ఆళ్లగడ్డ ప్రతినిధి నవంబర్ నంది పత్రిక ఆళ్లగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి, అవసరమైన భూమి మరియు భవన నిర్మాణానికి ప్రభుత్వ స్థాయిలో అనుమతులు మంజూరు చేయించడంలో విశేష కృషి చేసిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. శ్రీనివాసరెడ్డి, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది ఎమ్మెల్యే భూమా అఖిలప్రియను శాలువా, పుష్పగుచ్ఛం మరియు జ్ఞాపికతో సత్కరించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారుఆళ్లగడ్డ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్య అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి ఎమ్మెల్యే అందించిన సహకారం పట్ల కళాశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. భవిష్యత్తులో కళాశాల మరింత అభివృద్ధి చెందేందుకు ఆమె సహకారం కొనసాగించాలని ఆకాంక్షించారు.అదేవిధంగా, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ (డి ఎం హెచ్ ఓ) ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి స్వీప్ పోటీలలో ఆళ్లగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి ద్వితీయ బహుమతి సాధించడం విశేషం. కళాశాల అభివృద్ధికి సహకారం అందించడంతో పాటు విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహిస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



కాకినాడ జీజీహెచ్‌ను 3 వేల పడకల మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిగా అభివృద్ధి చేసే దిశగా ముందడుగు

కాకినాడ జీజీహెచ్ రూపురేఖలు మార్చే దిశగా ఎంపీ సానా సతీష్ బాబు ప్రయత్నం

ఆసుపత్రి ఆధునీకరణకు ముందుకొచ్చిన కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ హెచ్ ఐ టి ఈ ఎస్

విజయవాడలో వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి వీరపాండియన్, రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబుతో హెచ్ఐటిఎస్ ప్రతినిధుల సమావేశం



విజయవాడ బ్యూరో చీఫ్, నవంబర్ 10 నంది పత్రిక కాకినాడ ప్రజలకు మెరుగైన, అత్యాధునిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు ప్రత్యేక చొరవతో కాకినాడ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జి జి హెచ్)ను 3000 పడకల మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిగా అభివృద్ధి చేసే దిశగా కీలక ముందడుగు పడింది. ప్రస్తుత ప్రభుత్వ ఆసుపత్రిని ఆధునీకరించి, అవసరమైన మౌలిక వసతులు, వైద్య పరికరాలు, ప్రత్యేక వైద్య విభాగాలతో 300 పడకల మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిగా తీర్చిదిద్ది ప్రభుత్వానికి అందించే ప్రతిపాదనపై కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఆల్ ఇన్ఫ్రా టెక్ సర్వీస్ హెచ్ ఐ టి ఈ ఎస్) ఆసక్తి వ్యక్తం చేసింది. ఈ ప్రతిపాదనకు సంబంధించి మంగళవారం విజయవాడలో రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి వీరపాండియన్‌తో హెచ్ఐ టి ఈ ఎస్ సంస్థ ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సమావేహెచ్ఐటిఈఎస్ హెచ్ఐటిఎస్ వైస్ ప్రెసిడెంట్ రత్నాచలం, అరుంధతి తదితరులు పాల్గొన్నారు. కాకినాడ జీజీహెచ్‌ను 3 వేల పడకల మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రాథమిక అంశాలు, ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలు, చేపట్టాల్సిన పనులపై చర్చించారు.

కాకినాడ వైద్య రంగానికి ఆధునిక రూపం కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి ఉమ్మడి తూర్పుగోదావరి ప్రాంతంతో పాటు పరిసర జిల్లాలు, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు కీలకమైన ప్రభుత్వ వైద్య సేవల కేంద్రంగా ఉంది. అయితే పెరుగుతున్న జనాభా, మారుతున్న ఆరోగ్య అవసరాలకు అనుగుణంగా మరింత మెరుగైన వైద్య సదుపాయాలు, ఆధునిక పరికరాలు, ప్రత్యేక వైద్య విభాగాలు అందుబాటులోకి రావాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఆసుపత్రిని 300 పడకల మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిగా అభివృద్ధి చేయడం ద్వారా ప్రజలకు ఒకే చోట వివిధ రకాల ప్రత్యేక వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలన్నది ప్రతిపాదిత ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. ఆధునిక వైద్య పరికరాలు, మెరుగైన చికిత్సా సదుపాయాలు, అవసరమైన ఆసుపత్రి మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన అంశాలను ప్రాథమికంగా చర్చించారు.అనేది కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ పరిధిలోని ప్రభుత్వ రంగ సంస్థ ఎూూ ాఅటవఘుతీవ ాఅఎఅవనకు 100 శాతం అనుబంధ సంస్థ. ఆసుపత్రుల మౌలిక వసతుల అభివృద్ధి, డిజైన్, ఇంజినీరింగ్, నిర్మాణ నిర్వహణ, వైద్య పరికరాల కొనుగోలు, బయోమెడికల్ ఇంజినీరింగ్, ఆసుపత్రుల నిర్వహణ వంటి రంగాల్లో (హెచ్ఐటిఈఎస్) సేవలు అందిస్తోంది. ఈ సంస్థకు ఉన్న ఆసుపత్రి మౌలిక వసతుల అభివృద్ధి, ఆధునిక వైద్య సదుపాయాల ఏర్పాటు అనుభవాన్ని కాకినాడ జీజీహెచ్ ఆధునీకరణకు వినియోగించుకునే అవకాశాలపై సమావేశంలో చర్చించారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం: రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు కాకినాడతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు అత్యవసర, ప్రత్యేక వైద్య చికిత్సల కోసం ఇతర నగరాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గించి, నాణ్యమైన వైద్య సేవలను స్థానికంగానే అందుబాటులోకి తీసుకురావాలన్నది తన ప్రయత్నమని రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయడం ద్వారా సామాన్య, పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్యం అందించవచ్చని తెలిపారు.



అహోబిలం ఇస్కాన్ ఆధ్వర్యంలో ఘనంగా గోవర్ధన పూజ...







ఆళ్లగడ్డ ప్రతినిధి నవంబర్ 10 నంది పత్రిక ఆళ్లగడ్డ మండలం అహోబిలం ఇస్కాన్ మందిరంలో మంగళవారం కార్తీక మాసం పాడ్యమి సందర్భంగా గోవర్ధన పూజ, గోపూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇస్కాన్ మందిరం నిర్వాహకులు చంద్రకేశవ దాస్ ప్రభు మీడియాతో మాట్లాడుతూ శ్రీకృష్ణుని యొక్క లీలలలో గోవర్ధన పర్వతాన్ని చిటికెన వ్రేలితో ఎత్తిన లీల ఎంతో విశేష ఘట్టమన్నారు. ద్వాపర యుగంలో ఇదే రోజున ఆయన గోవర్ధనగిరిని ఎత్తడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా గోవర్ధన పర్వత పూజ, గోపూజ కార్యక్రమాలలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నట్లు తెలిపారు. శ్రీకృష్ణ భగవానునికి విశేష పూజలు నిర్వహించడం జరిగిందని ప్రభు వివరించారు.

రాజకీయ ఒత్తిళ్లకు తలవంచుతున్నారా..? సిరివెళ్ల తహసీల్దార్ కార్యాలయంలో రైతులకు అన్యాయం జరుగుతోందా?

పట్టాదారు పత్రాలు ఉన్నా న్యాయం దక్కని నిరుపేద రైతులు..

ఆక్రమణదారులకు అధికారుల అండ ఉందన్న ఆరోపణలు!



శిరివేళ్ళ:(నంది పత్రిక) శిరివేళ్ళతహసీల్దార్ కార్యాలయంలో భూముల రీ సర్వే వ్యవహారం వివాదాస్పదంగా మారుతోందని రైతుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో కొందరు నిరుపేద కుటుంబాలకు చెందిన భూములను దౌర్జన్యంగా ఆక్రమించుకొని సాగు చేస్తున్నారని, ప్రస్తుతం రీ సర్వే సమయంలో సదరు భూములకు సంబంధించి సరైన పత్రాలు లేని వారికి కొందరు అధికారులు మద్దతుగా మాట్లాడుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.మరోవైపు, భూములకు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్లు, పట్టాదారు పత్రాలు ఉన్నప్పటికీ నిరుపేద రైతులు తమ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లలేక న్యాయం కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని సమాచారం. అన్ని ఆధారాలు ఉన్నప్పటికీ తమకు న్యాయం జరగకపోవడంతో బాధిత రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ వ్యవహారంలో రాజకీయ ఒత్తిళ్లకు అధికారులు తలవంచుతున్నారా? అనే అనుమానాలు కూడా రైతుల్లో వ్యక్తమవుతున్నాయి.

తహసీల్దార్ విజయశ్రీ మేడం స్పందించాలి! తహసీల్దార్ విజయశ్రీ మేడం ఈ వ్యవహారంలో రాజకీయాలకు అతీతంగా జోక్యం చేసుకోవాలని రైతులు కోరుతున్నారు. భూముల అసలు రికార్డులు, పాత పట్టాదారు పత్రాలు, రెవెన్యూ రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించి, భూములు ప్రస్తుతం ఎవరి ఆధీనంలో ఉన్నాయి? వాటిని ఏ ఆధారాలతో అనుభవిస్తున్నారు? అనే అంశాలపై సమగ్ర విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అన్ని ఆధారాలను పరిశీలించి అసలైన హక్కుదారులైన పట్టాదారుల పేర్లను రికార్డుల్లో నమోదు చేసి, నిరుపేద రైతులకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు. డాక్యుమెంట్లు ఉన్న రైతులకు న్యాయం జరగకపోతే ఇంకెవరిని ఆశ్రయించాలి? అధికారులే సమాధానం చెప్పాలి!

అభిమాన నేతకు వెల్ల వెత్తుతున్న ఆత్మీయ సన్మానం



శిరివెళ్ల (నంది పత్రిక):- ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా జరిగిన ఎంపిటిసి ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధించేందుకు కృషి చేసిన మెరువ చిన్న నరసింహారెడ్డి గారికి ఆయన సతీమణి ఎంపీటీసీ శాంతి నరసింహారెడ్డి గారికి పలు గ్రామాల నుండి నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివస్తు ఘన సన్మానం చేస్తూ అభిమానాన్ని చాటుకుంటున్నారు. మేరువ చిన్న నరసింహారెడ్డి గారి సతీమణి శాంతి గారు శిరివెళ్ల మండలం యర్రగుంట్ల మేజర్ గ్రామ పంచాయతీలో ఎంపీటీసీ -2 లో పోటీ చేసి రెండు వేలకు పైగా అధికం మెజారిటీతో ఘన విజయం సాధించిన విషయం విధితమే ఈ సందర్భంగా యర్రగుంట్ల వెంకటాపురం కోటపాడు కామినేని పల్లె శిరివెళ్ల గోవిందపల్లె తదితర గ్రామాల నుండి టిడిపి వర్గీయులు కామినేనీ పల్లె గ్రామానికి చేరుకొని మేరువ శాంతి నరసింహారెడ్డి దంపతులను పట్టు శాలువలు కప్పుతూ పూలమాలలు వేసి స్వీట్లు పంచుకొని ఘనంగా సన్మానాలు చేశారు. ఎంపీపీ రేస్ లో ఉన్న మేరువ శాంతి చిన్న నరసింహారెడ్డి గారితో అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు మౌలిక వసతుల కల్పన తదితర అంశాల గురించి ఆయా గ్రామాల ప్రజలు చర్చించడం జరిగింది. నీటి సంఘం చైర్మన్ కమతం లక్ష్మీరెడ్డి మాజీ సర్పంచ్ కమతం పుల్లారెడ్డి టిడిపి యువ నేత ఎదుర్ల నాగ సురేష్, రమణారెడ్డి వెంకటేశ్వర్లు, తదితర ప్రముఖులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

"ఏలూరు ప్రజల ఆకాంక్షలకు వాస్తవ రూపం ఇవ్వాలి నాయుడు

- గ్రామాల్లో అయినా నగరాల్లో అయినా ప్రజల కోసం పనిచేసే ఏకైక ప్రభుత్వం మన కూటమి ప్రభుత్వం అని మరోసారి చాటి చెప్పాలి":

- దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ వెల్లడి

- ఏలూరు నగర మేయర్‌గా ఎన్నికైన రెడ్డి అప్పలనాయుడిని అభినందించిన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్.

- శాలువా కప్పి, ఆత్మీయంగా అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే చింతమనేని.. కృతజ్ఞతలు తెలిపిన నూతన మేయర్ అప్పల నాయుడు

- నిస్వార్థంగా , ఎలాంటి తారతమ్యాలు లేకుండా ప్రతి ఒక్కరిని ప్రోత్సహిస్తూ, అండగా నిలిచే దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని నైజం రాజకీయాల్లో ఎంతో ఆదర్శం: ఏలూరు మేయర్ రెడ్డి.అప్పలనాయుడు గారు.

ఏలూరు బ్యూరో చీఫ్ నవంబర్ 10 నంది పత్రిక ఏలూరు నగరపాలక సంస్థ మేయర్‌గా ప్రజలచేత భారీ మెజారిటీతో నేరుగా ఎన్నికైన శ్రీ రెడ్డి అప్పలనాయుడు దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ బుధవారం ఉదయం మర్యాదపూర్వకంగా అభినందించారు. ఈ సందర్భంగా రెడ్డి అప్పలనాయుడు కి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ శాలువా కప్పి, పుష్పమాలలు వేసి సత్కరించారు. నగర సమగ్రాభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా నూతన పాలకవర్గం ముందుకు సాగాలని, మేయర్‌గా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఆత్మీయ కలయికపై స్పందించిన మేయర్ రెడ్డి అప్పలనాయుడు ఎమ్మెల్యే చింతమనేనికి ప్రభాకర్ కి ప్రత్యేకంగా ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేశారు. దాదాపు 30ఏళ్లుగా తనకు , ఎమ్మెల్యే చింతమనేనికి ఎంతో సాన్నిహిత్యం ఉందని, తన విజయాన్ని కాంక్షిస్తూ హృదయపూర్వకంగా అభినందనలు తెలిపి అండగా నిలిచిన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లూ తెలిపారు..అనంతరం అక్కడకు చేరుకున్న అభిమానులు, కూటమి నాయకులు, యువకులు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్తో ఉత్సాహంగా సెల్ఫీలు, ఫోటోలు దిగారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



ఏపీలో సంచలనం, వ్యక్తిగత విమర్శలకు టీడీపీ , వైసీపీ స్వస్తి...!



కడప నవంబర్ 10 (నంది పత్రిక రిపోర్టర్) ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో నాయకుల వ్యక్తిగత జీవితాలపై విమర్శలు మానివేయాలని ఐటీడీపి ప్రకటించగా, వైసీపీ కూడా దానికి సానుకూలంగా స్పందించింది. వ్యక్తిగత దూషణలు పక్కనపెట్టి, ప్రజా సమస్యలపైనే దృష్టి సారిస్తామంటూ మద్దతుదారులు పెట్టిన పోస్టులను వైసీపీ రీపోస్ట్ చేసింది. సంస్కారవంతమైన రాజకీయాలకు తెరలేపుతూ ఇరు పార్టీలు తీసుకున్న ఈ సానుకూల నిర్ణయంపై సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఇది ప్రజాస్వామ్య హుందాతనాన్ని మరింత పెంచుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications #2-189, journalist colony, lakshmi narasimha swamy temple back side, Pulivendula Town, Y.S.R Kadapa District, Andhra Pradesh -PinCode:-516390, GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No:- APTEL/26/A6827 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

రెండు తుపాన్లు ఒకేసారి అనేక బాధ్యతలు
విపత్తు నిర్వహణతో పాటు ఎన్నికల నిర్వహణ

విపత్తుల సవాళ్లను అధిగమించి ప్రజలకు అండగా నిలిచి ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహణ

అర్నబ్, మురసు తుపాన్లు, ఎర్రకాలువ వరదల విపత్కర పరిస్థితుల్లో పశ్చిమగోదావరి జిల్లా యంత్రాంగం సమష్టి కృషి..

సమర్థవంతమైన సేవలకు నిదర్శనం

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

జాయింట్ కలెక్టర్ కె ఆర్ కల్పశ్రీ

క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ మొక్కవని ధైర్యంతో ప్రతి సమస్యసమీక్ష

భీమవరం బ్యూరో చీఫ్ నవంబర్ 10 నంది పత్రికగత నెల అక్టోబర్ 27. తేదీన పశ్చిమగోదావరి జిల్లా చరిత్రలో ఒక క్లిష్టమైన విపత్తు పరిస్థితికి నాంది పలికిన రోజు. గంటకు సుమారు 140 నుంచి 150 కిలోమీటర్ల వేగంతో వీచిన ప్రచండ గాలులు, భారీ వర్షాలతో విరుచుకుపడిన అర్నబ్ తుపాను జిల్లా ప్రజాజీవనాన్ని అతలాకుతలం చేసింది. విద్యుత్ వ్యవస్థ పూర్తిగా దెబ్బతినడం, భారీ వృక్షాలు నేలకూలడం, నివాస గృహాలు దెబ్బతినడం, రహదారులపై రాకపోకలకు అంతరాయం ఏర్పడడం, సమాచార వ్యవస్థ స్తంభించిపోవడం వంటి అనేక సవాళ్లను జిల్లా ఎదుర్కొంది. జిల్లాలోని మొత్తం 20 మండలాలు తుపాను ప్రభావానికి గురయ్యాయి.

విపత్తు వేళ ప్రజలకు భరోసాగా జిల్లా యంత్రాంగం

ఒకవైపు ప్రకృతి ప్రకోపం.. మరోవైపు ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ అనే బాధ్యత. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో జిల్లా యంత్రాంగం ఏమాత్రం వెనుకడుగు వేయకుండా సమన్వయంతో పనిచేసింది. తుపాను తీవ్రతను సైతం లెక్కచేయకుండా అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో నిరంతరం సేవలందించారు. తుపాను కారణంగా నేలకూలిన భారీ వృక్షాలను యుద్ధప్రాతిపదికన తొలగించి రహదారులపై రాకపోకలను పునరుద్ధరించారు. ప్రమాదకర ప్రాంతాల్లో చిక్కుకున్న ప్రజలను గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు.ప్రజలకు ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే తక్షణమే స్పందించేందుకు జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. వివిధ శాఖల అధికారులను సమన్వయం చేస్తూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి సంబంధిత శాఖల నుంచి పరిస్థితులపై నివేదికలు సేకరిస్తూ సహాయక, పునరుద్ధరణ చర్యలను వేగవంతం చేశారు.

చీకటిని తొలగించి.. వారం రోజుల్లో విద్యుత్ వెలుగులు

అర్నబ్ తుపాను ప్రభావంతో జిల్లాలో విద్యుత్ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిని విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఇతర రాష్ట్రాల నుంచి సుమారు 2,000 మంది విద్యుత్ శాఖ సిబ్బందిని జిల్లాకు రప్పించారు. జిల్లా వ్యాప్తంగా 226 బృందాలకు చెందిన 3,254 మంది అధికారులు, విద్యుత్ శాఖ సిబ్బంది నిరంతరం పునరుద్ధరణ పనుల్లో పాల్గొన్నారు. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది రేయింబవళ్లు శ్రమిస్తూ దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు, లైన్లు, సబ్‌స్టేషన్లను పునరుద్ధరించారు. ఫలితంగా సుమారు వారం రోజుల్లోనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించగలిగారు. తుపాను కారణంగా విద్యుత్ రంగానికి ప్రాథమిక అంచనా ప్రకారం రూ.50.49 కోట్ల మేర నష్టం వాటిల్లింది.విద్యుత్ సరఫరా నిలిచిపోయిన సమయంలో ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎటువంటి అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. అవసరమైన ప్రాంతాల్లో జనరేటర్లను ఏర్పాటు చేసి తాగునీటి సరఫరా కొనసాగించారు. ప్రజల నిత్యావసరాలకు ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది.

ప్రాణరక్షణకు ప్రాధాన్యత.. పునరావాసానికి పెద్దపీట

తుపాను కారణంగా జిల్లాలో ఒకరు ప్రాణాలు కోల్పోగా, మరొకరు గాయపడ్డారు. మిగిలిన ప్రజల ప్రాణాలను సురక్షితంగా కాపాడేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ముందస్తు చర్యలు చేపట్టింది. అర్నబ్ తుపాను సమయంలో 4,088 సహాయక శిబిరాలను ఏర్పాటు చేసి బాధితులకు అవసరమైన సహాయాన్ని అందించారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం వంటి మౌలిక సదుపాయాలను కల్పించి బాధితులకు అండగా నిలిచారు.తుపాను ప్రభావాన్ని సైతం లెక్కచేయకుండా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటిస్తూ ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకుని సంబంధిత శాఖల అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు. సహాయక చర్యల్లో ఎక్కడా జాప్యం జరగకుండా శాఖల మధ్య సమన్వయాన్ని పటిష్టం చేశారు.విపత్తు ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలతో పాటు పశువులకు కూడా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. పశుగ్రాసం సరఫరా కోసం ఇప్పటివరకు రూ.72 లక్షలు విడుదల చేయగా, అదనంగా మరో రూ.70 లక్షలు అవసరమని గుర్తించారు. అలాగే ప్రభావిత ప్రాంతాల్లో తాగునీటి సరఫరా మెరుగుపరిచేందుకు రూ.50 లక్షలు విడుదల చేయనున్నారు. గ్రామ పంచాయతీల పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ, సమగ్ర రక్షిత మంచినీటి సరఫరా పథకం కింద అవసరమైన పనుల కోసం రూ.1.95 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. ప్రజలకు తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాలు నిరంతరాయంగా అందించడంతో పాటు పశువులకు పశుగ్రాసం కొరత లేకుండా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది.

అర్నబ్ తుపాను నుంచి తేరుకోకముందే మురసు తుపాను సవాల్

అర్నబ్ తుపాను సృష్టించిన విధ్వంసం నుంచి జిల్లా పూర్తిగా కోలుకోకముందే నవంబర్ 1వ తేదీ నుంచి మురసు తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురిశాయి. ఈ వర్షాలతో పాటు ఎర్రకాలువ వరద ఉద్ధృతి కారణంగా జిల్లాలోని పలు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. మొత్తం 12 ప్రాంతాల్లో వరద ప్రభావం కనిపించింది. ముఖ్యంగా తాడేపల్లిగూడెం ప్రాంతంలోని పలు గ్రామాలు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లోకి వరదనీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వరద ప్రభావానికి గురైన ప్రాంతాల్లో తణుకు మండలంలోని దువ్వ, కోనాల; పెంటపాడు మండలంలోని రామచంద్రపురం, మినవల్లేరు; తాడేపల్లిగూడెం మండలంలోని ఆరుళ్ల జగన్నాధపురం, నందమూరు, మరంపల్లి; ఉండి మండలంలోని యండగండి, పాములపర్రు; అత్తిలి మండలంలోని తిరుపతిపురం గ్రామాలతో పాటు భీమవరం పట్టణం ఉన్నాయి. మురసు తుపాను సమయంలో 3,509 సహాయక శిబిరాలు, ఎర్రకాలువ వరద ప్రభావిత ప్రాంతాల్లో 3,255 సహాయక శిబిరాలను ఏర్పాటు చేసి బాధితులకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టారు. వరద నీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, ఇతర అత్యవసర సేవలపై ప్రత్యేక దృష్టి సారించారు.

వ్యవసాయ రంగానికి భారీ నష్టం.. 2.20 లక్షల ఎకరాల ఆయకట్టు ప్రభావితం

అర్నబ్, మురసు తుపాన్లు, ఎర్రకాలువ వరదల ప్రభావంతో జిల్లాలో వ్యవసాయ రంగం తీవ్రంగా దెబ్బతింది. అర్నబ్ తుపాను కారణంగా 1,99,554 ఎకరాల్లో వ్యవసాయ పంటలు దెబ్బతిన్నాయి. అనంతరం మురసు తుపాను ప్రభావంతో కురిసిన అధిక వర్షాలు, ఎర్రకాలువ వరదల కారణంగా జిల్లాలోని మొత్తం 2,20,000 ఎకరాల ఆయకట్టు ప్రభావితమైంది. పంట పొలాలు నీట మునగడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. వ్యవసాయ, ఉద్యానవన, మత్స్యశాఖల అధికారులతో క్షేత్రస్థాయి పరిశీలనలు చేపట్టి పంట నష్టాల వివరాలను సేకరించే చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో పంట నష్టాల అంచనా, వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మంగళవారం మధ్యాహ్నం ఇరిగేషన్, వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించనున్నారు.

అర్నబ్, మురసు తుపాన్లు.. ఎర్రకాలువ వరదలతో 11,427 గృహాలకు నష్టం

వరుస ప్రకృతి వైపరీత్యాల కారణంగా జిల్లాలో నివాస గృహాలు కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయి. అర్నబ్, మురసు తుపాన్లు, ఎర్రకాలువ వరదల ప్రభావంతో ఇప్పటివరకు జిల్లాలో మొత్తం 11,427 గృహాలు దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. ప్రభావిత ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేపట్టి బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది.

ఒకవైపు విపత్తు నిర్వహణ.. మరోవైపు ఎన్నికల నిర్వహణ

ప్రకృతి వైపరీత్యాల కారణంగా జిల్లా యంత్రాంగం తీవ్ర ఒత్తిడిలో ఉన్నప్పటికీ ప్రజాస్వామ్య ప్రక్రియకు ఎటువంటి ఆటంకం కలగకుండా స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించడం మరో కీలక విజయంగా నిలిచింది. అర్నబ్, మురసు తుపాన్లు, భారీ వర్షాలు, వరద పరిస్థితుల మధ్యనే మున్సిపాలిటీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం పూర్తి చేసింది. ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు, ఎన్నికల సిబ్బంది నియామకం, పోలింగ్ సామగ్రి పంపిణీ, రవాణా, భద్రత, స్ట్రాంగ్ రూమ్‌ల ఏర్పాటు, కౌంటింగ్ కేంద్రాల నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించింది. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను సురక్షితంగా భద్రపరిచేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసింది. పోలీస్ శాఖ సమన్వయంతో రూట్ భద్రత, బందోబస్తు, సీసీ కెమెరాల పర్యవేక్షణ వంటి చర్యలు చేపట్టింది.విపత్తు నిర్వహణతో పాటు ఎన్నికల విధులను కూడా అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా నిర్వర్తించడం జిల్లా యంత్రాంగం కార్యదక్షతకు నిదర్శనంగా నిలిచింది.

సమన్వయమే విజయానికి బలం

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రతి సమస్యను సమీక్షించారు. రెవెన్యూ, పోలీస్, విద్యుత్, పంచాయతీరాజ్, మున్సిపల్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, వ్యవసాయ, ఉద్యానవన, మత్స్యశాఖ, అగ్నిమాపక శాఖ, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలతో పాటు అన్ని సంబంధిత శాఖల అధికారులు, సిబ్బందిని సమన్వయం చేస్తూ సహాయక, పునరుద్ధరణ చర్యలను ముందుకు నడిపించారు.అత్యవసర పరిస్థితుల్లో తక్షణ నిర్ణయాలు తీసుకోవడం, అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించడం, ఇతర ప్రాంతాల నుంచి అదనపు సిబ్బందిని రప్పించడం, ప్రజలకు నిరంతర సేవలు అందించడం వంటి చర్యలు విపత్తు నిర్వహణలో కీలక పాత్ర పోషించాయి. తుపాన్లు, వరదల వల్ల నష్టపోయిన వ్యవసాయ, ఉద్యానవన, మత్స్య, విద్యుత్, రహదారులు తదితర రంగాల నష్టాలను అంచనా వేసేందుకు వచ్చిన కేంద్ర బృందం పర్యటనకు కూడా అవసరమైన సమన్వయం, క్షేత్రస్థాయి వివరాల సేకరణ చేపట్టారు.

ప్రజల భద్రతే లక్ష్యంగా.. సమష్టి కృషితో విజయవంతమైన సేవలు

ఒకవైపు ప్రకృతి వైపరీత్యాలు.. మరోవైపు ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ.. ఇంకోవైపు ప్రజాస్వామ్య ఎన్నికల నిర్వహణ.. ఇలా అనేక సవాళ్లు ఒకేసారి ఎదురైనప్పటికీ పశ్చిమగోదావరి జిల్లా యంత్రాంగం సమష్టి కృషి, సమర్థవంతమైన ప్రణాళిక, నిరంతర పర్యవేక్షణతో పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొంది. ప్రజలకు తాగునీరు అందించడం నుంచి విద్యుత్ పునరుద్ధరణ వరకు, వరద బాధితులను ఆదుకోవడం నుంచి పంట నష్టాల అంచనా వరకు, పశువులకు పశుగ్రాసం అందించడం నుంచి గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ వరకు, రహదారుల పునరుద్ధరణ నుంచి ఎన్నికల నిర్వహణ వరకు ప్రతి అంశంలోనూ అధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేశారు. విపత్తు సమయంలో ప్రజలకు అండగా నిలవడం, సంక్షోభాన్ని సమర్థంగా ఎదుర్కోవడం, ప్రజలకు అవసరమైన సేవలను నిరంతరం అందించడం ద్వారా పశ్చిమగోదావరి జిల్లా యంత్రాంగం తన బాధ్యతను విజయవంతంగా నిర్వర్తించింది. ప్రకృతి విపత్తులు ఎన్ని సవాళ్లు విసిరినా సమన్వయం, సమయస్ఫూర్తి, అంకితభావంతో ప్రజాసేవలో ముందుండగలమని జిల్లా యంత్రాంగం తన కార్యాచరణతో నిరూపించింది.



రబీ సీజన్‌కు అవసరమైన విత్తనాలను సిద్ధం చేయాలి

నవంబర్ 15వ తేదీలోగా నర్సరీల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



భీమవరం బ్యూరో చీఫ్ నవంబర్ 10 నంది పత్రిక రబీ సీజన్‌లో రైతులకు అవసరమైన విత్తనాలను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని వశిష్ట సమావేశ మందిరంలో వ్యవసాయ, ఇరిగేషన్ శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అర్నబ్ తుఫాను ప్రభావంతో జిల్లాలో వరి పంట పూర్తిగా దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. రబీ సీజన్‌లో రైతులకు అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచేందుకు నవంబర్ 15వ తేదీలోగా నర్సరీల ఏర్పాటుకు అవసరమైన చర్యలు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో వరి సాగు చేసే రైతులకు ఎంటీయూ 1120 రకం విత్తనాలను సరఫరా చేయాలని సూచించారు. తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న వరి పంటలకు సంబంధించి క్రాప్ కటింగ్ ప్రయోగాలను వేగవంతంగా పూర్తి చేసి రైతులకు పంటల బీమా సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో మొత్తం 254 గ్రామాల్లో క్రాప్ కటింగ్ ప్రయోగాలు నిర్వహించాల్సి ఉండగా, ఇప్పటివరకు 18 గ్రామాల్లో మాత్రమే పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన గ్రామాల్లో కూడా వెంటనే ప్రయోగాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని స్పష్టం చేశారు.రబీ సీజన్‌లో రైతులకు అవసరమైన సహకారం అందించేందుకు వ్యవసాయ, ఇరిగేషన్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ, జిల్లా రెవెన్యూ అధికారి పి. గ్లోరియా, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సునీత, సీపీఓ శివపార్వతి, వ్యవసాయ, ఇరిగేషన్ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



బాధితుల పక్షాన నిలబడండి.. మూలాలను మరువకండి: నూతన డీఎస్పీలతో సీఎం రేవంత్ రెడ్డి

నిజాయతీ, నిబద్ధత, అంకితభావంతో విధులు నిర్వహించాలని, తాము వచ్చిన సామాజిక, ఆర్థిక మూలాలను ఎన్నడూ విస్మరించవద్దని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కొత్తగా నియమితులైన డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ)లకు పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో నిర్వహించిన ప్రొబేషనరీ డీఎస్పీల (2025 బ్యాచ్) వీడ్కోలు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.“మీ ప్రవర్తన, మీరు తీసుకునే నిర్ణయాలు ప్రభుత్వ పనితీరుపై, ప్రతిష్ఠపై నేరుగా ప్రభావం చూపుతాయి. కష్టాల్లో ఉన్నప్పుడు ప్రజలు తమ కుటుంబ సభ్యుల కంటే ముందుగా పోలీసులనే ఆశ్రయిస్తారు. గత తరం అధికారులు నెలకొల్పిన విశ్వసనీయతను మీరు కాపాడాలి“ అని సీఎం సూచించారు.మొత్తం 112 మంది డీఎస్పీల నియామక ప్రక్రియను తమ ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా పూర్తి చేసిందని రేవంత్ రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో గ్రూప్-1 నియామకాల్లో తలెత్తిన వివాదాలను పరిష్కరించి, టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశామని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకంపై ఆధారపడిన సామాన్య కుటుంబాల బిడ్డలు సైతం డీఎస్పీలుగా ఎంపిక కావడమే ప్రభుత్వ పారదర్శకతకు నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో డ్రగ్స్ వినియోగం, అక్రమ రవాణా పెను సవాలుగా పరిణమించాయని, దీనిని సమర్థవంతంగా అడ్డుకునేందుకు ప్రత్యేకంగా ‘ఈగిల్ ఫోర్స్’ను ఏర్పాటు చేసినట్లు సీఎం తెలిపారు. అధునిక పోలీసింగ్ పద్ధతుల్లో శిక్షణ కోసం అవసరమైతే కొత్త డీఎస్పీలను విదేశాలకు పంపేందుకు కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన హామీ ఇచ్చారు.



ఆర్నాబ్, మురసు తుఫాన్ల ప్రభావిత ప్రాంతాల్లో పశువులకు ఉచితంగా దాణా పంపిణీ



పశుసంపదను కాపాడేందుకు రూ.66 లక్షలతో 300 టన్నుల పశుదాణా, రూ.4 లక్షలతో మందులు సిద్ధం చేయడం జరిగింది

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

నరసాపురం బ్యూరో చీఫ్ నవంబర్ 10 నంది పత్రిక ఆర్నబ్, మురసు తుఫాన్ల ప్రభావంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో పంట పొలాలు నీట మునగడంతో గత 15 రోజులుగా పశువులకు పచ్చిమేత, పశుగ్రాసం అందుబాటులో లేకుండా పోయిందని పాడి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు.మంగళవారం నరసాపురం మండలం తూర్పు తాళ్లు గ్రామంలోని రైతు సేవా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ఉచిత పశుదాణా పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని రైతులకు పశుదాణాను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, మాట్లాడుతూ తుఫాన్ల కారణంగా వరద నీరు పంట పొలాల్లో నిలిచిపోవడంతో పశువులకు మేత కొరత ఏర్పడిందన్నారు. ముఖ్యంగా పాడి పశువులపై ఆధారపడి జీవనం సాగించే రైతులు ఇబ్బందులు పడుతున్నారని వారి పశుసంపదను కాపాడటమే లక్ష్యంగా ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగిందన్నారు.

జిల్లాలో పశువులు కలిగిన రైతులకు ఉచితంగా పంపిణీ చేసేందుకు రూ.66 లక్షల వ్యయంతో 300 టన్నుల పశుదాణాను సిద్ధం చేశామని తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పశువులకు తగిన పోషకాహారం అందించేందుకు ఈ దాణా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రైతులు తమ పశువులు ఉచిత పశు దాణాను తీసుకువెళ్లి సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

వరదల సమయంలో పశువులకు సరైన ఆహారం అందించడంతో పాటు వాటి ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం రూ.4 లక్షల వ్యయంతో అవసరమైన మందులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. పశువులకు అనారోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే సమీపంలోని పశువైద్య సిబ్బందిని సంప్రదించాలని రైతులకు సూచించారు.

యనమదురు డ్రెయిన్‌లో వరద ప్రవాహం ఇంకా ఉద్ధృతంగా కొనసాగుతోందని, పలు గ్రామాల్లో పంట పొలాలు నీట మునగడంతో పశువులకు మేత కొరత ఏర్పడిందన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పశువులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

అలాగే తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వం నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తోందన్నారు. మత్స్యకారులు, చేనేత కార్మికులకు ఒక్కొక్కరికి 50 కిలోల బియ్యం, ఇతర కుటుంబాలకు 25 కిలోల బియ్యంతో పాటు కిలో కందిపప్పు, కిలో ఉల్లిపాయలు, కిలో బంగాళదుంపలు అందజేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.వరదల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు, పాడి రైతులు, ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు జిల్లా యంత్రాంగం నిరంతరం పనిచేస్తుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ దాసిరాజు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఆర్.కోటిలింగరాజు, డిప్యూటీ డైరెక్టర్ పి.సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ డైరెక్టర్ పి.చంద్రశేఖర్ రెడ్డి, తాహసిల్దార్ ఈ.నాగార్జున, డా. సురేంద్ర కుమార్, వి ఆర్ ఓ కె.బాలాజీ, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.





మైలవరంలో కూటమి విజయోత్సవ సంబరాలు..

కార్యకర్తల కష్టానికి ప్రజల పట్టాభిషేకం!





ఐక్యతే మన బలం.. గ్రామగ్రామాన అభివృద్ధి సాధించడమే లక్ష్యం.

కొండపల్లి పురపాలక సంఘంలో 40కి 33..

ఐదు మండలాల్లో 73కి 62 ఎంపీటీసీ స్థానాలు..

ఐదింటికి ఐదు జడ్పీటీసీ స్థానాలు కూటమి కైవసం

గెలుపుతో బాధ్యత మరింత పెరిగింది..

రానున్న పంచాయతీ ఎన్నికల్లోనూ

ఇదే ఐక్యత కొనసాగాలి:

-మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు

విజయవాడ(ఐతవరం), బ్యూరో చీఫ్ నవంబర్ 10 నంది పత్రిక

మైలవరం నియోజకవర్గంలో కూటమి సాధించిన స్థానిక సంస్థల ఎన్నికల విజయాలు ప్రజలు తమపై ఉంచిన నమ్మకానికి, కూటమి పార్టీల ఐక్యతకు, క్షేత్రస్థాయిలో కార్యకర్తలు చేసిన అవిశ్రాంత కృషికి నిదర్శనమని మైలవరం శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు. ఎన్నికల్లో సాధించిన విజయాలతో బాధ్యత మరింత పెరిగిందని, రానున్న పంచాయతీ ఎన్నికల్లోనూ ఇదే సమన్వయం, ఐక్యతతో ముందుకు సాగి ప్రతి గ్రామంలో కూటమి జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు.మంగళవారం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు స్వగ్రామమైన ఐతవరంలో నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తొలుత అన్న ఎన్టీఆర్ ప్రతిమకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన విజయోత్సవ సన్మాన సభలో కూటమి తరపున ఎన్నికల్లో విజయం సాధించిన పురపాలక సంఘ కౌన్సిలర్లు, మండల పరిషత్ ప్రాదేశిక సభ్యులు, జిల్లా పరిషత్ ప్రాదేశిక సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులను ఘనంగా సత్కరించి అభినందించారు.ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గద్దె అనురాధ , విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) /, ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య , జనసేన ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను జనసేన మైలవరం నియోజకవర్గ బాధ్యులు అక్కల రామ్మోహనరావు (గాంధీ) , మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు, నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ.. తన స్వగ్రామంలో జరుగుతున్న ఈ ఆత్మీయ సమావేశం వ్యక్తిగతంగా ఎంతో ప్రత్యేకమైనదని, ఇది కేవలం విజయోత్సవం, సన్మాన కార్యక్రమం మాత్రమే కాదని, మూడు పార్టీల మధ్య ఉన్న ఐక్యతకు, కార్యకర్తల శ్రమకు, ప్రజల విశ్వాసానికి ప్రతిబింబమని అన్నారు.

కూటమికి ప్రజల తిరుగులేని మద్దతు మైలవరం నియోజకవర్గంలో కూటమి సాధించిన విజయాలను వివరిస్తూ కొండపల్లి పురపాలక సంఘంలో కూటమి తరపున పోటీ చేసిన 40 మంది అభ్యర్థుల్లో 33 మంది కౌన్సిలర్లుగా విజయం సాధించారని తెలిపారు. అలాగే నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో మొత్తం 73 మండల పరిషత్ ప్రాదేశిక స్థానాలకు గాను 62 స్థానాలను కైవసం చేసుకున్నామని, ఐదు జిల్లా పరిషత్ ప్రాదేశిక స్థానాలనూ ఐదింటినీ గెలుచుకున్నామని వెల్లడించారు. ఈ ఫలితాలు కూటమిపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని, అభివృద్ధి పట్ల వారు వ్యక్తం చేసిన ఆకాంక్షను స్పష్టంగా తెలియజేస్తున్నాయని పేర్కొన్నారు.ఈ విజయాలు ఏ ఒక్క పార్టీకి, ఏ ఒక్క నాయకుడికో పరిమితం కావని, తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు సమష్టిగా చేసిన కృషికి దక్కిన ఫలితమని చెప్పారు. అంతిమంగా ఇది ప్రజలు అందించిన విజయమని అభివర్ణించారు.

యార్లగడ్డ వెంకట్రావు గారి సమన్వయంతో..

7,400 ఓట్ల మెజారిటీ.

విజయవాడ గ్రామీణ మండలానికి సంబంధించిన జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గం గురించి ప్రస్తావిస్తూ.. ఆ మండలంలోని కొన్ని గ్రామాలు మైలవరం నియోజకవర్గంలో, మరికొన్ని గన్నవరం నియోజకవర్గంలో ఉన్న నేపథ్యంలో గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు గారితో చర్చించి కూటమి ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సమన్వయంతో నిర్ణయం తీసుకున్నామని వివరించారు.అనంతరం పార్టీ కేంద్ర కార్యాలయం కూటమి పొత్తుల్లో భాగంగా ఆ స్థానాన్ని భారతీయ జనతా పార్టీకి కేటాయించిందని, పార్టీ నిర్ణయాన్ని గౌరవిస్తూ మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేశారని తెలిపారు. ఫలితంగా జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ అభ్యర్థి 7,400 ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించారని చెప్పారు. మైలవరం నియోజకవర్గ పరిధిలోని గ్రామాల నుంచి కూడా ఈ విజయానికి విశేషమైన మద్దతు లభించిందని, అక్కడి 14 మండల పరిషత్ ప్రాదేశిక స్థానాల్లో 13 స్థానాలను గెలుచుకోవడంతో పాటు దాదాపు 9,000 ఓట్ల మెజారిటీ సాధించడం కూటమి బలాన్ని చాటిందని పేర్కొన్నారు. సమన్వయంతో ముందుకు సాగితే ఎలాంటి విజయాలనైనా సాధించవచ్చని ఈ ఫలితాలు నిరూపించాయని అన్నారు.

ఇబ్రహీంపట్నంలో 11కి 11.. కార్యకర్తల్లో ఉత్సాహం

ఇబ్రహీంపట్నం మండలంలో ఉన్న మొత్తం 11 మండల పరిషత్ ప్రాదేశిక స్థానాలనూ కూటమి కైవసం చేసుకోవడంపై ఎమ్మెల్యే ప్రత్యేకంగా ప్రస్తావించారు. సరదాగా మాట్లాడుతూ.. ఇకపై ఇబ్రహీంపట్నంలో 11 అనే సంఖ్య వినిపించినప్పుడల్లా ఈ ఎన్నికల ఫలితాలే గుర్తుకు రావాలని చమత్కరించారు. అయితే రాజకీయాల్లో ప్రత్యర్థులను ఓడించడం కంటే ప్రజల మనసులను గెలుచుకోవడమే ముఖ్యమని, మన విజయం ఎవరికీ వ్యతిరేకంగా కాకుండా ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం ఉండాలని హితవు పలికారు.

పంచాయతీ ఎన్నికలే తదుపరి లక్ష్యం. ప్రస్తుత విజయాలతోనే సంతృప్తి చెందకుండా రానున్న పంచాయతీ ఎన్నికలకు ఇప్పటి నుంచే సమాయత్తం కావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. మండల పరిషత్ ప్రాదేశిక సభ్యులు, జిల్లా పరిషత్ ప్రాదేశిక సభ్యులు, పురపాలక సంఘ కౌన్సిలర్లుగా విజయం సాధించడం ఒక బాధ్యతకు ఆరంభం మాత్రమేనని, ప్రతి గ్రామంలోకి వెళ్లి, ప్రతి ఇంటినీ సందర్శించి, ప్రతి కుటుంబాన్ని ఆప్యాయంగా పలకరించాలని సూచించారు.మనకు ఓటు వేసిన వారితో పాటు ఓటు వేయని వారినీ సమానంగా గౌరవించాలని, ఎన్నికల సమయంలోనే కాకుండా ఎన్నికల అనంతరం కూడా ప్రజలకు అందుబాటులో ఉండే నాయకులుగా గుర్తింపు తెచ్చుకోవాలని అన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేయాలని కోరారు.

మూడు పార్టీల ఐక్యతే కూటమి విజయానికి పునాది

తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య స్థానికంగా చిన్నచిన్న అభిప్రాయ భేదాలు, సమస్యలు ఉండవచ్చని, వాటిని పక్కనపెట్టి కూటమి ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే సూచించారు. తెలుగుదేశం కార్యకర్త జనసేన కార్యకర్తను, జనసేన కార్యకర్త భారతీయ జనతా పార్టీ కార్యకర్తను, భారతీయ జనతా పార్టీ కార్యకర్త తెలుగుదేశం కార్యకర్తను గౌరవించుకోవాలని అన్నారు. పంచాయతీ ఎన్నికల్లో ఎక్కడ ఎవరు పోటీ చేయాలనే అంశాన్ని పార్టీ పెద్దలు నిర్ణయిస్తారని, అయితే అభ్యర్థి ఎవరైనా కూటమి అభ్యర్థి విజయమే లక్ష్యంగా మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని స్పష్టం చేశారు. కూటమి ఐక్యతను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే మనందరి బాధ్యతని పేర్కొన్నారు.

ప్రజాప్రతినిధులకు ఎమ్మెల్యే దిశానిర్దేశం. ఎన్నికల్లో గెలుపొందిన మండల పరిషత్ ప్రాదేశిక సభ్యులు, జిల్లా పరిషత్ ప్రాదేశిక సభ్యులు, పురపాలక సంఘ కౌన్సిలర్లు, చైర్మన్‌కు ఎమ్మెల్యే ప్రత్యేకంగా సూచనలు చేశారు. ప్రజలు తమకు అప్పగించిన పదవులను అధికారంగా కాకుండా బాధ్యతగా భావించాలని, గెలిచిన ప్రాంతంలో తమకు ఓటు వేసిన వారే కాకుండా ఓటు వేయని వారు కూడా సమానంగా తమ ప్రజలేనని గుర్తుంచుకోవాలని అన్నారు. ప్రతి ఒక్కరినీ కలుపుకొని, వారి సమస్యలను ఓపికగా విని, గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ప్రజలు ఇచ్చిన విజయాన్ని అహంకారంగా కాకుండా మరింత సేవ చేసే అవకాశంగా భావించాలని హితవు పలికారు.

కార్యకర్తల శ్రమకు హృదయపూర్వక అభినందనలు.

ఈ ఎన్నికల్లో ఎండనక, వాననక కష్టపడిన ప్రతి కార్యకర్తకు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు కృతజ్ఞతలు తెలిపారు. రాత్రింబవళ్లు శ్రమించిన వారు, ఇంటింటికీ తిరిగి కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేసిన వారు, నాయకులు, అభిమానులు, మూడు పార్టీల శ్రేణుల సమష్టి కృషి వల్లే ఈ ఘన విజయం సాధ్యమైందని కొనియాడారు. పార్లమెంటు సభ్యులు, మూడు పార్టీల జిల్లా అధ్యక్షులు, శాసనసభ్యులు, పార్టీ ముఖ్య నాయకులు అందించిన సహకారం కూడా విజయానికి కీలకమని పేర్కొన్నారు. కొండపల్లి పురపాలక సంఘంలో 33 స్థానాలతోనో, మండల పరిషత్ ప్రాదేశిక స్థానాల్లో 62 విజయాలతోనో, జిల్లా పరిషత్ ప్రాదేశిక స్థానాల్లో ఐదింటికి ఐదు స్థానాల విజయంతోనో ఆగిపోకూడదని, రానున్న పంచాయతీ ఎన్నికల్లో ప్రతి గ్రామంలో కూటమి జెండా ఎగరాలన్నదే మన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలని, ప్రతి కుటుంబం సంతోషంగా ఉండాలని, ప్రతి కార్యకర్త గర్వంగా తలెత్తుకుని నిలబడేలా ప్రజాసేవ సాగాలని ఆకాంక్షించారు. మైలవరం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు అందరూ ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిస్తూ జై తెలుగుదేశం, జై జనసేన, జై భారతీయ జనతా పార్టీ, జై కూటమి, జై ఆంధ్రప్రదేశ్ నినాదాలతో ప్రసంగాన్ని ముగించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులను ఘనంగా సత్కరించారు,





టిడిపి సీనియర్ నాయకులు భార్గవ రామ్ భూమా జగత్ విఖ్యాత్ రెడ్డిని కలిసిన ఎంపీటీసీ జెడ్పీటీసీలు





ఆళ్లగడ్డ ప్రతినిధి నవంబర్ 10 నంది పత్రిక

నియోజకవర్గంలోని స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించిన ఎంపీటీసీ, జడ్పిటిసి అభ్యర్థులు మంగళవారం నాడు ఆళ్లగడ్డ పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆళ్లగడ్డ టిడిపి సీనియర్ నాయకులు భార్గవ రామ్ టిడిపి యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి లను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా పూలమాలతో సన్మానించి వారికి కృతజ్ఞతలు తెలిపారు. తమను కలిసిన ఎంపీటీసీ జడ్పిటిసి సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి నాయకులు కార్యకర్తలు భూమా అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో విద్యార్థినులకు రక్షణ కరువు..

- కేఎస్ఎన్ కళాశాలలో రెండో అంతస్తు నుంచి పడి విద్యార్థినికి తీవ్ర గాయాలు ఘటనపై సమగ్ర విచారణ జరపాలి

- మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ విద్యార్థులకి అభద్రత

- కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యం తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

- విద్యార్థినికి పూర్తి వైద్య ఖర్చులతో పాటు విద్య ఖర్చులను ప్రభుత్వమే భరించాలి.

- రాష్ట్రంలోని అన్ని కళాశాలల్లో విద్యార్థినుల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి.

- ఇలాంటి ఘటనలు జరుగుతున్న ప్రశ్నించే డిప్యూటీ సీఎం మౌనం!

- 'బేటీ బచావో.. బేటీ పడావో' ఎక్కడ????

అనంతపురం బ్యూరో చీఫ్ నవంబర్ 10 నంది పత్రిక

అనంతపురంలోని కేఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో బీఏ హిస్టరీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి వసంత ఉదయం కళాశాల రెండో అంతస్తు నుంచి కిందపడి తీవ్రంగా గాయపడటం విద్యార్థినిల తల్లితండ్రులలో ఆందోళన కలిగిస్తోందని ఘటనపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అనంతపురం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ యాదవ్ డిమాండ్ చేశారు.

అనంతరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినిని, ఆమె తల్లిదండ్రులను చంద్రశేఖర్ యాదవ్ పరామర్శించి ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో కళాశాలలకు వెళ్లాలంటేనే విద్యార్థినుల తల్లిదండ్రులు భయపడే పరిస్థితి నెలకొందని విమర్శించారు. మహిళల భద్రత కోసం ప్రచారం చేసే 'బేటీ బచావో.. బేటీ పడావో' నినాదం ఎక్కడికి పోయింది? అని ప్రశ్నించారు.రాష్ట్రంలో విద్యార్థినులపై వరుసగా చోటుచేసుకుంటున్న దాడులు, అనుమానాస్పద ఘటనలు, ఆత్మహత్యలపై ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ విద్యార్థుల భద్రతను కాపాడటంలో విఫలమయ్యారని, బాధ్యత వహించి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రశ్నించే డిప్యూటీ సీఎం విద్యార్థినుల భద్రత విషయంలో మౌనంగా ఉండటం దేనికి సంకేతమని ప్రశ్నించారు.ప్రభుత్వం తక్షణమే స్పందించి వసంత ఘటనపై నిష్పక్షపాతంగా సమగ్ర విచారణ జరిపి కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యం తేలితే బాధ్యులపై కఠిన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని,విద్యార్థినికి మెరుగైన వైద్యం అందించి, వైద్య ఖర్చులతో పాటు విద్యా ఖర్చులను ప్రభుత్వమే భరించాలని,బాధిత కుటుంబానికి తగిన న్యాయం, ఆర్థిక భరోసా కల్పించాలని,రాష్ట్రంలోని అన్ని కళాశాలల్లో విద్యార్థినుల భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు విద్యార్థుల ప్రాణాలు, మహిళా విద్యార్థినుల భద్రత ప్రభుత్వానికి పట్టకుండా పోతుందని ఇలానే ఉంటే వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం తరఫున పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని చంద్రశేఖర్ యాదవ్ కూటమి ప్రభుత్వాని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో హేమంత్, బబ్లు, శేఖర్, రాంచరణ్, ఫయాజ్, రాహుల్ రెడ్డి, రఫీ,సాయి, లోకేష్, పులి కార్తికేయ తదితరులు పాల్గొన్నారు





బిజినెస్

ట్రంప్ కామెంట్స్ మరింతగా దిగొచ్చిన చమురు ధర

ఇంటర్నెట్ డెస్క్: అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడాయిల్ ధర మంగళవారం మరింతగా పడిపోయింది. గత సెషన్‌లో 6 శాతం మేర తగ్గిన ధర తాజా సెషన్‌లో మరో 3.1 శాతం మేర తగ్గి 89.62 డాలర్లుకు (బ్యారెల్ ధర) చేరుకుంది. ఇరాన్‌పై అమెరికా దాడి చేయబోదన్న సూచనలు బలపడుతున్న నేపథ్యంలో ముడి చమురు ధర క్రమంగా దిగొస్తోంది. అమెరికా మిడ్‌టర్మ్ ఎన్నికల ఫలితాలపై ఇరాన్ యుద్ధం తీవ్ర ప్రభావం చూపింది. ఈ ఎన్నికల్లో ప్రజలు అధికార రిపబ్లికన్ పార్టీని తిరస్కరించి డెమోక్రాట్లకు పట్టం కట్టిన విషయం తెలిసిందే.ఈ నేపథ్యంలో సోమవారం అధ్యక్షుడు కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌పై సైనిక దాడుల అవసరం ఉండకపోవచ్చని అన్నారు. అయితే, తాము ఆయుధాలతో సిద్ధంగా ఉన్నామని కూడా హెచ్చరించారు. ట్రంప్ మాటాల్లో మార్పుతో మార్కెట్‌లో ధరలు పడిపోయాయి. నాటకీయ స్థాయిలో తగ్గాయి. అక్టోబర్ చివర్లో ఆరు నెలల గరిష్ఠానికి చేరుకున్న ధరలు ఆ తరువాత క్రమంగా తగ్గుతూ వచ్చాయి. జులై నెల తరువాత తొలిసారిగా అమెరికాలో గ్యాలన్ గ్యాసోలిన్ (పెట్రోల్) ధర 4 డాలర్ల దిగువకు చేరడంతో సామాన్యులు ఊపిరి పీల్చుకున్నారు. సోమవారం శ్వేతసౌధం వద్ద అధ్యక్షుడు ట్రంప్ మాట్లాడుతూ సైనికంగా ఇరాన్ పని అయిపోయినట్టేనని చెప్పారు. ఇకపై సైనిక దాడుల అవసరం ఉండకపోవచ్చని అన్నారు. ఖతారీ ప్రధానితో సమావేశం అనంతరం ఈ వ్యాఖ్యలు చేశారు.



పండగ ముగిసింది.. బాదుడు మొదలైంది..


విమాన ప్రయాణం ఇక భారమే!



దీపావళి పండగ ముగియడంతో సొంతూళ్ల నుంచి చెన్నై నగరానికి తిరిగి వచ్చేవారి సంఖ్య ఒక్కసారిగా పెరిగింది. మంగళవారం నుంచి కార్యాలయాలు, విద్యాసంస్థలు తిరిగి ప్రారంభం కానుండటంతో సోమవారం చెన్నై దేశీయ విమానాశ్రయం ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. ఈ అనూహ్యమైన డిమాండ్‌తో విమానయాన సంస్థలు చార్జీలను అమాంతం పెంచేయడంతో ప్రయాణికులకు చుక్కలు కనిపించాయి. పండగ రద్దీ కారణంగా అనేక రూట్లలో టికెట్లు పూర్తిగా అమ్ముడయ్యాయి. ఇదే అదునుగా విమాన చార్జీలు సాధారణ స్థాయి కంటే రెండు నుంచి మూడు రెట్లు అధికమయ్యాయి. ముఖ్యంగా తమిళనాడులోని ఇతర నగరాల నుంచి చెన్నైకి వచ్చే విమాన టికెట్ల ధరలు రికార్డు స్థాయికి చేరాయి. సాధారణంగా రూ. 3,832 ఉండే సేలం-చెన్నై టికెట్ ధర ఏకంగా రూ. 13,098కి చేరింది.

అలాగే, తిరుచ్చి నుంచి రూ. 4,954గా ఉండే చార్జీ రూ. 14,666కి, తూత్తుకుడి నుంచి రూ. 7,045గా ఉండే టికెట్ రూ. 17,639కి పెరిగింది. మధురై నుంచి కూడా టికెట్ ధర రూ. 4,673 నుంచి రూ. 11,877కు పెరిగింది. కేవలం రాష్ట్రంలోని నగరాల నుంచే కాకుండా, దేశంలోని ప్రధాన నగరాల నుంచి కూడా ఇదే పరిస్థితి కనిపించింది. ఢిల్లీ నుంచి చెన్నైకి సాధారణంగా రూ. 10,167 ఉండే టికెట్ ధర రూ. 15,100కి చేరగా, ముంబై నుంచి చార్జీ రూ. 6,160 నుంచి రూ. 11,808కి పెరిగింది. విమానాల్లోనే కాకుండా బస్సులు, రైళ్లు కూడా ప్రయాణికులతో నిండిపోయాయి. పండగకు ముందు చెన్నై నుంచి వెళ్లే సమయంలోనూ ఇదే తరహాలో చార్జీలు పెరిగిన విషయం తెలిసిందే.

ఏఐ భయాలు, సీఈఓ ఎఫైర్.. ఎన్విడియా విలువలో రూ.147 లక్షల కోట్ల ఆవిరి



ప్రపంచంలోనే అతిపెద్ద చిప్ తయారీ సంస్థల్లో ఒకటైన ఎన్విడియాకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. నెల రోజులకు పైగా కాలంలో కంపెనీ మార్కెట్ విలువ ఏకంగా 1.57 లక్షల కోట్ల డాలర్లు (సుమారు రూ.147.36 లక్షల కోట్లు) ఆవిరైంది. ఈ మొత్తం భారత్ వార్షిక స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో దాదాపు మూడో పంతుతో సమానం. చైనా గూఢచర్య ఆరోపణలు, కంపెనీ సీఈవో జెన్సన్ హువాంగ్ చుట్టూ నెలకొన్న వివాదాలు, కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో పెట్టుబడుల భవిష్యత్తుపై ఆందోళనలు ఎన్విడియా షేర్లపై ప్రభావం చూపుతున్నాయి. అక్టోబర్‌లో 52 వారాల గరిష్ఠ స్థాయికి చేరిన సమయంలో ఎన్విడియా మార్కెట్ విలువ 5.88 లక్షల కోట్ల డాలర్లుగా ఉంది. నవంబర్ 9 నాటికి అది 4.31 లక్షల కోట్ల డాలర్లకు పడిపోయింది. దీంతో కంపెనీ విలువలో 1.57 లక్షల కోట్ల డాలర్ల మేర కోత పడింది. ఈ నష్టం టెస్లా మొత్తం మార్కెట్ విలువైన 1.49 లక్షల కోట్ల డాలర్లను కూడా మించిపోయింది. నవంబర్ 9న ఎన్విడియా షేరు 178.67 డాలర్ల వద్ద ముగిసింది. 52 వారాల గరిష్ఠ ధర 243.37 డాలర్లతో పోలిస్తే 26 శాతానికి పైగా తగ్గింది. గత వారంలో 14 శాతం, గత నెలలో 22 శాతం క్షీణించింది. ఏఐ రంగంలో పెట్టుబడులు ఇదే స్థాయిలో కొనసాగుతాయా? అన్న సందేహాలు, నియంత్రణపరమైన అనిశ్చితి కూడా షేర్ల పతనానికి కారణమవుతున్నాయి. మరోవైపు సీఈవో జెన్సన్ హువాంగ్ చుట్టూ గూఢచర్య ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. సింగపూర్‌కు చెందిన డేటా సెంటర్ సంస్థ మెగాస్పీడ్‌లో గతంలో పనిచేసిన ఆలిస్ హువాంగ్‌తో తనకు వివాహేతర సంబంధం ఉన్నట్లు జెన్సన్ ఉద్యోగుల వద్ద అంగీకరించిన విషయం తెలిసిందే. చైనా నిఘా సంస్థ తరఫున పనిచేస్తున్నారనే అనుమానాలు ఆమెపై ఉన్నట్లు అమెరికా నిఘా వర్గాల రహస్య నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం.

ముంబై ఇండియన్స్‌కు అర్షదీప్ సింగ్.. ట్రేడ్ ఖరారు చేసిన తండ్రి!

ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు అతిపెద్ద సంచలనం నమోదైంది. యువ పేస్ బౌలర్ అర్షదీప్ సింగ్ పంజాబ్ కింగ్స్‌ను వీడి ముంబై ఇండియన్స్ జట్టులోకి మారాడు. ఈ భారీ ట్రేడ్‌కు సంబంధించి పంజాబ్ కింగ్స్, ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీలు ఇంకా అధికారిక ప్రకటన విడుదల చేయనప్పటికీ, ఈ విషయాన్ని అర్షదీప్ తండ్రి దర్శన్ సింగ్ స్వయంగా ధ్రువీకరించారు. ప్రస్తుతం న్యూజిలాండ్ పర్యటనలో తన కుమారుడితో పాటు ఉన్న ఆయన, ఈ ట్రేడ్‌కు సంబంధించిన అధికారిక సమాచారం తమకు అందిందని ఒక వీడియో ఇంటర్వ్యూలో వెల్లడించారు. దీంతో ఈ ట్రేడ్ దాదాపు ఖరారైనట్లేనని స్పష్టమైంది. మాకు కూడా ఆశ్చర్యంగానే ఉంది: దర్శన్ సింగ్ ప్రముఖ క్రీడా జర్నలిస్ట్ విమల్ కుమార్‌తో న్యూజిలాండ్‌లో మాట్లాడిన దర్శన్ సింగ్, ఈ ట్రేడ్ గురించి తమకు ముందుగా ఎలాంటి సమాచారం లేదని తెలిపారు. “ఈ ట్రేడ్ జరిగిందని మాకు కూడా ఆశ్చర్యంగానే తెలిసింది. దీని గురించి మాతో ముందస్తు చర్చలు ఏమీ జరపలేదు. ఇప్పుడు ట్రేడ్ అయినట్లు అధికారిక సమాచారం అందిందని అనుకుంటున్నాను” అని ఆయన పేర్కొన్నారు. అయితే, ఈ ఒప్పందంలో భాగంగా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా పంజాబ్ కింగ్స్‌కు వెళ్తున్నాడా? లేదా? అనే విషయంపై ఆయన ఎలాంటి వ్యాఖ్య చేయలేదు. పంజాబ్‌ను వీడటం భావోద్వేగంగా ఉంది పంజాబ్ కింగ్స్‌తో అర్షదీప్‌కు ఉన్న అనుబంధాన్ని దర్శన్ సింగ్ గుర్తుచేసుకున్నారు. “ఒక వ్యక్తి ఎక్కడ పుట్టినా, ఆ ప్రదేశంతో జీవితాంతం ఒక ప్రత్యేకమైన అనుబంధం ఉంటుంది. అర్షదీప్‌కు పంజాబ్ కింగ్స్ అలాంటిదే. ఆ జట్టుతో అతనికి బలమైన బంధం ఉంది. అందుకే ఆ జట్టును వీడాల్సి రావడం కొంచెం భావోద్వేగంగా



అనిపిస్తోంది” అని ఆయన అన్నారు. అయితే, ప్రతీ ఫ్రాంచైజీ తమ జట్టు సమతూకం కోసం ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటుందని, వారు కూడా అందుకు అనుగుణంగానే అర్షదీప్‌ను ట్రేడ్ చేసి ఉంటారని అభిప్రాయపడ్డారు. ముంబై జట్టులోకి వెళ్లడం సంతోషమే పంజాబ్‌ను వీడటం బాధగా ఉన్నప్పటికీ, ముంబై ఇండియన్స్ జట్టులోకి వెళ్లడంపై దర్శన్ సింగ్ సంతోషం వ్యక్తం చేశారు. “ముంబై ఇండియన్స్‌లో చేరడం మాకు చాలా ఆనందంగా ఉంది. అక్కడ అతని పాత కెప్టెన్ రోహిత్ శర్మతో పాటు జస్ప్రీత్ బుమ్రా, సూర్యకుమార్ యాదవ్ వంటి పాత సహచరులు ఉన్నారు. కాబట్టి మేం సంతోషంగా ఉన్నాం” అని వివరించారు.

సోపర్స్

ఐఓఏ కమిషన్ చైర్‌పర్సన్‌గా సింధు గర్వంగా ఉందన్న మంత్రి నారా లోకేశ్

ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి, తెలుగు తేజం పీవీ సింధుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అథ్లెట్స్ కమిషన్ చైర్‌పర్సన్‌గా సింధు ఎన్నికైన సందర్భంగా ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. “రెండు పర్యాయాలు ఒలింపిక్ పతకాలు సాధించి, బ్యాడ్మింటన్ కోర్టులో నవతరానికి స్ఫూర్తిగా నిలిచిన పీవీ సింధు.. ఇప్పుడు భారత క్రీడారంగంలో కీలక నాయకత్వ బాధ్యతలను చేపట్టడం గర్వకారణం. సింధూ, మీ విజయాలను చూసి ఆంధ్రప్రదేశ్ గర్విస్తోంది” అని లోకేశ్ తన సందేశంలో కొనియాడారు. క్రీడాకారిణిగా అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో మైలురాళ్లను అధిగమించిన ఆమె, ఇప్పుడు క్రీడా పరిపాలనలోనూ విజయవంతంగా రాణించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కీలక బాధ్యతల్లో సింధు ఘన విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు లోకేశ్ పేర్కొన్నారు. సింధు ఈ నూతన పదవిని చేపట్టడం భారత క్రీడారంగానికి శుభపరిణామమని పలువురు క్రీడాభిమానులు, ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఇదే నా బౌలింగ్ విజయ రహస్యం: అన్షుల్ కాంబోజ్

పిచ్ స్వభావం, మ్యాచ్ పరిస్థితులకు అనుగుణంగా కచ్చితమైన లైన్, లెంగ్త్‌తో బౌలింగ్ చేయడమే తన విజయ రహస్యమని భారత యువ పేసర్ అన్షుల్ కాంబోజ్ తెలిపాడు. బౌలింగ్‌లో క్రమశిక్షణ పాటించడం, పరిస్థితులను త్వరగా అంచనా వేసి సరైన ప్రదేశాల్లో బంతులు వేయడంపై దృష్టి పెడుతున్నానని చెప్పాడు. న్యూజిలాండ్‌తో జరుగుతున్న వన్డే సిరీస్‌లో తన ప్రదర్శనకు ఇదే కారణమని వివరించాడు. క్రికెట్‌లో తన ఎదుగుదల గురించి మాట్లాడుతూ.. 13 ఏళ్ల వయసులో ఆట ప్రారంభించినట్లు కాంబోజ్ తెలిపాడు. హర్యానా తరఫున ఆడిన అనుభవం తనకు ఉపయోగపడుతోందన్నాడు. అక్కడి వాతావరణం, పిచ్‌లకు న్యూజిలాండ్‌లోని పరిస్థితుల్లో కొంత పోలిక ఉండటంతో ఇక్కడి పరిస్థితులకు అలవాటు పడటం సులువైందని పేర్కొన్నాడు. సిరీస్‌లో భాగంగా హామిల్టన్‌లోని సెడ్డన్ పార్క్‌లో జరగాల్సిన మూడో వన్డేకు ముందు అతడు ఈ విషయాలు వెల్లడించాడు. భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించడంతో తన కల నిజమైందని కాంబోజ్ చెప్పాడు. దేశం తరఫున ఆడాలని ప్రతి క్రికెటర్ కలలు కంటాడని, జాతీయ జట్టులో చోటు దక్కడం తనకు ఎంతో సంతోషాన్నిస్తోందని తెలిపాడు. చెన్నై సూపర్ కింగ్స్ తరఫున ఆడిన అనుభవం కూడా తనకు ఎంతో



నేర్పిందని చెప్పాడు. మహేంద్ర సింగ్ ధోనీ, ప్రధాన కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ మార్గదర్శకత్వంలో ఎన్నో విషయాలు నేర్చుకున్నానని వెల్లడించాడు. ఫలితాల గురించి ఎక్కువగా ఆలోచించకుండా మైదానంలో తన బాధ్యతలపై దృష్టి పెడుతున్నట్లు తెలిపాడు. ఆటను మెరుగుపరుచుకునేందుకు నిరంతరం ప్రయత్నిస్తున్నానని వివరించాడు.న్యూజిలాండ్ పరిస్థితులకు అలవాటు పడటంలో వాతావ రణం, పిచ్‌లను అర్థం చేసుకోవడం కీలకమని కాంబోజ్ తెలిపాడు. భారత్-ఏ సిరీస్ సమయంలో ఇక్కడి వాతావరణానికి అలవాటు పడటంతో పాటు ఏ ప్రాంతాల్లో బంతులు వేయాలనే విషయంపై దృష్టి పెట్టినట్లు చెప్పాడు.

సంపాదకీయం

అబలలపై అమానవీయతకు అంతం ఎప్పుడు?

దేశంలో, రాష్ట్రంలో మహిళలపై, అభం శుభం తెలియని పిల్లలపై ఏదైనా అమానవీయ ఘటన జరిగినప్పుడు సమాజం నివ్వెర పోతోంది. దిగ్గున నిద్ర లేస్తోంది. ఒక్కొక్క గొంతుక వంద గొంతుకలై చట్టాలను, అమలు చేసే పోలీసులను నిగ్గదీస్తాయి. ప్రభుత్వాలపై ప్రశ్నల వర్షం కురిపి స్తాయి. నాలుగు రోజులు గడవగానే ఎవరి పనులో వాళ్లు బిజీ అయిపో తారు. మళ్లీ దారుణం జరగ్గానే తుళ్లిపడి లేస్తారు. కారణాలు, పరిష్కా రాలపై మేధోమథనం ఉండదు.ఇటీవల అనంతపురం జిల్లాలోని రాప్తాడులో పాఠశాల విద్యార్థినిపై జరిగిన రాక్షస చర్య అందరినీ మరోమారు నిద్ర లేపింది. బడిలో ఉన్న విద్యార్థినిపై చెట్లు కోసే ఎలక్ట్రికల్ రంపం మిషన్‌తో ఉన్మాది చేసిన ఘాతుకం మానవీయ కోణంపై నెత్తుటి మరక మిగిల్చింది. 2012 డిసెంబర్ 16 రాత్రి ఢిల్లీలో కదులుతున్న బస్సులో 23 ఏళ్ల ఫిజియోథెరఫీ వైద్య విద్యార్థిని 'నిర్భయ'పై ఆరుగురు క్రూరులు జరిపిన ఘాతుకానికి యావత్తు దేశ ప్రజలు నిశ్చేష్టులయ్యారు. 2019 నవంబర్ 27 రాత్రి హైదరాబాద్ శివార్లలో పశువైద్యురాలిపై నలుగురు ముష్కరులు చేసిన అత్యాచారం, హత్య సంఘటన రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలను కోపోద్రిక్తులను చేసింది. ఇటీవల కాలంలో చిన్నపిల్లపై వృద్ధుడి అఘాయిత్యం, ముక్కుపచ్చలారని పసికందులపై అత్యాచారాలు సభ్య సమాజాన్ని బోనెక్కిస్తూనే ఉన్నాయి. ఇలా ఏదో ఒక చోట, ఏదో ఒక అమానవీయ ఘటన జరుగుతూనే ఉంది. ఈ సంఘటనలు ఎందుకు జరుగుతున్నాయి? వీటికి ప్రధాన కారణాలు ఏమిటన్నది మొదటి ప్రశ్న. ఇలాంటి అరాచకాలు, కీచక పర్వాలు జరగకుండా ఉండాలంటే, అటు ప్రభుత్వాలు కానీ, సమాజం కానీ తీసుకోవాల్సిన చర్యలు ఏమిటి? అన్నది రెండో ప్రశ్న.ఏ వ్యక్తీ పుట్టుకతో నేరస్థుడు కాదు, అతను జీవించే విధానమే అతడిని నేరస్థుడిని చేస్తోంది' అంటాడో రచయిత. ఉద్దేశపూర్వకంగా జరిగినా, క్షణికావేశంలో జరిగినా ఈ దారుణాల వెనుక సామాజిక, ఆర్థిక, మానసిక, సాంస్కృతిక కారణాలు ఎన్నో. 1. పితృస్వామ్య (లింగ వివక్ష) భావజాలం. పురుషుడు అధికం, స్త్రీ తక్కువ అన్న పాతకాలపు భావం. ఇప్పటికీ ఈ భావ దారిద్ర్యం మనిషి మస్తిష్కం లోంచి పోలేదు. ఇందులో తల్లిదండ్రుల నిర్లక్ష్యం, పెంపకంలో లోపాలు ఎక్కువ. పిల్లలపై అధ్యయనం ఉండదు. జాగ్రత్తలు చెప్పరు. వారికి కఠినంగానైనా సమాజ మనుగడ గురించి నేర్పరు. 2. అత్యాచారాలకు శిక్షలపై చట్టాల్లో జాప్యం, కఠినమైన శిక్షలు లేకపోవడం. ఏళ్ల తరబడి న్యాయస్థానాల్లో కేసులు అపరిష్కృతంగా ఉండటం. 2012లో నిర్భయ సంఘటన జరిగితే, 2020 మార్చి 20న నిందితులకు ఉరిశిక్ష అమలు చేశారు. ఇప్పటికీ అపరిష్కృతంగా ఉన్న మహిళలపై అఘాయిత్యాల కేసులు ఎన్నో. 3. మాదక ద్రవ్యాలు, డ్రగ్స్ ప్రభావం. మనుషులను మృగాలుగా మార్చేవి ఇవే. చాలా కేసుల్లో మనిషి తత్వం సిగ్గుపడేలా హింసాత్మక ఘటనల వికృత రూపానికి కారణం ఇవే. ప్రభుత్వాలు డ్రగ్స్ నిరోధక కార్యక్రమాలు చేస్తున్నా అవి అంతంత మాత్రమే. వీటిని సమాజం నుంచి దూరం చేయటం అందరి బాధ్యత. 4. సాంస్కృతిక కారణాలు. ఇంటర్నెట్‌లో, సోషల్ మీడియాలో సులభంగా, ఉచితంగా దొరుకుతున్న అశ్లీల చిత్రాలు, హింసాత్మక సందేశాలు. ఇవి మనిషిలోని మానసిక స్థితిని దెబ్బతీస్తాయి. ఏం చేస్తున్నారో, ఎందుకు చేస్తున్నారో అన్న ఇంగితం మరిచిపోయేలా చేస్తాయి. సినిమాలు కూడా నేరప్రవృత్తికి కేంద్రాలుగా మారాయి. 5. ఆర్థిక అవసరాలు కూడా ప్రభావం చూపి, మహిళలపై అఘాయిత్యాలకు, హత్యలకు, చోరీలకు దారితీస్తున్నాయి. ఇలాంటి సామాజిక వికృత రూపాలకు పరిష్కారం ఏమిటి అంటే... రోగానికి కారణాలు తెలుసుకుంటేనే, వైద్యం తెలుస్తుంది. ఇందుకు తల్లిదండ్రులు, చట్టాలు, ప్రభుత్వాల బాధ్యత చాలా ఉంది. సామాజిక చైతన్యవం తమైన కార్యక్రమాల నిర్వహణ, విద్యా ప్రమాణాలు వంటి అన్ని ప్రక్రియల్లో మార్పులు అవసరం. చెట్టు వేరుకు పట్టిన చెదను నిర్మూలించకుండా చెట్టును రక్షించలేం. కొమ్మలకు, రెమ్మలకు మాత్రమే మందు వేస్తే, తుంచేస్తే ప్రయోజనం ఏమిటి? మళ్లీ మళ్లీ చెదపట్టదన్న గ్యారంటీ ఉండదు. మారుతున్న సమాజంలో కొత్త ఆలోచనలు, కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలి. రుగ్మతల కారకాలపై దృష్టి పెడితే సమాజం సిగ్గుపడాల్సిన అవసరం కూడా ఉండదు.



ఓ మనిషి...నీ మరణం తర్వాత నీ ప్రస్థానం ఏమిటి...?

ఓ మనిషీ..ఒక్కసారి ఆగి ఆలోచించు..నువ్వు ఎందు కోసం ఈ పరుగులు పెడుతున్నావు? ఎవరిని మెప్పిం చడానికి ఈ ఆరాటం?దేనికోసం ఈ పోరాటం? జీవితమంతా డబ్బు సంపాదించడానికి, హోదా పెం చుకోవడానికి, పేరు ప్రఖ్యాతులు సంపాది ంచడానికి నువ్వు పడుతున్న తపనకు అంతం ఎక్కడ? ఈ రోజు నీ చుట్టూ పదిమంది ఉండవచ్చు.నీ మాట కు విలువ ఇచ్చేవారు ఉండవచ్చు.నీ హోదాకు గౌరవం ఇచ్చే వారు, నీ అవసరం కోసం నీ చుట్టూ తిరిగేవారు ఉండవచ్చు.నీ పలుకుబడికి తలవం చేవారు,నీ సంపదను చూసి నీతో స్నేహం చేసేవారు ఉండ వచ్చు.కానీ,ఒక్కసారి నీ జీవితం ముగిసిన తర్వాత వీరిలో ఎంతమంది నీ జ్ఞాపకాలను గుండెల్లో మోస్తారు? ఎంతమంది నీ గురించి నిజాయితీగా కన్నీరు పెడతారు? మరణం అనేది మనిషి శరీరానికి ముగింపు కావచ్చు..కానీ, అతని ఆలోచనలకు, మంచితనానికి, సేవాభావానికి ముగింపు కాదు.నువ్వు జీవితాంతం కూడబెట్టిన ఆస్తులు నీతో రావు.నువ్వు నిర్మించుకున్న భవనాలు నీ వెంట నడవవు.నీ పదవులు,నీ అధికారం,నీ పలుకుబడి,నీ రాజకీయ ప్రాబల్యం..ఏదీ నీ చివరి ప్రయాణంలో నీకు తోడుగా రాదు.నువ్వు సంపాదించిన డబ్బు కోసం వారసులు పోటీ పడవచ్చు.నీ పదవి కోసం మరొకరు ఎదురు చూస్తూ ఉండవచ్చు.నువ్వు కూర్చున్న కుర్చీలో ఇంకొకరు కూర్చుంటారు.నువ్వు నడిచిన దారిలో మరొకరు నడుస్తారు.కాలం ఎవరి కోసం ఆగదు.

-అయితే నువ్వు ఈ ప్రపంచానికి వదిలి వెళ్లేది ఏమిటి?

ఎవరైనా ఆకలితో ఉన్నప్పుడు పెట్టిన ఒక్క ముద్ద అన్నం కావచ్చు. కష్టాల్లో ఉన్నవారికి అందించిన చిన్న సహాయం కావచ్చు.అన్యాయానికి గురైన వ్యక్తి పక్షాన నిలబడి పలికిన ఒక్క ధైర్యవచనం కావచ్చు.నీ వల్ల చదువుకున్న ఒక విద్యార్థి కావచ్చు.నీ ప్రోత్సాహంతో ఎదిగిన ఒక వ్యక్తి కావచ్చు.నీ మాటలతో మారిన ఒక మనసు కావచ్చు. ఇవే నీ మరణం తర్వాత కూడా నీ ఉనికిని గుర్తుచేసే నిజమైన ఆనవాళ్లు.మనిషి జీవి తంలో అత్యంత విచిత్రమైన విషయం ఏమిటంటే. బతికున్నప్పుడు ఎదుటివారిని బాధపెట్టడానికి వెను కాడడు. ఒకరిని కించపరుస్తాడు.మరొకరిని మోసం చేస్తాడు.తన ఎదుగుదల కోసం ఇంకొకరి అవకా శాలను తొక్కేస్తాడు. తనకు సహాయం చేసినవారినే మరిచిపోతాడు.అవసరం తీరిపోయాక పరిచయాన్ని కూడా తెంచుకుంటాడు.కానీ,చివరకు అందరూ వెళా ల్సిన గమ్యం ఒక్కటేనన్న సత్యాన్ని మాత్రం మరిచి పోతాడు. నీకు అధికారం ఉన్నప్పుడు నీ చుట్టూ తిరిగి నవారు..అధికారం పోయాక పలకరిం చకపోవచ్చు.నీ దగ్గర సంపద ఉన్నప్పుడు నీకు దగ్గరైనవారు..సంపద కరిగిపోయాక దూరం కావచ్చు.నీ అవసరం ఉన్నం తవరకే నీతో ఉండేవారు కూడా ఉంటారు. కానీ, నువ్వు చూపించిన మానవత్వం మాత్రం ఎప్పటికీ కొందరి హృదయాల్లో నిలిచిపోతుంది.ఓ మనిషీ.. నువ్వు ఎంత గొప్పగా బతికావన్నది కాదు ముఖ్యం..నీ వల్ల ఎంతమంది గొప్పగా బతికే అవకాశం పొందా రన్నదే ముఖ్యం.ప్రతి మనిషి ఒకరోజు ఈ భూమిని విడిచిపెట్టాల్సిందే.పుట్టినప్పుడు ఏమీ తీసుకురాలేదు. వెళ్లేటప్పుడు ఏమీ తీసుకెళ్లలేదు. మధ్యలో గడిపే ఈ కొద్దిపాటి జీవితంలో ద్వేషాలను ఎందుకు పెంచుకో వాలి? కులం, మతం,ప్రాంతం,హోదా,అంతస్తుల పేరుతో మనుషుల మధ్య గోడలు ఎందుకు నిర్మిం చాలి? మనిషిని మనిషిగా చూడలేని సమాజంలో మనం సాధించే అభివృద్ధికి అర్థం ఏమిటి? నిన్ను నమ్మినవారిని మోసం చేయకు.నీకు సాయం చేసిన వారిని మరిచిపోకు.నీకంటే బలహీనంగా ఉన్నవారిని అవమానించకు.నీ మాటతో ఎవరి మనసూ గాయప డకుండా చూసుకో.నీకు చేతనైనంతలో నలుగురికి ఉపయోగపడు.ఎందుకంటే మనిషి జీవితానికి అస లైన విలువ అతను సంపాదించిన సంపదలో కాదు.. అతను పంచిన ప్రేమలో ఉంటుంది.ఒక రోజు నీ ఇంటి ముందు జనాలు గుమిగూడుతారు. నీ ఫొటోకు పూలమాలలు వేస్తారు. నీ గురించి నాలుగు మంచి మాటలు చెబుతారు.కొందరు కన్నీరు పెడతారు. మరికొందరు మౌనంగా నిలబడతారు.ఆ తర్వాత రోజులు గడుస్తాయి.జనాలు తమ పనుల్లో మునిగి పోతారు. నీ పేరును కూడా క్రమంగా మరిచి పోవచ్చు. కానీ,నువ్వు చేసిన ఒక మంచి పని వల్ల ఎవరికైనా జీవితం మారితే..ఆ వ్యక్తి జీవితాంతం నిన్ను గుర్తుంచుకుంటాడు.నువ్వు చూపించిన మాన వత్వం మరొకరిలో మానవత్వాన్ని మేల్కొలిపితే..అదే నీ జీవితానికి కొనసాగింపు.

-ఓ మనిషీ..నువ్వు చనిపోయిన తర్వాత

నీ పేరుతో ఎన్ని ఆస్తులు మిగిలాయన్నది చరిత్రకు ముఖ్యం కాదు.నీ వల్ల ఎంతమంది కన్నీళ్లు తుడుచు కున్నారు? నీ వల్ల ఎంతమంది జీవితాల్లో వెలుగులు నిండాయి? నీ వల్ల ఎంతమంది ఆత్మగౌరవంతో బతకగలిగారు? అన్నదే నీ జీవితానికి అసలైన కొలమానం.మరణం ఎప్పుడు వస్తుందో ఎవరికీ తెలియదు.కానీ, మరణం తర్వాత మనల్ని ఎలా గుర్తుంచుకోవాలో నిర్ణయించుకునే అవకాశం మాత్రం మన చేతుల్లోనే ఉంది.బతికున్నప్పుడు మనిషిగా బతుకు..మరణించిన తర్వాత కూడా మనిషి మనసుల్లో బతికేలా జీవించు.ఎందుకంటే..మనిషి చనిపోయిన రోజు అతని శరీరం మట్టిలో కలు స్తుంది. కానీ,అతని మంచితనం మాత్రం మరొకరి జ్ఞాపకాల్లో జీవిస్తూనే ఉంటుంది. జీవితం అంటే బతకడం మాత్రమే కాదు..మనం లేని రోజున కూడా మన ఉనికికి అర్థం ఉండేలా జీవించడం.చివరికి నువ్వు సంపాదించిన ఆస్తి కాదు..నువ్వు వదిలివెళ్లిన జ్ఞాపకాలే నీ అసలైన చిరునామా.

ఏక్యూఐ 400 దాటితే ప్రాణాలకే ప్రమాదమా?



-100-200 సమస్య మొదలయ్యేది ఇక్కడే!

-200--300 ఊపిరితిత్తుల కే కాదు గుండెకూ ముప్పు!

-300--400 దీర్ఘకాలిక అనారోగ్యానికి సంకేతం!

-400--500 ఆరోగ్యవంతు లకూ తప్పని ప్రమాదం!

-ఏక్యూఐ స్థాయిల్లో ఏది ఎంత ప్రమాదకరం?

దేశ రాజధాని ఢిల్లీని కాలుష్యం ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. దీపావళి వేడుకలు, బాణసంచా పేలుళ్ల తర్వాత గాలి నాణ్యత ఒక్కసారిగా పడిపోయింది. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 400 మార్కును దాటడంతో నగరం విషవా యువుల కోరల్లో చిక్కుకుంది. బయటకు వెళ్తే గొంతు లో మంట కళ్లలో దురద ఆగని దగ్గు శ్వాస తీసు కోవడంలో ఇబ్బందులు ఇలా కాలుష్యం మనిషి ఆరో గ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అయితే ఏక్యూఐ 200, 300, 400 దాటితే శరీరంలో ఎలాం టి మార్పులు వస్తాయి? ఏ స్థాయిలో ప్రాణాలకు ముప్పు పెరుగుతుంది? వైద్య నిపుణులు ఏం హెచ్చరిస్తున్నారు?

-100-200 సమస్య మొదలయ్యేది ఇక్కడే!

గాలి నాణ్యత సూచీ 100 దాటినప్పటి నుంచి సున్నితమైన ఆరోగ్యం కలిగినవారిలో స్వల్ప శ్వాస సంబంధిత సమస్యలు మొదలవుతాయి. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, గుండె, ఊపిరితిత్తుల వ్యాధులతో బాధపడేవారు జాగ్రత్తగా ఉండాలి. గాలిలో ఉండే పీఎం 2.5 సూక్ష్మ ధూళి కణాలు ఊపిరితిత్తుల లోతుల్లోకి చేరి శ్వాసనాళాల్లో మంట, దగ్గు, గొంతు ఇబ్బందులకు కారణమవుతాయి.

-ఏక్యూఐ 200--300 ఊపిరితిత్తులకే కాదు గుండెకూ ముప్పు!

కాలుష్యం మరింత పెరిగితే శరీరంలో వాపు, కణాలకు నష్టం కలిగించే ఆక్సిడేటివ్ స్ట్రెస్ పెరు గుతాయి. రక్తనాళాలపై కూడా ప్రభావం పడుతుంది. దీంతో గుండెపై ఒత్తిడి పెరిగే ప్రమాదం ఉంది. ఆస్తమా, సీఓపీడీ ఉన్నవారికి సమస్యలు తీవ్రం కావచ్చు. ఆరోగ్యంగా ఉన్నవారిలోనూ దగ్గు, ఛాతీలో నొప్పి, వ్యాయామం చేసేటప్పుడు శ్వాస తీసుకోవ డంలో ఇబ్బందులు కనిపించవచ్చు. గుండెపోటు, పక్షవాతం వంటి సమస్యల ముప్పు కూడా పెరిగే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

-300--400 దీర్ఘకాలిక అనారోగ్యానికి సంకేతం!

ఈ స్థాయిలో కాలుష్యానికి ఎక్కువసేపు గురైతే శ్వాసకోశ సంబంధిత అనారోగ్య సమస్యలు పెరుగు తాయి. ఇప్పటికే ఊపిరితిత్తుల వ్యాధులు ఉన్నవారి పరిస్థితి మరింత దిగజారవచ్చు. పిల్లల్లో ఊపిరితిత్తుల ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉంది. గర్భిణులు కాలుష్యానికి గురైతే నెలలు నిండకముందే ప్రసవం, తక్కువ బరువుతో శిశువులు జన్మించడం వంటి సమస్యలతో సంబంధం ఉన్నట్లు అధ్యయనాలు సూచిస్తున్నాయి.

-400--500: ఆరోగ్యవంతులకూ తప్పని ప్రమాదం!

ఇది అత్యంత ప్రమాదకరమైన స్థాయి. ఈ దశలో ఆరోగ్యంగా ఉన్నవారిలోనూ శ్వాస సంబంధిత సమస్యలు కనిపించవచ్చు. దగ్గు, గొంతులో మంట, పిల్లికూతలు, ఛాతీలో నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తవచ్చు. గుండె స్పందనలో అసమా నతలు, గుండెపోటు, పక్షవాతం ముప్పు కూడా పెరుగుతుంది. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, గుండె జబ్బులు ఉన్నవారు, బయట ఎక్కువసేపు పనిచేసే ట్రాఫిక్ పోలీసులు, నిర్మాణ రంగ కార్మికులు, డెలివరీ సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలి. కాలుష్యం రోజుల తరబడి కొనసాగితే ఆస్పత్రుల్లో చేరాల్సిన పరిస్థితులు కూడా పెరగవచ్చు.


-ఏక్యూఐ స్థాయిల్లో ఏది ఎంత ప్రమాదకరం?

అయితే ఏక్యూఐ 200 దాటినప్పుడే ప్రమాదం మొదలవుతుందని భావించకూడదు. తక్కువ స్థాయిలోనూ కాలుష్యం ఆరోగ్యంపై ప్రభావం చూపవచ్చని నిపుణులు చెబుతు న్నారు.భారత కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి గాలి నాణ్యతను ఆరు విభాగాలుగా వర్గీకరిస్తుంది.

0--50: మంచి గాలి నాణ్యత
51--100: సంతృప్తికరం
101--200: మధ్యస్థం
201--300: పేలవం
301--400: అత్యంత పేలవం
401--500: తీవ్ర ప్రమాదకర స్థాయి

-కాలుష్యం నుంచి రక్షించుకోవడం ఎలా?

కాలుష్యం తీవ్రంగా ఉన్నప్పుడు బయట వ్యాయా మాలు, నడకలు తగ్గించాలి. తప్పనిసరిగా బయటకు వెళ్లాల్సి వస్తే సరైన ఫిట్ ఉన్న ఎన్ 95 లేదా ఎఫ్ ఈఎఫ్ 2 మాస్క్ ధరించాలి. ఇంట్లో పొగ, ధూపం, సిగరెట్ వంటి కాలుష్య కారకాలను తగ్గించాలి. పిల్లలు, వృద్ధులు, శ్వాసకోశ సమస్యలున్నవారు బయ ట ఎక్కువసేపు ఉండకూడదు. శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బంది, ఛాతీ నొప్పి వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్య సహాయం పొందాలి. గాలి కాలుష్యం అంటే కేవలం దగ్గు, జలుబు సమస్య మాత్రమే కాదు. అది ఊపిరితిత్తులు, గుండె, రక్తనాళాలపై ప్రభావం చూపే తీవ్రమైన ఆరోగ్య సమస్య. ఏక్యూఐ 400 దాటినప్పుడు ఆరోగ్యవంతులు సైతం ప్రమాదంలో పడే అవకాశం ఉంది. అందుకే కాలుష్య సూచీని గమ నిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవడం అత్యవసరం.



printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com